సూర్య
17వ వసంతంలోకి...
www.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com
బుధవారం | 20 డిసెంబర్ 2023 | హైదరాబాద్
సంపుటి 17 | సంచిక 59
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...
APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు, మార్గశిర మాసం శుక్ల అష్టమి మ.1.43, ఉత్తరాభాద్ర రా 1.37, వర్జ్యం. మ.12.10 నుంచి 1.40 వరకు
రాహుకాలం మ.12.00 నుంచి 1.30 వరకు, దుర్ముహూర్తం ఉ.11.35 నుంచి 12.19 వరకు



పాట్ కమిన్స్
20.5 కోట్లు
సన్‌రైజర్స్ హైదరాబాద్

## ఐపీఎల్ మినీ వేలంలో
# కాసుల పంట

మిచెల్ స్టార్క్
24.75 కోట్లు
కోల్‌కొత్త నైట్‌రైడర్స్





- స్టార్క్ రీ ఎంట్రీ అదిరింది
- ఐపీఎల్‌లో ఆడకూడదనుకున్నవాడికే అత్యధిక రేటు
- వేలంలో కళ్లు చెదిరే ధర పలికిన మిచెల్ స్టార్క్
- ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా మిచెల్ స్టార్క్
- రూ. 24.75 కోట్లకు కొనుగోలు చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్
- ఎనిమిదేళ్ల తరువాత ఐపీఎల్‌లోకి స్టార్క్ రీ ఎంట్రీ
- కమిన్స్ రికార్డును బద్దలు కొట్టిన స్టార్క్
- రూ. 20.50 కోట్లకు కమిన్స్‌ను కొన్న సన్‌రైజర్స్ హైదరాబాద్

*ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 మినీ వేలంలో రికార్డులు బద్దలవుతున్నాయి. ఆస్ట్రేలియా పేసర్ల కోసం ఫ్రాంచైజీలు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నాయి. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను రూ. 20.50 కోట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ దక్కించుకోగా, ఆ జట్టుకే చెందిన స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ కోసం గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ హోరాహోరీగా బిడ్లు వేశాయి.*

6లో

---

## లాభాల్లో స్టాక్ మార్కెట్లు



5లో

- 122 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్
- 34 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- నాలుగున్నర శాతానికి పైగా లాభపడ్డ నెస్లే ఇండియా షేరు విలువ

## పార్లమెంట్ ఘటనపై ప్రతిపక్షాలది
# రాజకీయం
## ప్రధాని మోడీ నిశిత విమర్శ

- భద్రత ఉల్లంఘన ఖండనీయమే
- కాని ప్రతిపక్షాల వైఖరి గర్హనీయం
- దానిని రాజకీయ రంగు ఇస్తున్నారు
- బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోడీ ఆక్షేపణ

6లో



## చైనాలో భారీ
# భూకంపం



- 116 మందికి పైగా మృత్యువాత
- 500 మందికి గాయాలు
- గన్సు ప్రావిన్స్‌లో రిక్టర్ స్కేలుపై 5.9 గా నమోదైన భూకంప తీవ్రత
- పెద్ద సంఖ్యలో కూలిపోయిన ఇళ్లు, భవనాలు
- నిన్న ఉదయం నుంచే మొదలైన రెస్క్యూ ఆపరేషన్ చర్యలు

6లో

## లోక్ సభలో 49 మంది ఎంపీలపై
# సస్పెన్షన్ వేటు



6లో

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తీవ్ర గందరగోళం మధ్య కొనసాగుతున్నాయి. లోక్ సభలోకి దుండగుల చొరబాటు అంశంపై ఉభయ సభలు దద్దరిల్లుతున్నాయి. ఈ నెల 13న జరిగిన ఈ భద్రత వైఫల్యంపై కేంద్ర హోమ్ శాఖ మంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ పర్వం కొనసాగుతోంది. తాజాగా లోక్ సభలో మరి49 మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారు.

సూర్య వెబ్‌సైట్
సూర్య ఈ - పేపర్

## అంతా ఇంతే!




ప్రధాని అవ్వాలనే కోరిక నెరవేరక పోయినా రామమందిరం చూసొస్తారన్నమాట

## మేడిగడ్డపై సర్కారు
# ఫోకస్



3లో

- నిరంతర సమీక్షలు
- గత ప్రభుత్వానికి బిగుస్తున్న ఉచ్చు
- మూడు పిల్లర్లు కుంగిపోవడంపై లోతుగా పరిశీలన
- హైకోర్టుకు వెళ్లిన కాంగ్రెస్
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- ఇరిగేషన్ నిపుణులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చ

# కార్యాచరణపై కసరత్తు

- మరో రెండు గ్యారెంటీలకు గ్రీన్ సిగ్నల్
- ఈ నెల 28 నుంచి పింఛను పెంపు
- రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలుకు ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయం
- కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం నేపథ్యం రెండు గ్యారెంటీలకు అదే రోజు ముహూర్తం
- పెంచే పెన్షన్‌తో ఏటా దాదాపు 21,600 కోట్ల భారం
- సిలిండర్లతో 4,450 కోట్ల భారం
- వికలాంగుల పెన్షన్ పెంపుదలపై రాని స్పష్టత



3లో

## ఫిర్యాదులకు సత్వర మోక్షం

- ప్రాధాన్యత ప్రాతిపదికన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు
- ఇక ప్రజావాణికి పెద్దపీట
- ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారి నియామకం
- నోడల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించనున్న దాసరి హరిచందన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నజర్



6లో

## పార్లమెంట్ ఎన్నికలపై కేసీఆర్ ఫోకస్

- బీఆర్ఎస్ ఎంపీలతో సమావేశం కానున్న కెసిఆర్
- మెజారిటీ సీట్లు గెలుచుకోవాలని లక్ష్యంగా అడుగులు
- బీఆర్ఎస్ ఎంపీలను హైదరాబాద్‌కు రావాలని కేసీఆర్ ఆదేశం

సూర్య
హైదరాబాద్
బుధవారం
20 డిసెంబర్ 2023





# ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం చేయాలి

ఆంధ్ర సారస్వత పరిషత్ చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో జరిగే రెండవ ప్రపంచ తెలుగు మహాసభల కరపత్రికను ఆవిష్కరించిన టిప్స్ పాఠశాల అధినేత బాల త్రివుర సుందరి మాస్ట్రో గజల్ శ్రీనివాస్, ముఖ్య సంచాలకులు కేశిరాజు రాంపప్రసాద్, శోభాయాత్ర సంచాలకులు సుంకవల్లి మురళి సుమేధా వెంకట్ రాజు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదుగురు రాష్ట్ర గవర్నర్లు నలుగురు హైకోర్టు న్యాయమూర్తులు ముగ్గురు కేంద్ర మంత్రులు, ఎందరో సినీ టీవీ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమానికి విచ్చేస్తున్నారని, సంక్రాంతికి ముందే తెలుగు పండుగ రాజమహేంద్రవరం వస్తున్నదని, ఎందరో ప్రముఖ కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు సినీ, టీవీ కళాకారుల సాంస్కృతి కార్యక్రమాలు ప్రాచీన తెలుగు కళలకు చెందిన కార్యక్రమాలు ఈ మూడు రోజులు పాటు జరుగుతున్నాయని, అందరూ ఆహ్వానితులేనని ఆయన ఈ సందర్భంగా తెలిపారు, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణ అన్నారు. నన్నయ్యకు, రాజరాజ నరేంద్రులకు నీరాజనం ఇవ్వడం ఈ తెలుగు మహాసభకు గర్వకారణం అని అన్నారు టిప్స్ అధినేత బాల త్రివుర సుందరి మాట్లాడుతూ తెలుగు మహాసభల కార్యక్రమాల వైభవం బావున్నదని అన్నారు.

# రైతులకు రెట్టింపు ఆదాయమే లక్ష్యం

**● నాణ్యతకు పెద్దపీట వేసిన జగన్ ప్రభుత్వం ● నియోజకవర్గ స్థాయిలో అగ్రీల్యాబ్స్‌లు తెచ్చిన ఏకైక రాష్ట్రం ● ఆర్బీకేల ద్వారా రైతు ముంగిట నాణ్యమైన ఉత్పాదకాలు ● ధరల స్థిరీకరణ నిధి ద్వారా పంటలకు కనీస మద్దతు ధర ● పంటలకు ఇండి గ్యాప్ సర్టిఫికేషన్ ఇస్తోన్న తొలి రాష్ట్రం ● సర్టిఫికేషన్‌తో రైతులకు ఎమ్మెస్పీ కంటే రెట్టింపు ఆదాయం ● క్యూసీఐతో అవగాహన ఒప్పందంతో రైతులకు మరింత లబ్ధి ● ఏపీ గున్వత్ సంకల్ప్ వర్క్‌షాప్‌లో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి**



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : రైతులు తాము పండించిన పంటలకు మద్దతు ధర కంటే రెట్టింపు ఆదాయం సమకూర్చడమే లక్ష్యంగా ఎన్నో సంస్కరణలు, మరెన్నో విప్లవాత్మక మార్పులు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు ఉన్న సంక్షేమ ఫలాలు అందించడమే తప్ప ఇలా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చిన దాఖలాలు లేవన్నారు. విజయవాడలో మంగళవారం జరిగిన ఏపీ గన్వత్ సంకల్ప వర్కుషావులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారు తన పాలనలో అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. పాదయాత్రలో రైతుల కష్టాలు తెలుసుకున్న ఆయన ప్రతీ విషయంలోనూ వారికి అండగా నిలవాలన్న సంకల్పంతో రైతులకు ఓ వైపు సంక్షేమ ఫలాలు అందిస్తూనే, మరోవైపు వారి అభ్యున్నతి కోసం బలమైన వునాదులు వేసిందన్నారు. గ్రామస్థాయిలో ప్రతీ రైతును చేయిపట్టి నడిపించేందుకు దేశంలో మరెక్కడా లేని విధంగా ఆర్బీకే వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. ఆర్బీకేలకు అనుబంధంగా యంత్ర సేవా కేంద్రాలు, గోదాములతో కూడిన మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేసిందన్నారు. విత్తు నుంచి విక్రయం వరకు ఆర్బీకేల ద్వారా రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. ధాన్యంతో సహా ఇతర పంట ఉత్పత్తులను కళ్లాల నుంచే ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తూ ప్రతీ రైతుకు మద్దతు ధర దక్కేలా చేస్తోందన్నారు. అలాగే నాణ్యమైన ఉత్పాదకాలను అందించడమే లక్ష్యంగా నియోజకవర్గ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. రైతుల కోసం ఇలాంటి వ్యవస్థలు ఏర్పాటు చేయాలని గత పాలకులు ఆలోచన కూడా చేయలేదన్నారు. వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందించడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు ఉచిత విద్యుత్, యూనివర్సల్ కవరేజ్ కింద నోటిఫైడ్ పంటలకు ఉచిత పంటల బీమా, వడ్డీ లేని రుణాలు, కనీస మద్దతు ధరకు రైతు క్షేత్రం వద్ద పంటల ఉత్పత్తుల కొనుగోలు, 3వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్స్, వ్యవసాయ యాంత్రీకరణ ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆర్బీకేల ఏర్పాటు ఓ విప్లవాత్మక మార్పు అని కొనియాడారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు పంపిణీతో పాటు సాగులో రైతులకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడం, పొలంబడుల ద్వారా నాణ్యమైన దిగుబడుల సాధనకు శిక్షణ ఇవ్వడం, ఈ క్రాప్ బుకింగ్, పాడి, ఆక్వా రైతులకు నాణ్యమైన సీడ్, ఫీడ్ అందించడంతో పాటు బ్యాంకింగ్ సేవలను గ్రామ స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు, అవార్డులు, రివార్డులతో నేడు మన ఆర్బీకేలు దేశానికే కాదు.. ప్రపంచానికే ఓ రోల్‌మోడల్‌గా నిలిచాయన్నారు. ఉద్యాన పంటల హబ్‌గా ఏపీ కొత్త రికార్డులను నెలకొల్పుతోందన్నారు. బొప్పాయి, టమాటా, కొకో, పామాయిల్‌లో మొదటి స్థానంలో నిలవగా, అరటి, బత్తాయి, వంగ, మిరపలో రెండో స్థానంలో, మామిడి, ఉల్లి, జీడిమామిడిలో మూడో స్థానంలో ఏపీ నిలిచిందన్నారు. రొయ్యలు, చేపలు, గుడ్ల ఉత్పత్తిలో దేశంలోనే నెం.1 స్థానంలో నిలిచిందన్నారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీలో భాగంగా పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటుచేస్తోందన్నారు. రూ.17వేల కోట్ల అగ్రి ఇన్‌ఫ్రాఫండ్స్ సాయంతో ఫుడ్ ప్రాసెసింగ్‌ను బలోపేతం చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటు కోసం 48వేల ఎకరాలను అందుబాటులో ఉంచామన్నారు. తాజాగా క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ఇస్తున్నామన్నారు. ఫలితంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సర్టిఫికేషన్ జారీ చేద్వారా 130 దేశాల్లో రైతులు పండించిన పంటలను అమ్ముకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఖరీఫ్23లో పైలెట్ ప్రాజెక్టు కింద 600 హెక్టార్లలో 33 ఎఫ్‌పీవోలు పండించిన వ్యవసాయ, ఉద్యాన పంటలకు గ్యాప్ సర్టిఫికేషన్ జారీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు అర్హత పొందిన 14 ఎఫ్‌పీవోలకు గ్యాప్ సర్టిఫికేషన్‌లు నా చేతుల మీదుగా జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ వర్కుషావులో క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ జాక్సా షా, సీఈఇ డాక్టర్ ఏ రాజ్, వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్, ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీధర్, సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు, పశుసంవర్ధక శాఖడైరెక్టర్ అమరేంద్రకుమార్, మత్స్యశాఖ కమిషనర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



## అదనపు రుణాలు పొందేందుకు ఏపీ సహా 6 రాష్ట్రాలకు కేంద్రం అనుమతి



న్యూఢిల్లీ : విద్యుత్ రంగంలో సంస్కరణలను అమలు చేసినందుకు గాను అదనపు రుణాలు పొందేందుకు ఆరు రాష్ట్రాలకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. అదనంగా 0.5 శాతం రుణాలు పొందేందుకు అనుమతిని మంజూరు చేసింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు అనుమతిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. ఆ ఆరు రాష్ట్రాల్లో ఆంధ్ర ప్రదేశ్ కూడా ఉంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 12 రాష్ట్రాలకు ఈ అవకాశం లభించగా, ఇప్పుడు కేవలం ఆరు రాష్ట్రాలకు అనుమతి రావడం గమనార్హం. ఆ ఆరు రాష్ట్రాల్లో ఆంధ్ర ప్రదేశ్, అసోం, కేరళ, రాజస్థాన్, సిక్కిం, పశ్చిమ బెంగాల్ ఉన్నాయి. కేంద్ర ఆర్థిక శాఖ కల్పించిన అవకాశంతో ఏపీ ప్రభుత్వం మరి రూ. 5,858 కోట్ల అప్పు తీసుకునే వెసులుబాటు కలిగింది.

## పయ్యావుల కేశవ్ అరెస్ట్ తీవ్రంగా ప్రతిఘటించిన రైతులు



విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి :టీడీపీ సీనియర్ నేత పయ్యావుల కేశవ్ ను ఉరవకొండలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఇవాళ గుంతకల్లు బ్రాంచి కెనాల్ రైతులతో సమావేశం నిర్వహించిన పయ్యావుల అనంతరం వారితో కలిసి బళ్లారి-అనంతవురం రోడ్డుపై బైఠాయించి ఆందోళనలో పాల్గొన్నారు. గుంతకల్లు బ్రాంచి కాలువ కింద పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉందంటూ ఆయన రైతులతో కలిసి నిరసనకు దిగారు. కాలువ నిండా నీరు ప్రవహిస్తున్నా, ఇక్కడి రైతులకు ఒక్క పర్యాయం నీరు అందించలేరా అని పయ్యావుల ప్రశ్నించారు. హంద్రీ-నీవా నీరు వృథాగా పోతుంటే రైతులకు కడుపు మండిపోతోందని, రైతులు నష్టపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని అభిప్రాయపడ్డారు. గుంతకల్లు బ్రాంచి కెనాల్ కు నీరు నిలిపివేయడం వల్ల 30 వేల ఎకరాల్లో, రూ.300 కోట్ల మేర పంటలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో, పోలీసులు పయ్యావుల కేశవ్ ను అరెస్ట్ చేశారు. అయితే ఆయనను కనేకల్ పీఎస్ కు తరలించినట్టు తెలుస్తోంది. పయ్యావులను అరెస్ట్ చేసిన సమయంలో ఉద్రిక్తత ఏర్పడింది. రైతులకు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. పయ్యావులను అరెస్ట్ చేసి, అక్కడి నుంచి తరలించేందుకు పోలీసులకు దాదావు రెండు గంటల సమయం పట్టింది. రైతులు తీవ్రంగా ప్రతిఘటించడమే అందుకు కారణం.

# నారా లోకేశ్‌ది ఎవరూ గుర్తించని యాత్ర

**● స్కామ్‌లో సంపాదించిన సొమ్ము రేపు ఖర్చు పెట్టబోతున్నారు ● అసమర్ధ కొడుకును హైలైట్ చేసే ప్రయత్నమే ● ఏపీ జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు**



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : లోకేష్ పాదయాత్ర వలన ఎవరికైనా ప్రయోజనం ఉందా? అని మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. ఎవరూ గుర్తించని యాత్ర అది అని ఎద్దేవా చేశారు. కనీసం లోకేష్ కైనా, పార్టీకైనా ఈ యాత్ర ఉపయోగపడిందా? అని ఎద్దేవా చేశారు. లోకేష్ కుప్పంలో అడుగు వేయగానే తారకరత్న మృతి చెందారని, లోకేష్‌ది అశుభయాత్ర అని అంటూ విమర్శించారు. 'ఎలుకతోలు తెచ్చి ఏడాది ఉతికినా తెల్లగ మారదనే వేమన శతకంలాగ లోకేష్ యాత్ర కొనసాగింది. యాత్ర వలన ఒళ్లు తగ్గిందే తప్ప, మైండు మెచ్యూరిటీ లేదు. కుప్పంలో అడుగు వేయగానే తారకరత్న మృతి చెందారు. అశుభయాత్ర చేశాడు లోకేష్. పాదం పెట్టగానే నందమూరి వంశస్తుడు చనిపోయాడు. జనంలేక వెలవెలబోయిన రోజులు ఎన్నో ఉన్నాయి. ఎల్లోమీడియా నైతే విపరీతంగా జనం వచ్చారని చెప్పటానికి తెగ ప్రయత్నం చేసింది. చివరికి యాంకర్ ఉదయభానుని తెచ్చి మీటింగ్ పెట్టుకోవాల్సి వచ్చిందని అంబటి అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ చౌదర్లులారా అంటూ లోకేష్ మాట్లాడారు. మూడు పదిహేను వేలు తొంభై వేలు అని చెప్పిన అజ్ఞాని లోకేష్. బాలకృష్ణ రేవు యాంకరింగ్ చేయబోతున్నారు. ఇంకో యాంకర్ పవన్ కళ్యాణ్ కూడా రేవు యాంకరింగ్ చేయబోతున్నారు. వృద్ధ తండ్రి తన అసమర్థ కొడుకుని హైలెట్ చేయటానికి చేస్తున్న ప్రయత్నమే కనిపిస్తుందన్నారు. లోకేష్ యాత్ర అంత విజయవంతమైతే బాలకృష్ణ, పవన్ కళ్యాణ్‌ల యాంకరింగ్ ఎందుకు? సీట్లు, నోట్లు మాట్లాడుకుని పవన్ కళ్యాణ్‌తో యాంకరింగ్‌కి ఒప్పించుకున్నారు. కిరాయి తీసుకుని పవన్ కళ్యాణ్ లోకేష్ సభకి యాంకరింగ్ చేస్తున్నారు. స్పెషల్ ఫైట్లు, ;ప్రత్యేక రైళ్లలో జనాన్ని తరలిస్తున్నారని అంబటి చెప్పారు. స్కాంలో సంపాదించిన సొమ్ము రేవు ఖర్చు పెట్టబోతున్నారు. సోదరుడికి, చౌదరికి తేడా తెలీని వ్యక్తి లోకేష్. సూట్ కేసులు మోసేది నాదెండ్ల మనోహర్. ప్రజల్లో గెలవకుండా మంత్రి ఐన వ్యక్తి లోకేష్. అలాంటి వారికి ప్రజల కష్టాలేం తెలుసు? 175 సీట్లు గెలవటమే లక్ష్యంగా ఇన్చార్జుల ప్రకటన జరుగుతోందన్నారు. అంతర్గత బదిలీలు సహజంగా జరుగుతుంటాయని, చంద్రబాబు చంద్రగిరి నుండి కుప్పం ఎందుకు బదిలీ అయ్యారని అంబటి మండిపడ్డారు.

## రాష్ట్రంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : మన రాష్ట్రంలో కోవిడ్ కేసులు తాజాగా ఇప్పటి వరకూ ఒక్కటి కూడా నమోదు కాలేదని, అయితే కేరళ వంటి రాష్ట్రాలలో కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో మనం అత్యంత జాగ్రత్తగా వుండాల్సిన అవసరం వుందని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ మన రాష్ట్రంలో ఎటువంటి కేసులూ నమోదు కాలేదని, అందువల్ల భయపడాల్సిన అవసరం లేదని, కానీ జాగ్రత్తగా వుండాల్సిన అవసరం వుందని అన్నారు. వ్యాధి వ్యాప్తి నిరోధానికి అవసరమైన సామాజిక దూరం పాటించటం, మాస్కుల వినియోగాన్ని పెంచటం వంటి చర్యలు తీసుకోవాల్సిందిగా తాము ప్రజలకు సూచిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, వారికి సహాయకులుగా వచ్చిన వారిని తమ సిబ్బంది నిశితంగా గమనిస్తున్నారని, వారికి వ్యాధి లక్షణాలు కన్పిస్తే అవసరమైన వైద్య చికిత్స అందించేందుకు సిద్ధంగా వున్నారన్నారు. ఎవరైనా వ్యక్తులు కూడా తమలో వ్యాధి లక్షణాలు గుర్తిస్తే స్వీయ ఏకాంతాన్ని ను అనుసరిస్తే అందరికీ మేలు చేసిన వారవుతారని ఆయన సూచించారు. గ్రామ సచివాలయ స్థాయిలో వున్న విలేజ్ క్లినిక్ లు అన్నింటికీ యాంటిజెన్ టెస్ట్ కిట్లు ఇప్పటికే అందచేశామని ఆయన చెప్పారు. అక్కడ ఏదైనా పాజిటివ్ గా నిర్ధారణ అయితే దానిని ఆర్టీపీసీఆర్ టెస్ట్ కు పంపటానికి వీలుగా రాష్ట్రంలోని 11 వైద్య కళాశాలల్లో టెస్ట్ లకు అవసరమైన సౌకర్యాలను సిద్ధంగా వుంచామని చెప్పారు.

# యువగళం ద్వారా కొత్త సంప్రదాయానికి శ్రీకారం

**● ఏపీలో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ● 226 రోజుల పాటు 3,132 కిలోమీటర్ల మేర పాదయాత్ర ● ప్రతి 100 కిలోమీటర్లకు ఒక హామీ ఇచ్చిన లోకేశ్ ● అమలు చేయకపోతే నిలదీయవచ్చని స్పష్టీకరణ**



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర విజయవంతం కావడం పట్ల పార్టీ శ్రేణుల్లో నవ్యోత్సాహం పెల్లుబుకుతోంది. లోకేశ్ పాదయాత్ర ఆద్యంతం టీడీపీ శ్రేణులు కదం తొక్కాయి. నేతలు, కార్యకర్తల మద్దతుతో లోకేశ్ 3 వేల కిలోమీటర్లకు పైగా పాదయాత్రను కొద్ది సమయంలోనే పూర్తి చేశారు. కాగా, యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పాదయాత్ర సందర్భంగా ప్రతి వంద కిలోమీటర్ల మజిలీలో ఒక శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తూ... తాము అధికారంలోకి వచ్చాక అక్కడ ఏ అభివృద్ధి కార్యక్రమాన్ని చేపడతామో ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక తాము ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే ప్రజలు తమను నిలదీయవచ్చని చెప్పారు.

***సెల్ఫీ ఛాలెంజ్ లతో నారా లోకేశ్ దూకుడు***

యువగళం పాదయాత్ర దారిలో టీడీపీ హయాంలో చేపట్టిన ప్రాజెక్టుల తాలుకూ విజయగాథలు, వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూవుతూ లోకేశ్ సెల్ఫీ ఛాలెంజ్ లు విసిరారు. తమ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనుల వద్ద, వైసీపీ అభివృద్ధి పనుల్లో విఫలమైన చోట సెల్ఫీలు తీసుకున్న లోకేశ్ సోషల్ మీడియా వేదికగా వైసీపీ నేతలపై విమర్శనాస్త్రాలు సంధించారు. టీడీపీ హ్యాంలో జ్రిగిన అభివృద్ధి వ్నులు - వైసీపీ పాల్నో సాగుతున్న విధ్వంసం, అవినీతిని సెల్ఫీల్తో విప్రిస్తూ ప్రజ్ని చైత్న్యప్రిచే ప్రయత్నం చేశారు.

**సెల్ఫీ విత్ లోకేశ్ కార్యక్రమానికి అనూహ్య స్పందన**

పాదయాత్ర సందర్భంగా తాను బస చేసే ప్రాంతాల్లో తనను కలవడానికి వచ్చే కార్యకర్తలు, అభిమానులతో సెల్ఫీ విత్ లోకేశ్ పేరుతో లోకేశ్ ప్రతి రోజు ఓ కార్యక్రమం నిర్వహించేవారు. ఈ కార్యక్రమానికి అనూహ్య ఆదరణ లభించింది. 226 రోజుల సుదీర్ఘ పాదయాత్రలో లోకేశ్ 3.5 లక్షల మందికి పైగా అభిమానులతో ఫోటోలు దిగారు. నెల్లూరులో అత్యధికంగా ఒకేరోజు 2,500 మంది లోకేశ్ తో సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమం కారణంగా నంద్యాల నియోజకవర్గంలో యాత్ర చేస్తున్న సమయంలో లోకేశ్ కు తీవ్రమైన భుజం నొప్పి వచ్చింది. ఈ సమయంలో సెల్ఫీలు వద్దని వ్యక్తిగత వైద్యులు వారించిన లోకేశ్ వినలేదు. అభిమానులను నిరాశపర్చకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. తనతో సెల్ఫీ దిగిన వారి ఫోటోలను స్కానింగ్ చేయించి, ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా వారి ఫోన్లకే చేరే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఫోటోలను అప్ లోడ్ చేశారు. సెల్ఫీ విత్ లోకేశ్ కార్యక్రమంతోపాటు దారిపొడవునా తనను కలిసేందుకు వచ్చిన ఏ ఒక్కరినీ నిరాశపర్చకుండా ఓపికగా ఫోటోలు దిగారు.





## ఎఫ్ఆర్ఎంబీ నిబంధనల ప్రకారమే ఏపీకి రుణాలు




వెలగపూడి, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు ఏపీ సీఎం స్పెషల్ సెక్రటరీ దువ్వూరి కృష్ణ. ఎఫ్ఆర్ఎంబీ నిబంధనల ప్రకారమే రుణాలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ లెక్కలన్నీ కాగ్, ఆర్‌బీఐ ధృవీకరించినవే అని స్పష్టం చేశారు. దువ్వూరి కృష్ణ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఏపీ ఆర్థిక పరిస్థితిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేపదే ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు తప్పుడు ప్రచారం చేస్తే వారు నమ్ముతారని భావిస్తున్నారు. జర్నలిస్టులు కూడా విలువలు పాటించకుండా తప్పుడు వార్తలు రాస్తున్నారు. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం రాష్ట్ర విభజన నాటికి ప్రభుత్వ అప్పులు రూ. 1,18,050 కోట్లు కాగా, టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.2.71 లక్షల కోట్లకి అప్పు చేర్చింది. 2023 మార్చి నాటికి ఏపీ అప్పులు రూ.4కోట్లకు చేరుకున్నాయి. టీడీపీ హయాంలో ప్రతీ ఏటా 20 శాతం అప్పు పెరగగా ఈ ప్రభుత్వంలో ఏటా పెరిగిన అప్పు 15.42 శాతం మాత్రమే. ఏపీ రుణాలన్నీ ప్రస్తుత ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదు. ఎఫ్ఆర్ఎంబీ నిబంధనల ప్రకారమే రుణాలు తీసుకుంటున్నాం. ఈ లెక్కలన్నీ కాగ్, ఆర్‌బీఐ ధృవీకరించినవేనన్నారు. విద్యుత్ డిస్కంల అప్పు విభజనకి ముందు రూ.2893 కోట్లు అయితే టీడీపీ హయాంలో రూ.21,541కోట్లకి పెరిగింది. ఈ ప్రభుత్వంలో ఈ అప్పులు రూ.11,602 కోట్లకు అప్పులు తగ్గాయి. మొత్తం విద్యుత్ సంస్థల అప్పులు విభజన నాటికి 32,596.27 కోట్లు అయితే టీడీపీ హయాంలో రూ.91,137కోట్లకి పెరిగాయి. ఇక, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,09,094 కోట్లకి మాత్రమే పెరిగాయి. విద్యుత్ పంపిణీ సంస్థల అప్పులు గత ప్రభుత్వంలో 30.74 శాతం పెరిగితే ఈ ప్రభుత్వంలో 5.79 శాతం తగ్గాయి. రాష్ట్ర ప్రభుత్వం అనధికార అప్పులు చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాజ్యాంగ విరుద్ధంగా చట్ట విరుద్ధంగా అప్పులు ఎలా చేయగలుగుతాం. కేంద్ర పరిమితులకి లోబడే అప్పులు. అన్ని నిబంధనలు పాటిస్తేనే బ్యాంకులు సైతం అప్పులు ఇస్తాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడే నాటికి రూ.1,53,346 కోట్ల అప్పులు 2019 నాటికి రూ.4,12,288 కోట్లకి పెరిగాయి. టీడీపీ ఐదేళ్ల కాలంలో రూ.2,58,941 కోట్లు అప్పులు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అప్పులు పెరగలేదన్నారు.



## ఇక తెలంగాణ గిరిజన వర్సిటీ

● ఏర్పాటుకు మరో కీలక ముందడుగు ● న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ ● రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర

తెలంగాణ బ్యూరో ప్రతినిధి, హైదరాబాదు: దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న తెలంగాణ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు మరో కీలక ముందడుగు పడింది. కేంద్ర విశ్వవిద్యాలయాల చట్టం-2009లో తెలంగాణలోని ములుగు జిల్లాలో ఏర్పాటు చేస్తున్న సమ్మక్క-సారక్క కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం పేరును చేరుస్తూ విద్యాశాఖ ప్రవేశపెట్టింది. సవరణ బిల్లు లోక్సభలో డిసెంబర్ 7న, రాజ్యసభలో 13న ఆమోదం పొందింది.ఆ బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ఆమోదముద్ర వేయడంతో అది చట్టరూపం దాల్చింది. ఈ మేరకు న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణలో గిరిజన కేంద్ర విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇచ్చింది. ఎన్నో ఏళ్లుగా వేచిచూస్తున్న ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు అవుతుందా లేదా అనే సందిగ్ధంలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఈ సమయంలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రకటనతో సుదీర్ఘ కాలంగా ఉన్న అపోహలకు తెరపడింది. మోడీ ప్రకటన తర్వాత ఇటీవల పార్లమెంటులో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లుకు పార్లమెంట్ ఉభయసభలతో పాటు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడంతో చట్టరూపం దాల్చింది. ఇక ఏడేళ్లలో రెండు దశల్లో రూ.889.07 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఇటీవల పార్లమెంటులో కేంద్ర విద్యాశాఖ మంత్రి వెల్లడించారు. ఈ ఖర్చు మొత్తాన్ని కేంద్ర విద్యాశాఖ బడ్జెట్ రూపంలో అందిస్తుందని వివరించారు.గిరిజన యూనివర్సిటీ కోసం ములుగు సమీపంలోని గట్టమ్మ గుడి పరిసర ప్రాంతాల్లో 335 ఎకరాల స్థలాన్ని విశ్వవిద్యాలయం కోసం సేకరించారు. భూ సేకరణ కోసం గిరిజన సంక్షేమశాఖ రూ.10 కోట్లను కేటాయించింది. పలుమార్లు హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రతినిధులు వచ్చి స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి అనువుగానే ఉందని నిర్ధారించి సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన కేంద్ర యూనివర్సిటీతో తమ ప్రాంతం మరింత అభివృద్ధి చెందటమే కాకుండా, విద్యావకాశాలు మరింత మెరుగుపడతాయని గిరిజన, ఆదివాసీ సంఘాలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మేడిగడ్డపై సర్కారు ఫోకస్

● నిరంతర సమీక్షలు ● గత ప్రభుత్వానికి బిగుస్తున్న ఉచ్చు ● మూడు పిల్లర్లు కుంగిపోవడంపై లోతుగా పరిశీలన ● హైకోర్టుకు వెళ్లిన కాంగ్రెస్ ● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి ● ఇరిగేషన్ నిపుణులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చ





తెలంగాణ బ్యూరో ప్రతినిధి, హైదరాబాద్: ఎన్నికల్లో పరాజయం పాలైన నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి పార్టీ ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటును ప్రభుత్వం సీరియస్ గా తీసుకుంది. ఈ విషయంలో అప్పటి భారత రాష్ట్ర సమితిని ఇరుకున పెట్టేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు విషయంలో సీబీఐ విచారణ కోరుతూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేత నిరంజన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగంగా మేడిగడ్డ బ్యారేజీ (లక్ష్మి బ్యారేజీ) ని నిర్మించారు. ఈ ఏడాది అక్టోబర్ 21వ తేదీన మూడు పిల్లర్లు కుంగిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీకి చెందిన బీ బ్లాక్ లోని 19, 20, 21 పిల్లర్లు కుంగిపోయాయి. ఈ పిల్లర్ల కుంగుబాటు వెనుక విద్రోహ శక్తుల ప్రమేయం ఉందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు అధికారులు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖకు చెందిన ఏఈఈ రవికాంత్ ఈ ఏడాది అక్టోబర్ 24న మహాదేవ్పూర్ పోలీసులకు పిర్యాదు చేశారు. పీడీపీపీ సెక్షన్ కు చెందిన మూడు సెక్షన్లతో పాటు ఐపీసీ 427 సెక్షన్ల కింద కూడ కేసులు నమోదు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ మూడు పిల్లర్ల కుంగుబాటుపై విద్రోహశక్తుల ప్రమేయం లేదని అప్పట్లోనే జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఈ ఫిర్యాదుపై విచారణను సీబీఐకి బదిలీ చేయాలని కాంగ్రెస్ పార్టీ నేత నిరంజన్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ల కుంగుబాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ నెల 17న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అదే రోజు రాత్రి సీఎం అనుముల రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. ఈ నెల 18న నీటిపారుదల శాఖాధికారులతో పాటు ఎల్ అండ్ టీ గ్రూప్ డైరెక్టర్ ఎస్ వీ దేశాయ్ తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ గురించి నీటిపారుదల అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. అయితే ఈ డిజైన్ గురించిన సంస్థ గురించి నీటిపారుదల శాఖాధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని సమాచారం. ఈ విషయమై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. డిజైన్ లేకుండా అప్పట్లో ప్రభుత్వ పెద్దల సహకారంతో ఈ బ్యారేజీ నిర్మాణం జరిగిందని అధికారులు చెప్పారనే ప్రచారం కూడ సాగుతుంది.

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తమ గొప్పగా ప్రచారం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో డొల్లతనం, అవకతవకలు, అవినీతిని బయట పెట్టాలని కాంగ్రెస్ సర్కార్ భావిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుబంధంగా కాలువల నిర్మాణం చేయకుండానే ఎలాంటి ఉపయోగమని విపక్షంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రశ్నించడం జరిగింది. కామారెడ్డి జిల్లాలో కాలువలు పూర్తి చేయని విషయాన్ని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో కూడ ప్రధాన ప్రచార అస్త్రంగా చేసుకున్నారు. తెలంగాణ శాసనమండలిలో మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయిస్తామని తెలంగాణ సీఎం అనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటన చేసిన రెండు రోజులకే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించి సీరియస్ వ్యాఖ్యలు చేశారు. ఈ బ్యారేజీ కుంగుబాటుకు బాధ్యులైన వారిని ఎవరిని వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. మరో వైపు ఈ విషయమై సీబీఐ విచారణ కోరుతూ కాంగ్రెస్ పార్టీ హైకోర్టును ఆశ్రయించడం చర్చకు దారి తీసింది.

# ఫిర్యాదులకు సత్వర మోక్షం

● ప్రాధాన్యత ప్రాతిపదికన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలు ● ఇక ప్రజావాణికి పెద్దపీట ● ప్రత్యేకంగా ఐఏఎస్ అధికారి నియామకం ●నోడల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించనున్న దాసరి హరిచందన ● ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నజర్



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి సారథ్యాన్ని వహిస్తోన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనపై తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా భారీ ఎత్తున ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తున్నారు. మెరికల్లాంటి బ్యురోక్రాట్లను కీలక స్థానాల్లో నియమిస్తున్నారు. శాంతి భద్రతలు, ప్రజా సమస్యల పరిష్కారం, పెట్టుబడుల ఆకర్షణ, మౌలిక సదుపాయాల కల్పన, ఎన్నికల ప్రచార సమయంలో ప్రకటించిన ఆరు ఉచిత గ్యారంటీల అమలు.. వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తోన్నారు . గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో చోటు చేసుకున్నట్లుగా భావిస్తోన్న తప్పులను సరిదిద్దుతున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే క్రమంలో పాలనను వారి వద్దకే తీసుకెలుతున్నారు. ఈ క్రమంలో ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వారం రోజులు మంగళ, శుక్రవారాల్లో హైదరాబాద్ బేగంపేట్లోని ప్రజా భవన్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది ప్రభుత్వం. ఒక్కో రోజు ఒక్కో శాఖకు చెందిన మంత్రులు ప్రజావాణిలో పాల్గొంటారు. ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు. ఈ మంగళవారం కూడా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కొనసాగింది. ధరణి పోర్టల్, పింఛన్లు, డబుల్ బెడ్ రూం వంటి అంశాలు ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి అందుతున్నాయి. ఒక్కో ప్రజావాణిలో వేల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. వాటన్నింటినీ శాఖలవారీగా విభజించి, ఏ శాఖకు చెందిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను ఆ శాఖకు పంపుతున్నారు. వాటిని పరిష్కరించడానికి ఆయా మంత్రులు, ఆ శాఖకు సంబంధించిన అధికారులు ప్రాధాన్యత ఇస్తారు. ఈ ఫిర్యాదులు, విజ్ఞప్తులు సత్వరంగా పరిష్కరించడానికి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఓ ఐఏఎస్ అధికారిని నియమించారు. దాసరి హరిచందనను నోడల్ అధికారిగా అపాయింట్ చేశారు. ఆయుష్ డైరెక్టర్గా ఉన్న దాసరి హరిచందనను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్కు బదిలీ చేసింది ప్రభుత్వం. అదే సమయంలో ప్రజావాణి నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలను అప్పగించింది.

# కార్యాచరణపై కసరత్తు

● మరో రెండు గ్యారెంటీలకు గ్రీన్ సిగ్నల్ ● ఈ నెల 28 నుంచి పింఛను పెంపు ● రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలుకు ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయం ● కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం నేపథ్యం ● రెండు గ్యారెంటీలకు అదే రోజు ముహూర్తం ● పెంచే పెన్షన్‌తో ఏటా దాదాపు 21,600 కోట్ల భారం ● సిలిండర్లతో 4,450 కోట్ల భారం ● వికలాంగుల పెన్షన్ పెంపుదలపై ఇంకా రాని స్పష్టత





తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ఇచ్చిన పథకాలను గట్టిగా సంకేతాలు ఇస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం గ్యారంటీల అమలుపై వేగంగా అడుగులు వేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమల్లో భాగంగా మరో రెండు పథకాల అమలుకు ముహూర్తం నిర్ణయించింది. ఇప్పటికే రెండు పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం,తాజాగా మరో రెండు పథకాలప్రారంభం పైన నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవమైన ఈ నెల 28వ తేదీ ఇందుకు ముహూర్తంగా ఖరారు చేసింది. కొత్త సంవత్సరం కానుకగా ఇవి అమల్లోకి రానున్నాయి. హామీల అమలు దిశగా తెలంగాణలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు రేవంత్ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. సోనియా గాంధీ జన్మదినం నాడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రూ 10 లక్షలకు ఆరోగ్య శ్రీ పెంపు అమల్లోకి తీసుకొచ్చారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవమైన ఈ నెల 28 నుంచి మరో రెండు పథకాలను ప్రజలకు అందజేయనుంది. తాజాగా తెలంగాణ కాంగ్రెస్ నిర్వహించిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలోనూ ఆరు గ్యారెంటీలపై చర్చ జరిగింది. పార్టీ వ్యవస్థాపక దినోత్సవమైన డిసెంబరు 28 నుంచి పింఛను పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలు ప్రక్రియను ప్రారంభించాలని ఇందులో నిర్ణయించారు. భారీ కసరత్తు అవసరం లేకుండా, తక్షణమే ప్రారంభించగలిగే పథకాలు ఏమున్నాయనే అంశంపై పీఏసీలో చర్చించారు. ఈ క్రమంలోనే 'చేయూత'లో భాగంగా నెలవారీ పింఛనును రూ.4 వేలకు పెంచి ఇవ్వాలన్నదానిపై ఏకాభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా పింఛను తీసుకుంటున్న లబ్ధిదారుల లెక్కలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ప్రతి నెల 45 లక్షల పైగా బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ జరుగుతోంది. వృఎద్ధులు, వితంతువులు, చేనేత, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు ప్రస్తుతం ఆసరా పింఛను కింద నెలకు రూ.2,016 చొప్పున ఇస్తున్నారు. ఇకపై ఇది రూ.4 వేలు కానుంది. ఇప్పటివరకు నెలకు రూ.900 కోట్ల వరకు ఖర్చవుతుండగా, పెరిగే పింఛను మొత్తంతో ఇది రెట్టింపయ్యే అవకాశం ఉంది. నెలకు రూ.1,800 కోట్లు చొప్పున ఏటా రూ.21,600 కోట్లకు చేరనుంది. కాగా, వికలాంగులకు రూ.3,016 పింఛను ఇస్తున్నారు. దీనిని పెంచే విషయమై రెండు, మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ గ్యాస్ సిలిండర్ను రూ.500కే ఇస్తామని ఆరు హామీల్లో పేర్కొంది. సిలిండర్ ధర రూ.955 ఉండగా,ప్రభుత్వం రూ.455 సబ్సిడీ భరించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 1.20 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్లున్నాయి. ఇందులో దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) 89.99 లక్షల మంది ఉన్నారు. వీరికి ఏడాదికి 6 సిలిండర్లకు రాయితీ ఇస్తే ప్రభుత్వంపై రూ.2,225 కోట్ల ఆర్థిక భారం పడుతుంది. 12 సిలిండర్లు ఇస్తే అది రూ.4,450 కోట్లవుతుంది. కాగా, కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్పై రూ.40 సబ్సిడీ ఇస్తోంది. మొత్తం డబ్బు చెల్లించి తీసుకున్న తర్వాత ఆ రాయితీని బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. ఈ రెండు పథకాల అమలు పైన ప్రభుత్వం అధికారికంగా విధి విధానాల పై ప్రకటన చేయనుంది.

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన సినీ ప్రముఖులు

మంత్రికి శుభాకాంక్షలు తెలిపిన గొట్టిముక్కల పాండురంగారావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రాఫి శాఖ మంత్రి గా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యుడు, సినీ నిర్మాత, పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొట్టిముక్కల పాండురంగ రావు గారూ మరియు సినీ ప్రముఖులు మంగళవారం అయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది, ఈ యొక్క కార్యక్రమం లో మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సునీల్ నారాంగ్, కార్యదర్శి అనుపమ్ రెడ్డి మరియు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దిల్ రాజు కార్యదర్శి దామోదర ప్రసాద్, తెలంగాణ సినిమా రచయితల సంగం అధ్యక్షులు వులి అమృఎత్, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ కార్యదర్శి టీ ప్రసన్న కుమార్ దర్శకులు కే రాఘవేంద్రరావు, సినీ నిర్మాతలు దగ్గుబాటి సురేష్, సి కళ్యాణ్, తమ్మలపల్లి రామసత్యనారాయణ, సుధాకర్ రెడ్డి తదితర ప్రముఖులు కలిసి సినిమా రంగంలోని పాలు విషయాలపై చర్చించడం జరిగింది.

# తెలంగాణ మణిహారం

**సంస్కృతిని ప్రతిబింబించేలా న్యూఢిల్లీలో నూతన తెలంగాణ భవన్ నిర్మాణం ఏర్పాటు**

● ఉమ్మడి ఆస్తుల విభజనపై సమీక్ష ● రాష్ట్ర విభజన చట్టంపై ఆరా ● ప్రస్తుత భవన్ మ్యాప్ పరిశీలన ● అధికార యంత్రాంగానికి రేవంత్ రెడ్డి దిశా నిర్దేశం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: తెలంగాణ సంస్కృఎతిని ప్రతిబింబించేలా దేశ రాజధాని న్యూ ఢిల్లీలో నూతన తెలంగాణ భవన్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. న్యూ ఢిల్లీలోని తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ భవన్, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఉమ్మడి ఆస్తుల విభజనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఎష్టి సారించారు. న్యూ ఢిల్లీ లోని తన నివాసంలో ఈ అంశంపై తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, భవన్ ఓఎస్డీ సంజయ్ జాజుతో మంగళ వారం ఆయన సమీక్ష నిర్వహించారు. భవన్ మొత్తం విస్తీర్ణం ఎంత?, అందులో ఉన్న భవనాలు, వాటి స్థితి, అందులో తెలంగాణ వాటా వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.. ఉమ్మడిగా 19.781 ఎకరాల భూమి ఉందని అధికారులు తెలిపారు. ఇందులో ఉమ్మడి భవన్ పరిధిలోని 8.781 ఎకరాల్లో శబరి బ్లాక్, అంతర్గత రోడ్లు, గోదావరి బ్లాక్, 3.359 ఎకరాల్లో ఓల్డ్ నర్సింగ్ హాస్టల్, 7.641 ఎకరాల్లో పటౌడి హౌస్ ఉన్నాయని అధికారులు తెలిపారు. తెలంగాణ వాటా కింద ఎంత భూమి వస్తుందని సీఎం ప్రశ్నించారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం మన రాష్ట్రం తెలంగాణకు 8.245 ఎకరాల భూమి వస్తుందని, ఏపీకి 11.536 ఎకరాలు (41.68:58.32 నిష్పత్తిలో) వెళుతుందని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ప్రస్తుత భవనాల స్థితి, అధికారులు, సిబ్బంది నివాస గృఎహాల స్థితిపై సీఎం ఆరా తీశారు. మూడు, నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించినవి కావడంతో చాలా వరకు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయిస్తున్నామని రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. తెలంగాణ సంస్కృఎతి సంప్రదా యాలు ప్రతిబింబించేలా నూతన భవనం నిర్మించుకుందామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. అంతకు ముందు రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఆస్తుల విభజనపై దృఎష్టి సారించాలని సీఎం అధికారులను ఆదేశించారు.. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం భవన్ మ్యాప్ ను పరిశీలించారు. ఆస్తుల విభజనపై అధికారులకు పలుసూచనలు ఇచ్చారు.

# కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరిపించండి

● సీఎం రేవంత్ రెడ్డి సిబిఐతో విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు ● రాహుల్ గాంధీ ఎన్నికల్లో విమర్శించినా పట్టించుకోరా? ● కాలేశ్వరం కరప్షన్‌పై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేక ఎందుకు రాయడం లేదు? ● అవినీతిపై ఆధారాలు కావాలంటే నేను ఇస్తాను ● బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎం రఘునందన్‌రావు



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి : కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ప్రశ్నించారు. కాళేశ్వరం పై వివరాలు ఇవ్వాలని కాగ్ పలు దఫాలుగా కోరినా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని తెలిపారు. కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేయించాలని రేవంత్ రెడ్డి గతంలో డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ లక్ష కోట్లు దోచుకున్నారని, ఆ డబ్బులను వసూలు చేసి పేద ప్రజల అకౌంట్స్ లో వెస్తానని గతంలో రాహుల్ అన్నారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంలో రేవంత్ కు ఉన్న అభ్యంతరం ఏంటి? ఎందుకు లేఖ రాయడం లేదు? అంటూ ప్రశ్నలు సంధించారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్ట్ ను మెడిగడ్డ వరకే పరిమితం చేయాలని కుట్ర జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ మీద అనుమానం వ్యక్తం చేశారు. కాళేశ్వరం మొత్తం మీద విచారణ జరగాలన్నారు. స్వతంత్రం వచ్చినప్పటి నుండి ఒక వ్యక్తి చేసిన అతిపెద్ద అవినీతి కాళేశ్వరం ప్రాజెక్ట్ అని తెలిపారు. సాక్ష్యాధారాలు ఉన్నాయని గతంలో రేవంత్ రెడ్డి.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా గారికి లేఖ రాశారని గుర్తు చేశారు. ఇప్పుడు సీఎం గా తన దగ్గర ఉన్న ఆధారాలను పంపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకట్ రెడ్డి తో పాటు, రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, రాణా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందనేది విదితమేనని, కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి విషయంలో గత ఏడాది నుంచి కాగ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పలు దఫాలుగా ఉత్తరాలు రాసిందన్నారు. మార్చి 20, 2023న తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ప్రత్యేక అధికారి డాక్టర్ రజత్ కుమార్ కు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని లేఖ వచ్చిందన్నారు. ఉద్దేశపూర్వకంగా లేఖకు సమాధానం ఇవ్వకుండా తమ బండారం బయపడుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నివేదికను తొక్కిపెట్టిందని, కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని.. టీపీసీసీ గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి భారత ప్రభుత్వానికి పలు దఫాలుగా విజ్నప్తులు చేశారు. బిజెపి-బీఆర్ఎస్ ఒకటేనని దుష్ప్రచారం చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ కథను కంచికి చేర్చాలని చూస్తోంది. ఉల్టాచోర్ కొత్వాల్ కో డాంటే అనేలా అవినీతి కథను పక్కదోవ పట్టించాలని చూస్తోంది.నాడు రేవంత్ కేసీఆర్ అంటే కాళేశ్వరం అంటే కరప్షన్ రావు అని అభివర్ణించారు. నాసిరకం పనుల వల్లే పిల్లర్లు కుంగాయి అని రాహుల్ గాంధీ చెప్పారు. దీంతో మెఘా ఇన్ఫ్రాస్ట్రక్చర్ ను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అనుమానం కలుగుతోందిబీఎన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో రూ. 48 వేల కోట్ల లబ్ధి కేవలం మెఘా కంపెనీకి జరిగిందని, గతంలో అమిత్‌షాకు రాసిన ఉత్తరంలో కాళేశ్వరం అవినీతిపై ఆధారాలు ఉన్నాయని రేవంత్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ప్రాజెక్టు అవినీతిపై సాక్ష్యాధా రాలను సమర్పించి రేవంత్ ఎందుకు సీబీఐ విచారణకు కోరడం లేదు? రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజలపై రూ. లక్షా 50 వేల కోట్ల భారం పడనుందన్నారు.

# సంపాదకీయం

editpage@suryaa.com

ప్రపంచవ్యాప్తంగా 5 లక్షలకు పైగా జనాభా కలిగిన 990 పట్టణాల జనాభా విశ్లేషణ, జనసాంద్రత, భవిష్యత్తు పట్టణీకరణ అంచనాలు లాంటి పలు ఆసక్తికర అంశాలతో కూడిన తాజా నివేదికను ఐరాస ఇటీవల విడుదల చేసింది. 'డెమోగ్రఫియా వరల్డ్ అర్బన్ ఏరియాస్–2022 (ప్రపంచ పట్టణ ప్రాంత జనాభా–2022)' పేరుతో వెలువరించిన నివేదిక ప్రకారం నేడు ప్రపంచ పట్టణ జనాభా దాదాపు 2.36 బిలియన్లు (236 కోట్లు)ఉందని, గత ఏడాది ప్రపంచ జనాభాలో 52 శాతం వరకు జనాభా పట్టణాల్లో జీవిస్తుండగా నేడు నగరాల జనాభా 57 శాతానికి పెరగడం గమనించారు.

ప్రపంచవ్యాప్తంగా 10 మిలియన్ల జనాభా దాటిన 44 నగరాలను మెగాసిటీస్‌గా నామకరణం చేశారు. గతంలో 36 మెగాసిటీస్ ఉండగా నేడు 44 వరకు పెరగడం గమనించారు. చైనాకు చెందిన 11 నగరాలు, ఇండియాకు చెందిన 6 నగరాలు, బ్రెజిల్/జపాన్/పాకిస్థాన్/యూయస్ దేశాల్లో 2 చొప్పున మెగాసిటీస్ ఉన్నాయి. ఐదు మిలియన్లకు పైగా జనాభా కలిగిన 97 ప్రపంచ నగరాలను గుర్తించారు. అత్యధిక జనాభా కలిగిన 10 ప్రపంచ మెగాసిటీల జాబితాలో టోక్యో–యెకోహామా, జకార్తా, ఢిల్లీ,

## ప్రపంచ పట్టణ జనాభా విస్ఫోటనం

గ్వాంజావ్–ఫోషాన్, ముంబాయి, మనీలా, షాంఘై, సావ్ పాలో, సియోల్, మెక్సికో పట్టణాలు ఉన్నాయి.

అత్యధిక జనాభా కలిగిన ప్రపంచ నగరాల జాబితాలో 3వ స్థానంలో ఢిల్లీ, 5వ స్థానంలో ముంబాయ్ మహానగరాలతో పాటు 15వ స్థానంలో కోల్‌కతా, 23వ స్థానంలో బెంగుళూరు, 33వ స్థానంలో చెన్నై , 40వ స్థానంలో హైదరా బాదు మహానగరాలు ఉన్నాయి. వీటితో పాటు పూనె (52వ స్థానం), అహ్మదా బాదు (53), సూరత్(71), లక్నో (99) జైపూర్(111), కాన్పూర్(133), ఇండోర్(156), వారణాసి(161), నాగపూర్(164), పాట్నా (165), అల్లహా బాదు (169), ఆగ్రా(1191), చీండీఘర్(22), భోపాల్(226), కొచ్చీ(227), తిరువనంతపురం(268), విశాఖపట్నం(235), వడోదరా(236), మీరట్(238), కోజీకోడ్(243), కోయంబత్తోర్(246), మధురై(247), నాసిక్(248), జంషెడ్ పూర్(271), అలీఘడ్(282), రాంచీ(297), లుధియానా(300), ఔరంగా హాదు(302), జబల్‌పూర్(306), గ్వాలియర్(308), జోద్‌పూర్(309), కన్నూర్ (317), బెరైలీ(323), రాజ్‌కోట్(325), గోరక్‌పూర్(328), రాయ్‌పూర్(329), విజయవాడ(331), అసన్‌సోల్(334), మైసూర్(337), తిరుప్పూర్(367), డెహ్రా డూన్(388), సహరన్‌పూర్(395), మలప్పురం(401), అమృత్–సర్(403), కోటా (411), గౌహతి(430), శ్రీనగర్(431), దుర్గ్–బిలాయ్‌నగర్(443), మొరాదాబాదు(448), తిరుచురాపల్లి(461), భువనేశ్వర్(464), ధన్‌బాదు (468), హుబ్లీ–దార్వాడ్(472), జలంధర్(473), కెల్లమ్(481), సోలాపూర్ (490) పట్టణాలు తొలి 500 నగరాల జాబితాలో ఉన్నాయి. వీటితో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన గుంటూరు(580వ స్థానం), వరంగల్(607), నెల్లూరు(674), తిరుపతి(762), కర్నూలు(785), రాజమండ్రి(912వ స్థానం) పట్టణాలు జాబితాలో చోటు చేసుకున్నాయి.. అభివృద్ధి చెందిన అధిక ఆదాయ దేశాల జనాభాతో పోల్చితే అభివృద్ధి చెందు తున్న భారత్ లాంటి దేశాల్లో పట్టణ జనాభా అధికంగా పెరుగుతుందని అంచ నా వేశారు. 2100 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పట్టణ జనాభా రెట్టింపు అవుతుందని విశ్లేషించారు. 2100 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశా ల్లో జనాభా 2.5 బిలియన్లు పెరిగి 106 శాతం వృద్ధిని చూపిస్తాయని వెల్లడిం చారు. పట్టణ జనాభా అమెరికా, యూరోప్ దేశాలు, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో 122 మిలియన్ల పట్టణ జనాభా తగ్గవచ్చని తెలుస్తున్నది. పల్లెను వదిలి పట్నం బాటను పట్టనున్న వలస బతుకులతో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు మసకబారి ఆహార అభద్రత రాజ్యమేల వచ్చు. నగరాల వెలుగున ఆకర్షణలతో పట్టణాల చుట్టు మురికి కూపాలు వెలు స్తున్నాయి.నగరాల ఆకాశహర్మ్యాల పునాదుల్లో శ్రామికవర్గ అస్థిపంజరాలు చెమ ట చుక్కల వాసన వస్తున్నది. పని, పిల్లల చదువులు, చిరు వ్యాపారం, పండ్ల బండి, నిర్మాణ రంగం, పరిశ్రమల్లో కూలీలు, అసంఘటిత రంగ శ్రమలు, వీధి వ్యాపారాలు లాంటి కారణాలతో గ్రామీణ భారతం పట్టణాలకు పయనం అవుతున్నది. రాబోయే రోజుల్లో పల్లెలు అంతరిస్తూ పట్టణ విస్తీర్ణాలు పెరగను న్నాయి. గ్రామ నగర సమతుల్యత దెబ్బతిన్నపుడు సుస్థిరాభివృద్ధి కుంటుపడి, సమాజంలో అశాంతి రెక్కలు విప్పవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# సిక్కోలు రాజకీయ సిత్రాలు వేరయా

■ అభ్యర్థుల మార్పుపై వైసిపిలో చర్చ ■ స్పీకర్ తమ్మినేనిని పార్లమెంటుకు పంపే యత్నం
■ రాజకీయ ఉద్దండులకే టిక్కెట్లు కేటాయించే అవకాశం ■ జనసేన పోటీకి జిల్లాలో నో చాన్స్
■ శ్రీకాకుళం పార్లమెంటు పరిధిలో అసెంబ్లీ సీట్లపై అన్ని పార్టీలలో చర్చోపచర్చలు



బి. వెంకట రమణ
94407 40015

సిత్రాలు వేరయా సిక్కోలు రాజకీయాల్లో అన్నట్లు ఉంటుంది పొలిటికల్ సీన్ ఇక్కడ ! ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన శ్రీకాకుళం.. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ వెనకబడిన ప్రాంతంగానే మిగిలి పోయింది. పార్టీలు మారినా.. ప్రభుత్వాలు మారినా.. బతుకులు మారడం లేదని అనుకుంటారు జనం ఇక్కడ ! హక్కుల కోసం పోరాటం నేర్పిన నేల ఇదే.. రాజకీయ ఉద్ధండులను చట్టసభలకు పంపిన ప్రాంతమూ ఇదే ! అలాంటి శ్రీకాకుళం రాజకీయం ఎప్పుడూ ప్రత్యేకమే ! ఉమ్మడి జిల్లాలో రాజకీయ ఆధిపత్యం ఎప్పటికప్పుడు చేతులు మారడం ఇక్కడ ప్రత్యేకత. అలాంటి సిక్కోలులో పొలిటికల్ సీన్ ఎలా ఉంది.. 2024 పార్లమెంట్ బరిలో నిలవబ–ోయేది ఎవరు.. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏ పార్టీ బలం ఏంటి, బలహీనత ఏంటి.. టీడీపీ మళ్లీ బౌన్స్‌బ్యాక్ అవుతుందా.. ఫ్యాన్ పార్టీ టాప్ స్పీడ్‌లో తిరుగుతుందా.. అధికార, విపక్షాలను ఇబ్బంది పెడుతున్న ఒకే కారణం ఏంటి.. రాబోయే ఎన్నికల్లో పరుగుకు సిద్ధం అవుతున్నాయ పార్టీలు..

శ్రీకాకుళం పార్లమెంట్ భిన్నమైన పరిస్థితులు ఉంటాయ్. అపారమైన జలవనరులు ఉండి.. మూడు పంటలు పండే చాన్స్ ఉన్నా.. కరువు ప్రాంతంగానే మిగిలిపోయింది సిక్కోలు ! శ్రీకాకుళం నుంచి భారీ ఎత్తున వలసలు కనిపిస్తుంటాయ్ ఎప్పుడూ ! ఉద్యమాలకు పురిటిగడ్డ అయిన ఈ ప్రాంతానికి.. రాజకీయంగా ఎంతో చరిత్ర ఉంది. గౌతు లచ్చన్న,బొడ్డేపల్లి రాజుగోపాలరావు, ఎన్టీఆర్.. మహామహులు ఈ గడ్డ నుంచే చట్టసభలకు వెళ్లారు. ఎందరు వెళ్లినా.. ఎన్ని గళాలు వినిపించినా.. అభివృద్ధి మాత్రం అందని ద్రాక్షగానే మారింది. రాజకీయం బాగుపడింది తప్ప.. జనాల రాతలు మారలేదు అనే విమర్శ ఉంది. అలాంటి సిక్కోలులో పాలిటిక్స్ ఎప్పుడూ హాట్‌హాట్‌గానే ఉంటాయ్. ఈసారి కూడా అంతకుమించి అనే స్థాయిలో యుద్ధం కనిపించడం ఖాయంగా కనిపిస్తోంది.

శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు ఉన్నాయ్. రెండింట్లో టీడీపీ.. ఐదు స్థానాల్లో వైసీపీ విజయం సాధించింది. శ్రీకాకుళం అసెంబ్లీతో పాటు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట, ఆముదాలవలస సెగ్మెంట్‌లు సిక్కోలు పార్లమెంట్ పరిధిలోకి వస్తాయ్. రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న అచ్చెన్నాయుడు, ధర్మాన సోదరులు, స్పీకర్ సీతారాం, ఫైర్ బ్రాండ్ సీదిరి అప్పలరాజు.. ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌కు చెందిన నేతలే ! అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో అధికార, విపక్ష పార్టీల్లో గ్రూప్ రాజకీయాలు పెరిగిపోయాయ్. ఒకరికి ఒకరు చెక్ పెట్టుకుంటూ నేతలంతా వ్యూహాలు అమలు చేస్తున్నారు. ఈసారి శ్రీకాకుళం రాజకీయంలో అనూహ్య మార్పులు చూడబోతున్నాం. ముఖ్యంగా వైఎస్‌ఆర్ సీపీ కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టబోతోందని అంటున్నారు జిల్లా నాయకులు. ఎంపీ అభ్యర్థి ఎంపిక జిల్లా వ్యాప్తంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలపై ప్రభావం చూపేలా చేస్తుందని టాక్ నడుస్తోంది. ఇంత వరకు నడుస్తున్న రాజకీయంలో చిన్న ఛేంజ్ తీసుకురాబోతోందని జిల్లా వైసీపీ నాయకత్వం చెప్పుకుంటోంది.

వాస్తవానికి శ్రీకాకుళం పార్లమెంట్ ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. హస్తం పార్టీ అభ్యర్థులు తొమ్మిదిసార్లు గెలిచారు ఇక్కడ ! టీడీపీ ఆవిర్భావం తర్వాత సీన్ రివర్స్ అయింది. ఏడుసార్లు సైకిల్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా.. ఎర్రంనాయుడు నాలుగు సార్లు గెలిచారు. ఎర్రంనాయుడు మరణం తర్వాత.. ఆయన వారసుడు వరుస విజయాలు సాధిస్తున్నారు. 2014, 2019లో ఎంపీగా గెలిచి.. ఢిల్లీలోనూ, సిక్కోలు గల్లీలోనూ మంచి పేరు సంపాదిం చుకున్నారు. 2024 ఎన్నికల్లోనూ ఆయనే మళ్లీ బరిలోకి దిగేందుకు సిద్ధం అవుతున్నారు. వైసీపీ నుంచి గత ఎన్నికల్లో దువ్వాడ శ్రీనివాస్ పోటీ చేయగా.. 2024కోసం కొత్త అభ్యర్థి వేటలో పడినట్లు తెలుస్తోంది. కళింగ సామాజికవర్గానిక చెందిన మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి.. వెలమ సామాజికవర్గానికి చెందిన ధర్మాన సోదరుల్లో ఒకరు ఎంపీ అభ్యర్థిగా ఫ్యాన్ పార్టీ నుంచి బరిలో దిగే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం నడుస్తోంది. రామ్మోహన్‌నాయుడు వెలమ సామాజికవర్గానికి చెందిన నేత కాగా.. ఈసారి ఆయనపై పోటీకి అదే సామాజివర్గానికి చెందిన అభ్యర్థిని వైసీపీ బరిలో దింపే అవకాశాలు ఉన్నాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్.

శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాలు ఉన్నాయ్. రెండింట్లో టీడీపీ.. ఐదు స్థానాల్లో వైసీపీ విజయం సాధించింది. శ్రీకాకుళం అసెంబ్లీతో పాటు ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట, ఆముదాలవలస సెగ్మెంట్‌లు సిక్కోలు పార్లమెంట్ పరిధిలోకి వస్తాయ్. రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న అచ్చెన్నాయుడు, ధర్మాన సోదరులు, స్పీకర్ సీతారాం, ఫైర్ బ్రాండ్ సీదిరి అప్పలరాజు.. ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌కు చెందిన నేతలే ! అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో అధికార, విపక్ష పార్టీల్లో గ్రూప్ రాజకీయాలు పెరిగిపోయాయ్. ఒకరికి ఒకరు చెక్ పెట్టుకుంటూ నేతలంతా వ్యూహాలు అమలు చేస్తున్నారు. దీంతో రాజకీయం మరింత ఆసక్తికరంగా మారింది. ఓసారి సిక్కోలు పార్లమెంటు సీటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను పరిశీలిస్తే....

ఇచ్ఛాపురం అసెంబ్లీ.. టీడీపీకి కంచుకోట. సైకిల్ పార్టీ ఆవిర్భవించిన తర్వాత 8సార్లు ఎన్నికలు జరగగా.. ఏడుసార్లు విజయం వరించింది. సిట్టింగ్ ఎమ్మెల్యేగా బెందాళం అశోక్ ఉన్నారు. 2014, 2019లో టీడీపీ నుంచి బెందాళం అశోక్ వరుసగా విజయం సాధించారు. గత ఎన్నికల్లో వైసీపీ హవాలోనూ గెలిచిన అశోక్.. పార్టీలో మంచి పేరు సాధించారు. 2024లోనూ ఆయన మరోసారి బరిలోకి దిగేందుకు సిద్ధం అవుతున్నారు. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, కళింగ సామాజికవర్గ మద్దతు, మత్స్యకార గ్రామాల్లోనూ మంచి పట్టు ఉండడం.. అన్నింటికి మించి టీడీపీ కేడర్ బలంగా ఉండడం.. అశోక్‌కు కలిసి రానుంది. వైసీపీ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన పిరియా సాయిరాజ్.. మళ్లీ టికెట్ వస్తుంది ఆశపడుతున్నారు. ఐతే గ్రూప్ రాజకీయాలు ఆయనకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేశ్ కుమార్ అగర్వాల్, నర్తు నరేంద్ర టికెట్ ఆశిస్తున్నారు. వీరంతా ఎవరికి వారే అన్నట్లుగా రాజకీయం నడిపిస్తుండడంతో.. ఇచ్ఛాపురం వైసీపీలో గ్రూప్ వార్ పీక్స్‌కు చేరింది. వీరితో పాటు ఏపీ మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకట రెడ్డి కూడా వైసీపీ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. జనసేన నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన దాసరిరాజు, లొల్ల రాజేశ్ టికెట్ రేసులో ఉన్నారు. మత్స్య కార సామాజికవర్గంలో పవన్ ఫ్యాన్స్ భారీగా ఉన్నా.. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ లేకపోవడం జనసేనకు మైనస్.

ఏపీ రాజకీయాల్లో ఎప్పుడూ హాట్‌టాపిక్‌గా ఉండే నియోజకవర్గం పలాస. మంత్రి సీదిరి అప్పలరాజు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. గౌతు కుటుంబానికి ఈ నియోజకవర్గం పెట్టని కోట. అలాంటి ప్రాంతంలో మొదటిసారి బరిలో నిలిచి.. గౌతు కుటుంబం కంచుకోటను బద్దలుకొట్టారు సీదిరి అప్పలరాజు. రాబోయే ఎన్నికల్లోనూ ఆయనే బరిలో దిగే అవకాశాలు ఉన్నాయ్. ఇప్పటి నుంచే జనాలను కలుసుకోవడం మొదలుపెట్టారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ప్రతీ గ్రామాన్ని టచ్ చేస్తున్నారు. జనాల నుంచి సీదిరికి మంచి స్పందనే లభిస్తున్నా.. పార్టీలో స్థానికంగా గ్రూప్ రాజకీయాలు ఇబ్బంది పెడుతున్నాయ్. లోకల్ లీడర్లు దువ్వాడ శ్రీకాంత్, హేమబాబు చౌదరిలాంటి నేతలు.. సీదిరికి వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. పలాసలో మంత్రి అనుచరులు భూకబ్జాలు, అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారన్న విమర్శలు.. సీదిరికి మైనస్‌గా మారుతున్నాయ్. టీడీపీలో పరిస్థితి మరోలా ఉంది. పార్టీకి బలమైన కేడర్ ఉన్నా.. నియోజకవర్గ ఇంచార్జి గౌతు శిరీష సరిగా నడిపించలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయ్. మంత్రి సీదిరిని ఎదుర్కోవడంలో ఆమె విఫలం అవుతున్నార్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతానికి శిరీషకు టికెట్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేనట్లు కనిపిస్తున్నా.. ఎన్నికల నాటికి ఏదైనా జరగొచ్చు అనే చర్చ వినిపిస్తోంది. పలాసలో జనసేన పార్టీ పుంజుకుంటోంది. పవన్‌తో పాటు జనసేన నేతలు నియోజకవర్గంలోని మత్స్యకార గ్రామాల్లో వరుస పర్యటనలు చేయడం.. యువతను ఆకట్టుకుంటోంది.

పార్లమెంట్ పరిధిలో మరో కీలక నియోజకవర్గం టెక్కలి. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్.. 1994లో ఇక్కడి నుంచి పోటీ చేసి అప్పట్లో 40వేలకు పైగా మెజారిటీతో చట్టసభలకు వెళ్లారు. ప్రస్తుత ఏపీ టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 2014, 2019లో వరుసగా గెలిచిన అచ్చెంనాయుడు.. ఇక్కడి నుంచి మరోసారి బరిలో నిలిచి హ్యాట్రిక్ కొట్టాలనే పట్టుదలతో ఉన్నారు. వైసీపీ నుంచి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్.. ఈసారి టెక్కలి నుంచి బరిలో దిగబోతున్నారు. ఐతే దువ్వాడను గ్రూప్ రాజకీయాలు ఇబ్బంది పెడుతున్నాయ్. కేంద్ర మాజీమంత్రి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్.. ఎవరికి వారే గ్రూప్‌లు నడిపిస్తున్నారు. లీడర్లు ఎక్కువ.. కేడర్ తక్కువ అన్నట్లుగా టెక్కలిలో వైసీపీ పరిస్థితి తయారయింది. దువ్వాడ శ్రీనివాస్ ఏకపక్ష ధోరణిని మిగిలిన వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయ్. టెక్కలిలో జనసేన ప్రభావం పెద్దగా లేదు.

నరసన్నపేటలో ధర్మాన కృష్ణదాస్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగుతున్నారు కృష్ణదాస్. ఈసారి కూడా నరసన్నపేట బరిలో వైసీపీ తరఫున ఆయన లేదా ఆయన కుమారుడు ధర్మాన కృష్ణ చైతన్య బరిలో దిగే అవకాశాలు ఉన్నాయ్. ధర్మాన క్రిష్ణదాస్ కుటుంబసభ్యుల వ్యవహార శైలితో.. వైసీపీకి కేడర్ రోజురోజుకు దూరం అవుతున్న పరిస్థితి ! మరోవైపు కృష్ణదాస్.. పార్లమెంట్ బరిలో నిలిచే అవకాశం ఉందన్న చర్చ కూడా నడుస్తోంది. టీడీపీ నుంచి ఎవరికి టికెట్ వస్తుందన్న దానిపై ప్రస్తుతానికి క్లారిటీ లేదు. మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఇంచార్జిగా ఉన్నారు. మెతక వైఖరితో ఇక్కడ పార్టీలో దూకుడు కనిపించడం లేదు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు కూడా ఇక్కడి నుంచి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు తనయుడు బగ్గు శ్రీనివాసరావు కూడా టికెట్ మీద ఆశలు పెంచుకుంటున్నారు. యువకులకు టికెట్ కేటాయిస్తే.. గెలుపు సాధ్యం అవుతుందని పార్టీ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయ్. ఏమైనా వచ్చే ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ మధ్య టఫ్ ఫైట్ కనిపించే నియోజకవర్గాల్లో నరసన్నపేట టాప్‌లో ఉంటుంది.

పాతపట్నంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా రెడ్డి శాంతి ఉన్నారు. కలమట కుటుంబానికి కంచుకోటగా ఉన్న పాతపట్నంలో.. గత ఎన్నికల్లో కలమట వెంకటరమణమూర్తిని ఓడించి రెడ్డి శాంతి విజయం సాధించారు. 2019 ఎన్నికల ముందు జనాలతో మమేకం అయి నట్లు కనిపించిన రెడ్డి శాంతి.. గెలిచిన తర్వాత పార్టీని, ప్రజలను దూరంగా పెట్టారన్న విమర్శలు ఉన్నాయ్. నియోజకవర్గంలో మూడు మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు.. ఆమెకు వ్యతిరేకంగా ఉన్నారు. రెడ్డిశాంతికి మళ్లీ టికెట్ ఇస్తే పనిచేసేది లేదని తెగేసి చెప్తున్నారు. ఎమ్మెల్యే పీఏ నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారని.. సొంతపార్టీలోనే ఆగ్రహం వ్యక్తం అవుతోంది. దీంతో అధిష్టానం నిర్ణయం ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది. కొత్తూరు ఎంపీపీ తులసి, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మాజీ డీసీసీబీ చైర్మన్ డోల జగన్.. ఎవరికివారి వచ్చే ఎన్నికల్లో టికెట్ తమకే అంటూ ప్రచారం చేసుకోవడం.. కేడర్‌ను కన్ఫ్యూజన్‌లో పడేస్తోంది. ఇక్కడ టీడీపీ ఇంచార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు వర్గపోరు తప్పడం లేదు. తనకే టికెట్ అని కలమట ధీమాగా ఉన్నా.. ఆయనకు పోటీగా మామిడి గోవింద రావు టికెట్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంటింటికి ఎంజీఆర్ అనే నినాదంతో.. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అధికార, విపక్షాలను గ్రూప్ రాజకీయాలు వెంటాడుతున్న వేళ.. పోటీ ఎలా ఉంటుందనే ఆసక్తి కనిపిస్తోంది.

(మిగతా రేపటి సంచికలో)

# ఇకనైనా ముదిరాజులకు మేలు జరిగేనా ?



డా.పోలం సైదులు ముదిరాజ్
9441930361.

■ గత పాలకుల చేతిలో ముదిరాజ్‌లకు తీవ్ర అన్యాయం ■ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన బీసీ-ఏ రిజర్వేషన్ అందని ద్రాక్ష
■ కొన్ని కులాలు కోర్టుమెట్లు ఎక్కగానే పుష్కరకాలంగా నిరీక్షణ ■ విభిన్నరూపాల్లో పోరాటాలను ఆలకించని ప్రభుత్వాలు ■ మూడు అసెంబ్లీస్థానాల్లో ముదిరాజులకు కాంగ్రెస్ అవకాశం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి మొదలుకుంటే నేటి తెలంగాణ రాష్ట్రం వరకు అన్నిరంగాలలో సామాజిక,విద్య, ఉద్యోగ,ఆర్థిక, రాజకీయరంగాలలో ముదిరాజులకు జరగాల్సినన్యాయం జరగకుండా తీవ్ర అన్యాయపాలవుతుందన్న విషయం అక్షరసత్యం. భారతరాజ్యాంగం 9వ షెడ్యూల్లోని ఆర్టికల్ 15(4) మరియు 16(4)ద్వారా వివక్షలేకుండా అందరికీ సమానవకాశాలు ఉండాలని విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి.కానీ మనరాష్ట్రంలో ముదిరాజులకు 2009లో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన బీసీ–ఏ రిజర్వేషన్ అందని ద్రాక్షలా తయారైందని చెప్పడంలో ఎలాంటి అబద్ధంలేదు.నాటి నుండి నేటి వరకు ముదిరాజులు విభిన్నరూపాల్లో పోరాటాలుచేసిన ఏ ప్రభుత్వం ఆలకించలేదు.కానీ 2023 సాధారణ ఎన్నికల నేపథ్యంలో ముది రాజు లపై రాజకీయపార్టీలు అనుసరిస్తున్నతీరును గ్రహించిన యావత్తు ముదిరాజ్ ప్రజానీకం ఒక్కసారి తమ నిరసనగలాన్ని ఎత్తుకొని ప్రశ్నించడం మొదలుపెట్టారు.దీనికి సికింద్రాబాద్ లోని పేరెడ్ గ్రౌండ్లో జరిగిన బహిరంగసభను ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.దీనంతటిని గ్రహించిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారం చేపట్టడానికి ముదిరాజుల మద్దతుకోరుతూ ముదిరాజులకు మూడు అసెంబ్లీస్థానాల్లో అవకాశం కల్పించి, అధికారంలోకిరాగానే ముది రాజు లను బీసీ–ఏలో చేర్చుతామని హామీనిస్తూ మేనిఫెస్టోలో పెట్టడం జరిగింది.ప్రస్తుతం ఇచ్చినస్థానాలలో మక్తల్ నియోజకవర్గం నుండి వాకిటి శ్రీహరి ముదిరాజ్ గెలుపొందగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో కొలువుదీరింది.ఈ గెలుపులో ముదిరాజుల నాయకులు లేనప్పటికీ క్షేత్రస్థాయిలో యావత్తు ముదిరాజ్ ప్రజానీకం తమ ఆశయసాధన కదం తొక్కారన్నది నగ్నసత్యం.

ఒక్కసారి ముదిరాజులకు జరుగుతున్న అన్యాయాలను పరిశీలిస్తే.. 1970లో అనంతరామన్ కమిషన్ నివేదిక ప్రకారం కులాలవర్గీకరణ చేపట్టి,రిజర్వేషన్స్ కల్పించడం జరిగింది.రాష్ట్రంలో 52 నుండి 54శాతం కలిగిన బీసీ సామాజికవర్గానికి కల్పించిన రిజర్వేషన్స్ 24శాతం.అంటే జనాభాలో సగం శాతం అనుకుంటే,14 శాతం జనాభా కలిగిన బీసీ–ఏ కులాలకు 7శాతం రిజర్వేషన్స్,15 శాతం జనాభా కలిగిన బీసీ–బి కులాలకు 10 శాతం రిజర్వేషన్స్ కల్పిస్తే,రాష్ట్రజనాభాలో 28శాతం జనాభా కలిగిన బీసీ–డీ కులాలకు 7శాతం రిజర్వేషన్స్ కల్పించడం అనేది దేనికినాందియో ఎవరికి అర్థంకాని పరిస్థితి.ఇదిలా ఉంటే విద్య,ఉద్యోగ,ఆర్థిక, సామాజిక, రాజకీయరంగాలలో అత్యంత వెనుకబడిన సామాజికవర్గం ముదిరాజులని చెప్పకతప్పదు.28శాతం జనాభా కలిగిన బీసీ కులాలలో ముదిరాజుల ఒక్కకులమే దాదాపు 14.02 శాతానికిపైగా జనాభా కలిగి రాష్ట్రంలోని అత్యంత జనాభాకలిగిన అతిపెద్ద ఏకైకకులంగా పేర్కొనబడిందడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆనాటి నుండి ముదిరాజు కులపెద్దలు ఆ సామాజికవర్గానికి తీవ్రఅన్యాయం జరుగుతుందని ప్రభుత్వాలకు మొరపెట్టుకొని ఎన్నో ఉద్యమాలుసాగిస్తే, చివరికి 39సంవత్సరాల తర్వాత వైయస్ రాజ శేఖర్ రెడ్డి ప్రభుత్వం 2009లో 15 జీవోను తెస్తూ, ముదిరాజులను బిసి–డి నుండి బీసీ–ఏలోకి చేర్చారు.కానీ అదికూడా "మూన్నాళ్ళ ముచ్చటగానే" మిగిలి పోయింది.బీసీ– ఏ లోని కొన్ని కులాలు కోర్టు మెట్లు ఎక్కగానే పుష్కరాలం పైగా కోర్టులోనే ఉండి,ముదిరాజులను విద్యా,ఉద్యోగ,ఆర్థిక,సామాజికరంగాలలో కోలుకోలేని దెబ్బతీసింద నడంలో ఎలాంటి అనుమానం అక్కరలేదు.దాదాపు 13సంవత్సరాలు గా రాష్ట్ర ముదిరాజునాయకులు రిజర్వేషన్స్ విషయంలో అలుపెరు గని పోరాటాలుచేస్తూ,సుప్రీంకోర్టులో తమగోడును విన్నవించుకుంటే చివరికి 2022 అక్టోబర్ 11న సుప్రీంకోర్టు ఈ అంశానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి,పరిశోధించి,ఆయా కులాలతో చర్చించి,పరిష్కారమార్గాలను సూచిస్తూ నాలుగువారాలలోపు ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆదేశాలు ఇవ్వడం అందరికీ సుపరిచితమే అయినప్పటికీ ఏడాది దాటి ప్రభుత్వం మారే నాటికి కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు.ఇదిలాఉంటే 6 జీవో రద్దు వల్ల ముదిరాజులలోని మత్స్యకారులకు సభ్యత్వాలు ఎండమావి లా తయారయ్యాయి.దీనికితోడు ముదిరాజులకున్న చెరువులపైదాడి, లూటీలుజరిగి కేసులు,కోర్టులంటూ ఎంతో ఆర్థిక మనోవేదనకు గురవుతున్న పట్టించుకునే నాధుడేకరువయ్యాడు.

ఇదిగాక ముదిరాజు లు నిర్మించుకున్న పెద్దమ్మతల్లి దేవాలయాల ప్రహరిగోడల కూల్చి వేతలు,విడిసిల ద్వారా గ్రామబహిష్కరణలు గావించడం, ముదిరాజు మహిళలపై హత్యాచారాలు జరగడం,ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలున్నాయి. రాష్ట్రంలో 60లక్షలకుపైగా జనాభా కలిగిన ముది రాజ్ సామాజికవర్గానికి 119 శాసనసభ్యులు కలిగిన శాసనసభలలో 16 నుండి 20 మందిసభ్యులు,40మంది కలిగిన శాసనమండలీలో 6మంది సభ్యులు,పార్లమెంటు (లోకసభ మరియు రాజ్యసభ)లో 4 నుండి 4మంది సభ్యులు,హైదరాబాద్ మినహా 32 జిల్లాపరిషత్తు చైర్మన్ లలో కనీసం 4గురు,594 మండలపరిషత్తు చైర్మన్ స్థానాలలో 83మంది ఇలా జడ్పిటిసి,ఎంపిటిసి,సర్పంచ్ స్థానా లలో జనాభా ప్రాతిపదికనా ముదిరాజులకు రావాల్సినపదవులు వారిసంఖ్యను చూస్తే ముదిరాజులకు ఎంత అన్యాయం జరుగుతుందో ఈ లెక్కలే ఒక తార్కాణం. రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారిన, అనాదిగా వస్తున్న ముదిరాజులచరిత్రను లిఖించి,భద్రపరిచి,ప్రస్తుత తరాలకు అందించడంలో విఫలమయ్యాయని చెప్పకతప్పదు.. మరీముఖ్యంగా ముదిరాజు సామాజికవర్గంలో పుట్టి,యావత్తు సమాజానికి విశిష్టసేవలు అందించిన మహనీయుల చరిత్ర లేకపోవడం,నేటికీ వారిలో చాలామందిని స్మరించకపోవడమనేది చాలా విచారకరం అని చెప్పకతప్పదు.అందులో కొంతమందిని ప్రస్తావిస్తే..

కృష్ణస్వామి ముదిరాజ్ నిజాం నిరంకుశపాలనలో తనకంటూ ఒకస్థానం సంపాదించుకొని మొట్టమొదటగా ముదిరాజులకై 1920లో ముదిరాజ్ మహాసభ స్థాపించి,ఆపై సమాజాభివృద్ధికి మరెన్నో సంఘాలకు పురుడుపోసి,స్వాతంత్ర ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించి ఆ తర్వాత హైదరాబాదు నగరమేయర్ గా పనిచేసి,తన విశిష్టసేవలతో దేశవ్యాప్తంగా ఖ్యాతి గడించారు. ఆయన రాసిన పుస్తకాలు అభివృద్ధికి,అధికారానికి బాసటగా నిలిచాయనంలో ఎలాంటి అతిశయోక్తిలేదు.కానీ అలాంటి వ్యక్తిని స్మరించుకోవడానికి ప్రభుత్వాలు ఎలాంటి చర్య తీసుకోలేదు.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో భాగంగా కేసీఆర్ 2009లో "కెసిఆర్ సచ్చుడో – తెలంగాణ వచ్చుడో" అనే నినాదంతో సిద్దిపేట దీక్షశిబిరానికి వెళ్లిపోతున్న సమయంలో,నాటి పాలకవర్గం తమ అధికారంతో కరీంనగర్ చౌరస్తాలో అరెస్టుచేసి ఖమ్మం తీసుకువెళుతున్న సమయంలో మొదట హైదరాబాద్ లోని ఎల్బీనగర్ చౌరస్తాలో నవంబర్ 29న శ్రీకాంత్ చారి తనశరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడగా,అతనిని వైద్యంనిమిత్తం హాస్పిటల్ లో చేర్చగా డిసెంబర్ 3న తుదిశ్వాస విడవడం జరిగింది.కానీ డిసెంబర్ 1న పోలీస్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న ముదిరాజ్ ముద్దుబిడ్డ కిష్టయ్య ముదిరాజ్ సెల్ టవర్ ఎక్కి తన సర్వీస్ రివాల్వర్ తో కాల్చుకుని తన ఆత్మ బలిదానానికి పాల్పడి,మలిదశఉద్యమ తొలి అమరుడుగా పేరుగాంచి ప్రత్యేకఉద్యమాన్ని ఉద్రిక్తం కావడానికి కారకులయ్యారన్నది నూటికి నూరుపాళ్ళు నిజం కాదా?ఇలా చెప్పుకుంటూపోతే ఎందరో మహనీయులు తమకులానికే కాకుండా బహుజనులకు అండగా విశిష్టసేవలు అందించిన మహనీయుల చరిత్రను భవిష్యత్తుతరాలకు అందుబాటులోకి తేవకపోవడం చాలా దురదృష్టకరం.ఇప్పటికైనా నేటి ప్రభుత్వం వారిని గుర్తించి సమాజంలో శాశ్వతంగా గుర్తుండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడడానికి మొన్నటి ఎన్నికలలో నిర్వహించిన సభలు,సమావేశాలలో ముదిరాజులపట్ల మీరు చూపిన మక్కువను కేవలం ఉపన్యాసాలకే పరిమితం చేయకుండా ఆచరణలో ఆమోదయోగ్యం పలుకుతూ,గత ప్రభుత్వం ఒక్క రోజులోనే జరిపిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను వెల్లడించి,జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశాలు కల్పించి,ప్రస్తుతం ఖాళీగా ఉన్న శాసనం మండలిలో కనీసం ఒక్క అవకాశం ముదిరాజులకు ఇచ్చి,రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో సైతం తగిన గుర్తింపు ఇవ్వాలని కోరుకుందాం.

సూర్య
హైదరాబాద్
బుధవారం
20 డిసెంబర్ 2023


# హెచ్ 1బి వీసా రెన్యూవల్ ఇకపై అమెరికాలోనే

● వచ్చే జనవరి నుంచే అమలు ● అమెరికాలోని భారతీయులకు భారీ ఊరట ● పైలట్ ప్రాజెక్టు అమలుకు అగ్ర రాజ్యం గ్రీన్ సిగ్నల్ ● తొలుత 20 వేల మంది హెచ్ 1బి వీసా హోల్డర్లకు ప్రయోజనం




వాషింగ్టన్ : అగ్ర రాజ్యం అమెరికాలో హెచ్ 1బి వీసాతో ఉద్యోగం చేస్తున్న భారత సంతతి పౌరులకు భారీ ఊరట లభించనున్నది. ఇకపై హెచ్ 1బి వీసా రెన్యూవల్ కోసం ఇండియాకు రావలసిన అవసరం లేకుండా అమెరికా చర్యలు ప్రారంభించింది. వీసా నిబంధనలలో మార్పులు చేసింది. అమెరికాలోనే ఆ వీసాలను రెన్యూవల్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. పైలట్ ప్రాజెక్టుగా 20 వేల హెచ్ 1బి వీసాలను రెన్యూవల్ చేసే ప్రక్రియకు అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వచ్చే ఏడాది జనవరిలో ఈ ప్రక్రియను అమలులోకి తీసుకు వచ్చేందుకు అక్కడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనితో అమెరికాలోని భారత సంతతి ఉద్యోగులకు ఊరట లభించనుంది. ఆ వీసా రెన్యూవల్‌కు సంబంధించి విధి విధానాలపై ప్రస్తుతానికి స్పష్టత లేదని, ఎవరు అర్హులనే విషయం ఫెడరల్ రిజిస్టర్ నోటీసు విడుదలైన తరువాతే తెలుస్తుందని బ్లూమ్‌బర్గ్ లా వెల్లడించింది. ఆ ప్రాసెస్‌కు సంబంధించి వైట్ హౌస్ యంత్రాంగం ఈ నెల 15న చర్చించి ఆమోదం తెలిపింది. హెచ్ 1బి వీసా రెన్యూవల్ కోసం వీసా హోల్డర్లు ఒక్క మెయిల్ చేస్తే సరిపోతుందని అధికారులు తెలిపారు. గతంలో వీసా రెన్యూవల్ కోసం హెచ్ 1బి హోల్డర్లు అమెరికా దాటి వెళ్లవలసి వచ్చేది. పక్క దేశాలకు లేదా మాతృ దేశానికి వెళ్లి అక్కడి నుంచి రెన్యూవల్ దరఖాస్తు చేసుకునేవారు. గత జూన్ నెలలో ప్రధాని నరేంద్ర మోడీ అమెరికాలో పర్యటించినప్పుడు ఆ వీసా రెన్యూవల్ కష్టాలను తప్పించేందుకు డొమెస్టిక్ రెన్యూవల్ పద్ధతిని తీసుకువస్తామని అమెరికా ప్రకటించింది.

# స్టార్క్ రీ ఎంట్రీ అదిరింది




● ఐపీఎల్‌లో ఆడకూడదనుకున్నవాడికే అత్యధిక రేటు ● వేలంలో కళ్లు చెదిరే ధర పలికిన మిచెల్ స్టార్క్ ● ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా మిచెల్ స్టార్క్ ● రూ. 24.75 కోట్లకు కొనుగోలు చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ ● ఎనిమిదేళ్ల తరువాత ఐపీఎల్‌లోకి స్టార్క్ రీ ఎంట్రీ ● కమిన్స్ రికార్డును బద్దలు కొట్టిన స్టార్క్ ● రూ. 20.50 కోట్లకు కమిన్స్‌ను కొన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ● దుబాయిలో ఐపీఎల్ మినీ వేలం

దుబాయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 మినీ వేలంలో రికార్డులు బద్దలవుతున్నాయి. ఆస్ట్రేలియా పేసర్ల కోసం ఫ్రాంఛైజీలు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నాయి. ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను రూ. 20.50 కోట్లకు సన్‌రైజర్స్ హైదరాబాద్ దక్కించుకోగా, ఆ జట్టుకే చెందిన స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ కోసం గుజరాత్ టైటాన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ హోరాహోరీగా బిడ్లు వేశాయి. అటు నెహ్రా, ఇటు గంభీర్.. ఇద్దరూ స్టార్క్ కోసం పంతం పట్టడంతో ఐపీఎల్ చరిత్రలో ఎవరూ ఊహించని రీతిలో రూ. 24.75 కోట్ల ధరకు ఆస్ట్రేలియా పేసర్ అమ్ముడు పోయాడు. జట్టులో ఓవర్సీస్ పేసర్ ఎవరూ లేకపోవడంతో స్టార్క్ కోసం భారీ ధర పెట్టేందుకు సైతం కోల్‌కతా వెనుకంజ వేయలేదు. మరొక వైపు టైటాన్స్ కూడా స్టార్క్ కోసం చివరి వరకు ప్రయత్నించింది. ఐపీఎల్ వేలం చరిత్రలో రూ. 20 కోట్లకుపైగా ధర పలికిన తొలి ఆటగాడు ప్యాట్ కమిన్స్ కాగా, స్టార్క్ అంతకు నాలుగు కోట్లకు పైగా ధర పలకడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వాస్తవానికి మిచెల్ స్టార్క్ ఐపీఎల్ కంటే తన జట్టు ప్రయోజనాలకు, ఫ్యామిలీతో గడపడానికి ప్రాధాన్యం ఇచ్చాడు. తన కెరీర్‌ను పొడిగించు కోవడం కోసం 2022 ఐపీఎల్ మెగా వేలం నుంచి వైదొలిగాడు. కరోనా కారణంగా బయో బబుల్‌లో ఉండడం తన వల్ల కాదని, ఐపీఎల్ నుంచి వైదొలగడం ద్వారా తదుపరి అంతర్జాతీయ టోర్నీలకు తాజాగా ఉండవచ్చని స్టార్క్ అప్పట్లో అభిప్రాయపడ్డాడు. 2014 సీజన్‌లో ఆర్సీబీ స్టార్క్‌ను రూ. 5 కోట్లకు కొనుగోలు చేసింది. 2015 సీజన్‌లోనూ ఆర్సీబీ తరఫున ఆడిన మిచెల్ స్టార్క్ ఆ రెండు సీజన్లలోనూ 27 మ్యాచ్‌లు ఆడి 7.17 ఎకానమీతో 34 వికెట్లు తీశాడు. 2016లో గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమైన స్టార్క్ మరుసటి ఏడాది వేలంలో పాల్గొనలేదు. 2018లో కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 9.40 కోట్లకు స్టార్క్‌ను కొనుగోలు చేసింది. కానీ గాయం కారణంగా అతను ఆ సీజన్‌లో ఆడలేదు. 2019 వరల్డ్ కప్ ముందు మిగతా ఆస్ట్రేలియా క్రికెటర్ల తరహాలోనే స్టార్క్ కూడా ఐపీఎల్ ఆడలేదు. 2020 మెగా వేలంలో పాల్గొనరాదని నిర్ణయించుకున్న స్టార్క్ 8 ఏళ్ల తరువాత ఐపీఎల్‌లోకి రీ ఎంట్రీ ఇస్తున్నాడు. వస్తూనే.ప్యాట్ కమిన్స్ రికార్డును స్టార్క్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్ ఆడి డబ్బు సంపాదించడం కంటే ఆస్ట్రేలియా తరఫున వంద టెస్ట్ మ్యాచ్‌లు ఆడిన బౌలర్ అనిపించుకోవడమే తనకు ఇష్టమన్న స్టార్క్ ఇప్పుడు ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డ్ క్రియేట్ చేశాడు.

## పార్లమెంట్ ఘటనపై
# ప్రతిపక్షాలది రాజకీయం

● ప్రధాని మోడీ నిశిత విమర్శ ● భద్రత ఉల్లంఘన ఖండనీయమే ● కాని ప్రతిపక్షాల వైఖరి గర్హనీయం ● దానిని రాజకీయ రంగు ఇస్తున్నారు ● బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోడీ ఆక్షేపణ



న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో భద్రత ఉల్లంఘన అంశంపై ఉభయ సభలలో కని విని ఎరగని నిరసనలు, భారీ సంఖ్యలో సస్పెన్షన్ల పట్ల ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 13 నాటి ఘటనలు పార్టీలకు అతీతంగా నిర్ద్వంద్వంగా ఖండించవలసినవేనని, అయితే, ఉమ్మడి ప్రతిపక్షం వాటికి 'రాజకీయ రంగు' ఇస్తున్నాయని ప్రధాని తీవ్రంగా విమర్శించారు. మంగళవారం దేశ రాజధానిలో బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఇదే బిజెపి పార్లమెంటరీ పార్టీ ఆఖరి సమావేశం. క్రితం నెల ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాలలోకి మూడింటిలో ఘోర పరాజయం పొందడంతో ప్రతిపక్షం ఆ నిరాశా నిస్పృహలను పార్లమెంట్‌లోను, వెలుపల నిరసనల ద్వారా బహిర్గతం చేస్తున్నాయని సమావేశంలో ప్రధాని మోడీ విమర్శించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పార్లమెంటరీ భద్రత ఉల్లంఘనకు ప్రతిపక్షం ఈ విధంగా 'పరోక్షంగా మద్దతు ఇవ్వడం' ఆందోళనకరం అని ప్రధాని అన్నారు. పార్లమెంట్‌లో ఆ సంఘటన జరిగినప్పటి నుంచి హోమ్ శాఖ మంత్రి అమిత్ షా నుంచి ప్రకటన కోసం పట్టుబట్టుతూ ప్రతిపక్షాలు సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్నాయి. దీనితో ఉభయ సభలలో సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. మంగళవారం వరకు పార్లమెంట్ నుంచి 141 మంది సభ్యులను సస్పెండ్ చేశారు.

## లోక్ సభలో మరి 49 మంది ఎంపీలపై
# సస్పెన్షన్ వేటు



న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు తీవ్ర గందరగోళం మధ్య కొనసాగుతున్నాయి. లోక్ సభలోకి దుండగుల చొరబాటు అంశంపై ఉభయ సభలు దద్దరిల్లుతున్నాయి. ఈ నెల 13న జరిగిన ఈ భద్రత వైఫల్యంపై కేంద్ర హోమ్ శాఖ మంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్ పర్వం కొనసాగుతోంది. తాజాగా లోక్ సభలో మరి49 మంది ఎంపీలపై సస్పెన్షన్ వేటు వేశారు. వారిలో ఫరూక్ అబ్దుల్లా, శశి థరూర్, ఫైజల్, కార్తీ చిదంబరం, సుప్రియా సూలే, మనీశ్ తివారీ, డింపుల్ యాదవ్ తదితరులు ఉన్నారు. తాజా సస్పెన్షన్లతో కలిపి ఇప్పటి వరకు సస్పెండ్ అయిన ఎంపీల సంఖ్య (ఉభయ సభలు) 141కి చేరుకుంది. లోక్ సభలో 95 మంది, రాజ్యసభలో 46 మంది ఎంపీలు సస్పెండ్ అయ్యారు. వారందరినీ ఈ సమావేశాలు మొత్తానికి సస్పెండ్ చేశారు.

## అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి దూరంగా
# అద్వానీ, మురళీ మనోహర్ జోషి

● అద్వానీ, జోషి వయసు, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విజ్ఞప్తి చేసిన ట్రస్ట్ ● విన్నపాన్ని అంగీకరించిన సీనియర్ నేతలు ● దేవెగౌడను ఆహ్వానించేందుకు ముగ్గురు సభ్యుల బృందం



అయోధ్య : అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి కారణమైన బీజేపీ సీనియర్ నేతలు ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి ఆలయ ప్రారంభోత్సవానికి దూరంగా ఉండనున్నారు. వారి వయసును దృష్టిలో పెట్టుకుని ప్రారంభోత్సవానికి రావద్దని ఆలయ ట్రస్ట్ కోరింది. ప్రస్తుతం అద్వానీ వయసు 96 సంవత్సరాలు కాగా, మురళీ మనోహర్ జోషి వయసు 89 సంవత్సరాలు. అద్వానీ, జోషి ఇద్దరూ పెద్ద వయస్కులని, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయ ప్రారంభోత్సవానికి హాజరు కావద్దని విజ్ఞప్తి చేశామని ఆలయ ట్రస్ట్ తెలిపింది. తమ విజ్ఞప్తిని వారు మన్నించారని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవానికి మాజీ ప్రధాని దేవెగౌడ (90)ను ఆహ్వానించేందుకు ముగ్గురు సభ్యుల బృందాన్ని పంపినట్లు ఆయన తెలియజేశారు.

# ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిగా ఖర్గే

● ప్రతిపాదించిన మమత, కేజ్రీవాల్ ● సున్నితంగా తిరస్కరించిన ఖర్గే ● 22న దేశవ్యాప్త నిరసనకు కూటమి నిర్ణయం ● నెలాఖరుకు కొలిక్కి రానున్న సీట్ల సర్దుబాటు అంశం



న్యూఢిల్లీ : ప్రతిపక్ష కూటమి ఇండియా నాలుగవ సమావేశం మంగళవారం దేశ రాజధాని ఢిల్లీలో జరిగింది. వచ్చే ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహం, కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు తదితర అంశాలను చర్చిరచారు. ఇదే సమయంలో కూటమి ప్రధాని అభ్యర్థిగా ఎవరు ఉండాలనే దానిపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. కూటమి ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరును పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రతిపాదించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కానీ, దీనిని ఖర్గే సున్నితంగా తిరస్కరించినట్లు ఆ వర్గాలు తెలియజేశాయి. వాస్తవానికి ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థిత్వంపై లోక్‌సభ ఎన్నికల తరువాతే నిర్ణయిస్తామని బెంగాల్ సీఎం సోమవారం వ్యాఖ్యానించడం గమనార్హం. ఖర్గే దళిత సామాజిక వర్గానికి చెందిన కీలక నేత కావడంతో దీదీ ప్రతిపాదనకు విశేష స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ విధానాలను వ్యతిరేకించే ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సహా 12 పార్టీలకు చెందిన నాయకులు దీనితో ఏకభవించారని సమాచారం. అయితే, ఖర్గే వారి ఆశలపై నీళ్లు చల్లినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తాను అణగారిన వర్గాల కోసం మాత్రమే పని చేయాలనుకుంటున్నానని ఆయన చెప్పినట్లు ఆ వర్గాలు తెలిపాయి. రాష్ట్రపతి ఎన్నికల సమయంలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన రామ్‌నాథ్ కోవింద్, ద్రౌపది ముర్ములపై అభ్యర్థిని నిలబెట్టినందుకు అధికార బీజేపీ నుంచి ప్రతిపక్షం తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. కాంగ్రెస్, ఇతర పార్టీలు దళితులు, గిరిజనులకు వ్యతిరేకమని బీజేపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో బీజేపీకి చెక్ పెట్టేందుకు దీదీ ఖర్గే పేరును వ్యూహాత్మకంగా ప్రతిపాదించినట్లు భోగట్టా. కాగా, సమావేశంలో ఈ నెల 22న దేశవ్యాప్త ఆందోళన నిర్వహించాలని నిర్ణయించారు. సీట్ల సర్దుబాటు అంశంపై కూడా చర్చించినట్లు కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ఈ నెల చివరి నాటికి కొలిక్కి వస్తుందని ఆయన చెప్పారు.

## హమాస్‌తో యుద్ధంలో ఇజ్రాయెల్‌కు భారీ షాక్

గాజా/ జెరూసలెం : గాజాలోకి ప్రవేశించి హమాస్‌ను నామరూపాలు లేకుండా చేస్తున్న ఇజ్రాయెల్‌కు ఊహించని విపత్తు వచ్చి పడింది. హమాస్‌కు మొదటి నుంచి మద్దతుగా నిలుస్తున్న లెబనాన్‌కు చెందిన హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్ శత్రు దుర్భేద్యమైన ఐరోన్‌డోమ్‌పై దాడి చేసి దానికి తీవ్ర నష్టం కలగజేసింది. ఐరన్‌డోమ్ అనేది ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దీనిని ఏమార్చడం ద్వారానే ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులకు తెగబడింది. ఇప్పుడు దానినే లక్ష్యంగా చేసుకున్న హెచ్‌బొల్లా దానిని చాలా వరకు దెబ్బ తీసి మరొక భారీ షాక్ ఇచ్చింది. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంలోని కబ్రిలో రెండు ఐరన్‌డోమ్ వ్యవస్థలపై దాడి చేసి నష్టం కలిగించినట్లు హెచ్‌బొల్లా ప్రకటించింది. ఇజ్రాయెల్ మాత్రం ఈ విషయమై ఇంకా స్పందించలేదు.

# చైనాలో భారీ భూకంపం

● 116 మందికి పైగా మృత్యువాత ● 500 మందికి గాయాలు ● గన్సు ప్రావిన్స్‌లో రిక్టర్ స్కేలుపై 5.9 గా నమోదైన భూకంప తీవ్రత ● పెద్ద సంఖ్యలో కూలిపోయిన ఇళ్లు, భవనాలు ● నిన్న ఉదయం నుంచే మొదలైన రెస్క్యూ ఆపరేషన్ చర్యలు



బీజింగ్ : చైనాలో సోమవారం రాత్రి భారీ భూకంపం సంభవించింది. వాయవ్య చైనాలోని గన్సు ప్రావిన్స్‌లో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.9గా నమోదు అయింది. తీవ్ర భూకంపం ధాటికి 116 మంది మృతి చెందగా వందలాది మంది గాయపడ్డారని చైనా అధికార మీడియా సీసీటీవీ వెల్లడించింది. పెద్ద సంఖ్యలో భవనాలు కూలిపోవడంతో రెస్క్యూ సిబ్బంది శిథిలాలు తొలగిస్తున్నారని, మంగళవారం ఉదయం నుంచే సహాయక చర్యలు మొదలయ్యాయని వివరించింది. గన్సు ప్రావిన్స్‌లో భూకంపం తీవ్రత ఎక్కువగా ఉందని, ఇక్కడ సుమారు 100 మంది మరణించారని ప్రాంతీయ భూకంప సహాయ కేంద్రం వెల్లడించినట్లు పేర్కొంది. ఇక పొరుగునే ఉన్న కింగ్‌హై ప్రావిన్స్‌లోని హైదాంగ్ నగరంలో భూకంపం ధాటికి 11 మంది మృత్యువాత పడ్డారు. 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ భూకంపం కారణంగా పెద్ద సంఖ్యలో ఇళ్లు కూలిపోయానని, గణనీయమైన ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లిందని చైనా వార్తా సంస్థ జిన్హువా పేర్కొంది. ప్రాణాలు దక్కించుకునేందుకు ప్రజలు వీధుల్లోకి పరుగులు తీశారని ప్రస్తావించింది. కాగా, ఈ ప్రకృతి విపత్తుపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పందించారు. భూకంపం ప్రాంతాల్లో అన్ని విధాల సహాయక చర్యలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రాణాలతో బయటపడ్డవారిని సహాయక శిబిరాలకు తరలించాలని, వారి ఆస్తులకు రక్షణ కూడా కల్పించాలని ఆదేశించారు. కాగా 5.9 తీవ్రత గల ఈ భూకంపం కేంద్రం గన్సు ప్రావిన్స్ రాజధాని లాన్‌జౌకి నైరుతి దిశలో 100 కిలో మీటర్ల దూరంలో గుర్తించామని, కింగ్‌హై ప్రావిన్స్ సరిహద్దుకు సమీపంలో సంభవించిందని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. కాగా, చైనాలో భూకంపాలు తరచుగా సంభవిస్తుంటాయి. ఆగస్టులో తూర్పు చైనాలో 5.4 తీవ్రతతో కూడిన భూకంపం సంభవించింది. ప్రాణ నష్టం తక్కువగానే ఉన్నప్పటికి పెద్ద సంఖ్యలో భవనాలు కూలాయి. ఇక 2022 సెప్టెంబర్‌లో సిచువాన్ ప్రావిన్స్‌లో 6.6 తీవ్రతతో సంభవించినప్పుడు సుమారు 100 మంది మృత్యువాత పడ్డారు. 2008లో ఏకంగా 7.9 తీవ్రతతో భూకంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. 5,335 మంది పాఠశాల విద్యార్థులు సహా మొత్తం 87,000 మంది ప్రాణాలు కోల్పోయారు.

# పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్

● కెసిఆర్ తాజా నిర్ణయం ● రాష్ట్రానికి రావాలని ఎంపీలకు పిలుపు ● మెజారిటీ సీట్లు గెలుచుకోవాలని లక్ష్యంగా అడుగులు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి :పార్లమెంట్ ఎన్నికలపై భారత రాష్ట్ర సమితి ఫోకస్ పెట్టనుంది. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బీఆర్ఎస్ ఎంపీలతో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన భారత రాష్ట్ర సమితి పార్లమెంట్ ఎన్నికలపై ఫోకస్ ను పెట్టనుంది. హిప్ రీప్లేస్ మెంట్ సర్జరీ చేసుకున్న కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హైద్రాబాద్‌లోని జూబ్లీహిల్స్ లోని నందినగర్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. పార్లమెంట్ లో గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో విపక్ష పార్టీల సభ్యులు సస్పెన్షన్ కు గురయ్యారు. దీంతో భారత రాష్ట్ర సమితికి చెందిన ఎంపీలను హైద్రాబాద్ కు తిరిగి రావాలని కల్వకుంట్ల చంద్రశేఖర్ ఆదేశించారు. నిర్ణీత షెడ్యూల్ మేరకు 2024 ఏప్రిల్ మాసంలో పార్లమెంట్ ఎన్నికలు జరగాలి. అయితే నిర్ణీత షెడ్యూల్ కంటే ముందే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందనే ప్రచారం సాగుతుంది. దీంతో పార్లమెంట్ ఎన్నికలపై కేసీఆర్ ఫోకస్ చేయనున్నారు. ఈ నెల 18వ తేదీరాత్రి, ఈ నెల 19వ తేదీన భారత రాష్ట్ర సమితికి చెందిన ఎంపీలకు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫోన్ చేశారు. న్యూఢిల్లీ నుండి హైద్రాబాద్ కు రావాలని ఆదేశించారు. హైద్రాబాద్ లో ఎంపీలతో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు విడి విడిగా సమావేశం కానున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల్లో పరిస్థితిపై చర్చించనున్నారు. వాస్తవానికి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా పట్టు నిలుపుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు.

# పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి అధిక స్థానాలు

● కమలాపూర్ మండల కేంద్రంలో ప్రెస్ మీట్ నిర్వహించిన ఈటల రాజేందర్ ● తెలంగాణ రాష్ట్రమంతా అలముకున్నట్టే కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారు ● ఇచ్చిన హామీలు అన్నీ అమలుచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్న ● 8 సీట్లు, 19 సీట్లలో రెండవ స్థానం, 15 శాతం ఓట్లు బీజేపీ సాధించుకుంది ● బిజెపి ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: దేశరక్షణ, సమగ్రత నరేంద్రమోడీ నాయకత్వంలోనే సాధ్యం అని ప్రజలు నమ్ముతున్నారు. రేపు జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తాం అంటున్నారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న జమ్మూ కాశ్మీర్ సమస్య తీరింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీద కూడా మీద పట్టు సాధించబోతున్నాము. స్కాం లేకుండా అపకీర్తి లేకుండా దేశాన్ని పాలిస్తున్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో ఇరవై ఏళ్లుగా అధికారంలో ఉన్నాము. ఎందుకో ఈసారి ప్రజలు మాకు ఓట్లు వేయలేదు. అధికారం శాశ్వతం కాదు, అది ప్రజల ఇష్టం కాబట్టి ప్రజల తీర్పును శిరసావహిస్తున్నాం. గతంలోలాగా మీకు అన్నివిధాలుగా అండగా ఉంటాము. హుజూరాబాద్ లో మా ఆఫీస్ యదావిధిగా కొనసాగుతుందన్నారు. కొత్త స్ఫూర్తితో పురోగించాలని కార్యకర్తలను కోరుతున్నాను. గెలిస్తే పొంగిపోయి ఓడిపోతే కుంగిపోవడం కాకుండా జయపజయాల్లో ఒకే విధంగా ఉండాలి. ప్రజలసమస్యల పరిష్కారంలో ముందుభాగంలో ఉండాలనీ కోరుతున్న. ఎక్కడ అన్యాయం అక్రమాలు, దుర్మార్గాలు జరిగిన ప్రజలకు అండగా ఉంటామని, ఎంపీగా ఎవరు, ఎక్కడనుండి పోటీ చేయాలనేది పార్టీ నిర్ణయిస్తుందన్నారు. ఉపఎన్నికల తరువాత కేసీఆర్ హుజూరాబాద్ మీద పగపట్టారు. ఎమ్మెల్యేగా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లేకుండా చేశారు. అందుకే నేను ఎక్కువ ఇక్కడ కనిపించలేకపోయాను. అధికారులుసహకరించలేదు. ప్రజాస్వామ్య పాలనలో హుజూరాబాద్ లో చీకటి అధ్యాయం నడిచింది. నిజాం నిరంకుశత్వం నడిచింది. దళితబంధు, పెన్షన్, కళ్యాణలక్ష్మి ఆగిపోతుంది అని బెదిరిస్తే ప్రజలు నమ్మారు. ప్రగతిభవన్ కేంద్రంగా కుట్ర నడిచింది చచ్చిపోతాం శవయాత్రకు రండి అని బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలు, డ్రామాలు కేసీఆర్ కు ఇక్కడి అభ్యర్థికి మాత్రమే చెల్లుతుంది. ఇక్కడ ఏం జరిగిందో ప్రజల అంతరాత్మకు తెలుసు అని ఈటల రాజేందర్ అన్నారు.

# దావూద్ ఇబ్రహీం చనిపోయాడా?

● విష ప్రయోగం కారణంగా దావూద్ చనిపోయాడని వార్తలు ● ఈ వార్తల్లో నిజం లేదన్న ఛోటా షకీల్ ● దావూద్ ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉన్నాడని వెల్లడి



కరాచీ : పాకిస్తాన్‌లో ఉంటున్న అండర్‌వరల్డ్ డాన్, ఇండియాకు మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దావూద్ ఇబ్రహీంపై విష ప్రయోగం జరిగిందనే ప్రచారం జరుగుతున్న సంగతి విదితమే. అతను చనిపోయారనే వార్తలు కూడా వచ్చాయి. ఈ ప్రచారంపై దావూద్ సన్నిహితుడు ఛోటా షకీల్ స్పందిస్తూ, ఇదంతా తప్పుడు ప్రచారం అని చెప్పాడు. వెయ్యి శాతం ఆరోగ్యంగా, ఫిట్‌గా దావూద్ ఉన్నారని తెలిపాడు. దావూద్‌పై క్రమం తప్పకుండా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించాడు. ఇటీవలే పాకిస్తాన్‌లో దావూద్‌ను తాను కలిశానని చెప్పాడు. ఒక జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ షకీల్ ఈ మేరకు స్పష్టత ఇచ్చాడు. మరొక వైపు ఇండియా శత్రువులుగా భావించే వ్యక్తులు పాకిస్తాన్‌లో వరుసగా హత్యకు గురవుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వారిని హతమారుస్తున్నారు. ఇండియాలో 2024లో లోక్ సభ ఎన్నికలు జరిగే లోపుమరింత మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఆందోళనకు గురవుతోంది. ఒక్కొక్కరిని ఇండియా ఏజంట్లే హతమారుస్తున్నారని భావిస్తోంది.

### ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖామంత్రి ఆర్కే రోజా

# సీటు ఇవ్వకున్నా.. జగనన్న వెంటే



తిరుమల, సూర్య ప్రధాన ప్రతినిధి : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు టికెట్ రాదని ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖామంత్రి ఆర్కే రోజా మండిపడ్డారు. మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తనపై అసత్య ప్రచారం చేస్తూ కొంతమంది శునకానందం పొందుతున్నారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు ఏది జరిగినా ముందు వరుసలో ఉండేది నేనే. నేను సీఎం జగనన్నకు సైనికురాలిని. జగనన్న కోసం ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధం. సీటు ఇవ్వకపోయినా జగనన్న వెంటే ఉంటా. మిషన్ 2024లో 175/175లో భాగం అవుతానన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అంశంపైనా ఆమె స్పందించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు. అయితే జగనన్న మాటే తనకు శిరోధార్యమని, సీఎం వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని దేవుడిని కోరుకున్నట్లు తెలిపారు. ఎల్లో మీడియా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు.

ప్రతిపక్ష పార్టీలకు 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులు దొరకడం లేదని ఎద్దేవా చేశారు. పవన్, చంద్రబాబు ఎక్కడ పోటీ చేయాలో తెలియక రెండేసి చోట్ల సర్వే చేయించుకుంటున్నారని మంత్రి రోజా దుయ్యబట్టారు.

# వైసీపీలో ముదిరిన టికెట్ల లొల్లి



- సీటు మారుస్తారన్న ప్రచారంతో నేతల్లో టెన్షన్
- అభ్యర్థుల జాబితా ఖరారుపై సీఎం జగన్ కసరత్తు
- ఇన్చార్జుల మార్పుపై నేరుగా నేతలతోనే చర్చలు
- అభ్యర్థుల ఖరారుపై వైసీసీ అధినేత జగన్ ఫోకస్
- సీఎం జగన్‌తో ఉభయ గోదావరి జిల్లాల నేతల భేటీ
- త్వరలో సీమ జిల్లాల్లోనూ పలువురు అభ్యర్థుల మార్పు

గుంటూరు నుంచి 'సూర్య' ప్రత్యేక ప్రతినిధి : అధికార పార్టీలో టికెట్ల లొల్లి మొదలైంది. సీటు మారుస్తారన్న ప్రచారంతో నేతల్లో టెన్షన్ నెలకొంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఖరారుపై సీఎం జగన్ కసరత్తు కొనసాగుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలు, కొన్ని నియోజకవర్గాల్లో మార్పు, తదితర అంశాలపై సీఎం జగన్ ఎమ్మెల్యేలతో చర్చిస్తున్నట్టు సమాచారం. సీఎం జగన్ మోహన్ రెడ్డి నేతల అభిప్రాయాలు కూడా తెలుసుకుని ఇన్చార్జులను ఖరారు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానంపై ఎమ్మెల్యేలకు స్పష్టత ఇస్తున్నారు. త్వరలో సీమ జిల్లాల్లోనూ పలువురు అభ్యర్థుల మార్పు జరగనున్నట్లు సమాచారం. పలు నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులను మార్చాలని నిర్ణయించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి ఇప్పటికే 11 నియోజకవర్గాల్లో ఇన్చార్జులను మార్చారు. వారికే వచ్చే ఎన్నికల్లో సీటు ఇస్తున్నట్టు అభ్యర్థులకు స్పష్టం చేశారు. మరి కొన్ని నియోజకవర్గాల్లోనూ ఇన్చార్జిల మార్పుపై చర్చలు జరుపుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం మరికొందరు మంత్రులు, ప్రజా ప్రతినిధులకు సీఎం నుంచి పిలుపు వచ్చింది. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయానికి వచ్చిన మంత్రులు విశ్వరూప్, గుమ్మనూరు జయరాం సీఎంను కలిశారు. తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సీఎంతో భేటీ అయ్యారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే స్థానాల మార్పులపై వీరితో సీఎం జగన్ చర్చించినట్టు తెలిసింది.

నేతల అభిప్రాయాలు తెలుసుకుని ఇన్చార్జిలను ఖరారు చేస్తున్నారు. పోటీ చేసే స్థానాల విషయమై స్పష్టత ఇస్తున్నారు. వీరితో పాటు పలువురు ఎమ్మెల్యేలు క్యాంపు కార్యాలయానికి తమ సీటుపై పార్టీ ముఖ్యనేతలతో చర్చించినట్టు తెలుస్తోంది. గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే కిలారు రోశయ్య ,పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎమ్మెల్యే, విప్ ప్రసాదరాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, మంత్రి ఉష్రశీ చరణ్, కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే రఘురామరెడ్డి, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషా, మంత్రి శంకరనారాయణ సీఎంవో కు వచ్చి పార్టీ ముఖ్యనేతలతో మంతనాలు జరిపారు. కొంత మందికి సీటు ఇవ్వడం కుదరదని, అధికారంలోకి వచ్చాక ప్రత్యామ్నాయం చూస్తామని చెప్పినట్లు తెలిసింది. నిన్న ఉభయగోదావరి జిల్లాల నేతలతో చర్చించిన సీఎం మంగళవారం మరి కొంతమంది నేతలు, ఆశావహులతోనూ చర్చించారు. రెండు రోజుల్లో పలు నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జిలను ఖరారు చేసి ప్రకటించే అవకాశాలున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముదిరిన టికెట్ల లొల్లి : వైసీపీ లో టికెట్ల లొల్లి ముదిరింది. విజయవాడ వెస్ట్లో వెలంపల్లి శ్రీనివాసరావుకి వైసీపీ హై కమాండ్ ఈ సారి ఎన్నికల్లో మొండి చేయి చూపిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ అంశంపై వెలంపల్లిని సీఎం జగన్ పిలిపించి మాట్లాడారు. కాగా విజయవాడ సెంట్రల్ నుంచి వెలంపల్లి పేరుని పరిశీలిస్తామని సీఎం జగన్ చెప్పినట్లు సమాచారం. లేని పక్షంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మంచి పదవి ఇస్తామని సీఎం వెలంపల్లి కి చెప్పినట్టు తెలుస్తోంది. విజయవాడ సెంట్రల్లో మల్లాది విష్ణుకు సీట్ బెర్త్ కన్ ఫాం అవలేదని తెలుస్తోంది. విష్ణ స్థానంలో విజయవాడ వెస్ట్ నుంచి ఒక ప్రముఖ కళాశాల అధిపతిని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. అప్పుడే ఆయన నియోజకవర్గంలో ఫ్లెక్సీలతో హడావుడి చేస్తున్నారు. సర్వే నివేదికలు మీకు అనుకూలంగా లేవని వెలంపల్లికి సీఎం చేపినట్టు సమాచారం. బెజవాడలో వైసీపీలో ఇప్పటి పరిణామాలతో పార్టీ హైకమాండ్లో గందరగోళం నెలకొంది. అయితే సదరు వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీ కోసం త్యాగాలు తప్పవని హైకమాండ్ చెబుతోంది. అయితే టికెట్ దక్కని ఎమ్మెల్యేలను బుజ్జగించే బాధ్యతను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.

### ఏపీ ప్రభుత్వం తాజాగా

# మరో రూ.5858 కోట్ల అప్పు



అమరావతి, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పులకుప్పగా మారుతోంది. ఏపీ ప్రభుత్వం మరోసారి కేంద్ర ప్రభుత్వం నుంచి అప్పు తీసుకు వచ్చింది. తాజాగా మరో రూ.5858 కోట్ల అప్పును ఏపీ సర్కార్ తీసుకుంది. అదనపు అప్పుకు కేంద్ర ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసినందుకు అదనంగా 0.5% రుణాలు పొందేందుకు రాష్ట్రాలకు కేంద్రం అవకాశం కల్పించింది. విద్యుత్ సంస్కరణల్లో ప్రధానంగా మూడు అంశాలను అమల్లోకి తీసుకువచ్చినందుకు కేంద్ర ఆర్థిక శాఖ ఈ అవకాశం కల్పించింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 12 రాష్ట్రాలు ఈ అవకాశాన్ని అందివుచ్చుకోగా ఇప్పుడు ఆరు రాష్ట్రాలకే ఈ అవకాశం దక్కింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు మార్కెట్ నుంచి అదనపు రుణాలు పొందేందుకు కేంద్ర ఆర్థిక శాఖ అనుమతిస్తున్నట్లు ప్రకటించింది. కేంద్రం ప్రకటించిన ఆరు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్కి చోటు దక్కింది. 2021-22లో రూ. 3716 కోట్ల అప్పును ఏపీ ప్రభుత్వం తీసుకుంది. ఇప్పుడు 2022-23లో కేంద్రం కల్పించిన అవకాశంతో రూ. 5858 కోట్లు తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఏపీతోపాటు అస్సాం, కేరళ, రాజస్థాన్, సిక్కిం, పశ్చిమ బెంగాల్కి అదనపు రుణాలు పొందే అనుమతిని కేంద్రం కల్పించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వివరాలు పొందుపరిచారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ రికమండేషన్తో రాష్ట్రాలు మార్కెట్ నుంచి అదనపు రుణాలు పొందే అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.


# అయిదేళ్ళు దాటినా విఆర్ఏల జీతాలు పెంచలేదు

- సీఎం అంగీకరించినా విఆర్ఏల డిఏపై నేటికీ విడుదలకు నోచుకోని ఉత్వర్వులు
- రాష్ట్ర సంఘం బలోపేతానికి కొత్త జిల్లాలతో సహా అన్ని జిల్లాల కమిటీలు పూర్తి
- 2018 నుండి 2020 వరకు ఇచ్చిన డిఏను వెనక్కు తీసుకున్నారు
- 2018 నుండి అయిదేళ్ళు దాటినా విఆర్ఏలకు ఒక్కరూపాయికూడా జీతాలు పెంచలేదు
- 11 వ పిఆర్సీ కూడా అమలు చేయలేదు
- ఏపిజెఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు




విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : అయిదేళ్ళు దాటినా విఆర్ఏల జీతాలు పెంచలేదని, సీఎం అంగీకరించినా విఆర్ఏల డిఏ పై నేటికీ ఉత్వర్వులు విడుదలకు నోచుకోలేదని ఏపిజెఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. 2018 నుండి నిలుపుదల చేసిన డిఏను రూ. 300 నుండి రూ.500 పెంచి ఇచ్చేందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డి అంగీకరించారని విఆర్ఏ అసోషియేషన్ సీఎంని కలసి ధన్యవాదాలు చెప్పి నాలుగు నెలలయినా ఉత్వర్వులు విడుదల కాలేదన్నారు. మంగళవారం విజయవాడ లెనిన్ సెంటర్ వద్ద ఉన్న రెవిన్యూభవన్ లో ఆంధ్రప్రధేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (ఏపీ విఆర్ఏ అసోషియేషన్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర సంఘం బలోపేతానికి కొత్త జిల్లాలతో కలిపి 26 జిల్లాలకు గాను, 20 జిల్లాల నూతన కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరయ్యారు. త్వరలో మిగిలిన 6 జిల్లాలకు కూడా 2024 జనవరి - 20 తేదీ లోపు నూతన కమిటీలు పూర్తి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఏపిజెఏసి అమరావతి స్టేట్ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దాదావు 27వేల మంది విఆర్ఏ లను గ్రామ స్థాయిలో అన్ని ప్రభుత్వ విభాగాలు వారి గ్రామ స్థాయి అవసరాలకు ఉపయోగించుకుంటారని, వీరి న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు మాత్రం ప్రభుత్వం ముందుకు రాకపోవడం చాలా దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఇస్తున్న డిఏ ని 2018 నుండి 2020 వరకు చెల్లించిన డి ఏను ప్రతి నెలా వారి జీతాల నుంచి సుమారు 14 కోట్లు రికవరీ చేశారని, జీతం పెంచరనే నెపంతో దశాబ్దాలుగా ఇస్తున్నది నిలిపి వేయడమే కాకుండా ఇచ్చిన డిఏ ను తిరిగి ప్రభుత్వం తీసుకోవడం చాలా బాధాకరమని బొప్పరాజు ఆవేదన వ్యక్తంచేశారు. జరిగిన అన్యాయంపై ఏపి రెవిన్యూ సర్వీసెస్ అసోషియేషన్, ఏపిజేఏసి అమరావతి ఆధ్వర్యంలో జరిగిన 92 రోజుల ఉద్యమంలో విఆర్ఏ సోదరులకు జరిగిన అన్యాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి,చీఫ్ సెక్రటరీ, ప్రభుత్వ పెద్దలకు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో ప్రభుత్వం స్పందించి 300 లకు బదులు 500కు పెంచేలా ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని అందరూ గ్రామ రెవెన్యూ సహాయకులు సంతోషించారన్నారు. నెలలు గడుస్తున్నాయే తప్ప నేటికీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వలేదని, తక్షణమే ప్రభుత్వం రూ. 500కు పెంచిన డి ఏ ఉత్తర్వులు జారీ చేయాలని, కనీసం కొత్త సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి నగదు రూపంలో చెల్లించాలని, రికవరీ చేసిన డబ్బులు తిరిగి వి ఆర్ ఏ లకు చెల్లించాలని కోరారు. ఈసమావేశంలో విఆర్ఏ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్య మాట్లాడుతూ ఇస్తున్న డిఏ నిలుపుదల చేసి డిఏ చెల్లింపులు కొనసాగించాలని చేసిన విజ్ఞప్తులు, ఏపీ జేఏసీ అమరావతి పోరాటాలు మేరకు రికవరిని స్వయంగా ముఖ్యమంత్రి డిఏ రూ. 500 కు పెంచుతూ అంగీకరించడతో స్వయంగా అసోసియేషన్ తరవున వెళ్లి డిఏ పెంచి చెల్లింపులకు అంగీకరించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పి నాలుగు నెలలు గడుస్తున్నా సరే ఇంకా ఇందుకు సంబంధించిన ఆదేశాలు ఇవ్వకపోవడంతో రాష్ట్రంలో ఉన్న విఆర్ఏ లు అంతా ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఏపిజెఏసి అమరావతి స్టేట్ సెక్రటరీ జెనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరవావు, ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర చైర్మన్ పారె లక్ష్మి, ఏపీ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దొప్పలవూడి ఈశ్వర్, విఆర్ఏ అసోసి యేషన్ రాష్ట్ర కోశాధికారి సత్యన్నారాయణ,ఏపి క్లాస్ 4 అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు యస్.మల్లేశ్వరరావు,విఆర్ఓ ల అసోసియేషన్ స్టేట్ అసోసియేట్ చైర్మన్ ఏ.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి అనుపమ, ఏపిజేఏసి అమరావతి రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.కిశోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్



తిరుమల, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయం చేరుకున్న గవర్నర్ కు ఆలయ మర్యాదలతో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఇస్తికఫాల్ తో స్వాగతం పలకగా గవర్నర్ ముందుగా ఆలయ ధ్వజ స్థంభానికి మొక్కిన అనంతరం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపం నందు గవర్నర్ కు వేద పండితులు ఆశీర్వచనం పలకగా, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి గారు వారికి తీర్థ ప్రసాదాలను, స్వామి వారి చిత్ర పటాన్ని, టీటీడీ క్యాలెండర్, డైరీ 2024 పంచగవ్యాలను అందచేశారు. అంతకు మునుపు స్వామి వారి వద్ద గవర్నర్ కు శేష వస్త్రంతో ఆలయ ప్రధాన అర్చకులు సత్కరించారు.

### సీఎం జగన్ పుట్టిన రోజు వేడుకలను

# విజయవంతం చేయాలి

**వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పిలుపు**

శ్రీకాకుళం, సూర్య ప్రధాన ప్రతినిధి : ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్ పిలువునిచ్చారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కలసి స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, మహిళలు, కుల సంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. సీఎం జగన్ జన్మదిన వేడుకల సందర్భంగా అన్ని గ్రామాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, మహిళలకు ముగ్గులు, ఇతరత్రా పోటీలు నిర్వహించాలని అన్నారు.



### మరోసారి

# బదిలీల కురుపు

- తెలంగాణలో 20 మంది ఐపీఎస్‌లకు స్థానచలనం
- డీజీపీగా రవిగుప్తా కొనసాగింపు
- అంజనీ కుమార్, సీవీ ఆనంద్‌లకు పోస్టింగ్స్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి హైదరాబాద్: ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో భారీగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. తాజాగా మంగళవారం 20 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. తెలంగాణ డీజీపీగా రవిగుప్తాను కొనసాగిస్తూ,ఇటీవల ఈసీ వేటు వేసిన అంజనీ కుమార్, సీవీ ఆనంద్లకు కూడా పోస్టింగ్స్ ఇచ్చింది. ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో భారీగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. తాజాగా మంగళవారం 20 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది.

ఏసీబీ డీజీగా సీవీ ఆనంద్, జైళ్ల శాఖ డీజీగా సౌమ్యా మిశ్రా, రోడ్ సేఫ్టీ డీజీగా అంజనీ కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీగా శరత్ చంద్ర, అప్పా డైరెక్టర్గా అభిలాష్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ డైరెక్టర్గా కమలాసన్ రెడ్డి, టీఎస్పీఎస్సీ డీజీగా అనిల్ కుమార్, రైల్వే డీజీగా మహేష్ భగవత్, హోంగార్డ్ ఐజీగా స్టీఫెన్ రవీంద్ర, పోలీస్ హౌసింగ్ బోర్డ్ అడిషనల్ డైరెక్టర్గా ఎం. రమేష్, సీఐడీ చీఫ్గా శిఖా గోయల్, ఎస్ఐబీ చీఫ్గా సుమతి, సీఐడీ డీఐజీగా రమేష్ నాయుడు, కార్ హెడ్ క్వార్టర్స్ జాయింట్ సీపీగా సత్యనారాయణ. లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### ప్రభుత్వం పగులకొడుతోంది తాళాలు కాదు...

# అంగన్వాడీల గుండెలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం
- చర్చించి వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచన
- మహిళలతో పెట్టుకున్న ప్రభుత్వాలు గెలిచిన దాఖలా లేదు
- విశాఖ స్టీలు ప్లాంటు బ్లాస్ట్ ఫర్నేస్ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని ఎంపిలకు లేఖ
- పోలవరం నిర్వాసితుల సమస్యనూ పరిష్కరించేలా చూడాలి

విజయవాడ, సూర్య ప్రధాన ప్రతినిధి : ప్రభుత్వం పగులకొడుతోంది అంగన్వాడీ కేంద్రాల తాళాలు కాదని, కడుపు మండిన అంగన్వాడీ టీచర్లు, మినీవర్కర్లు, హెల్పర్ల గుండెలనని, వెంటనే సమస్యను పరిష్కరించకపోతే ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, మంతెన సీతారాంతో కలిసి ఆయన మాట్లాడారు. 18వ తేదీన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిందని, దీనికి పార్టీ పొలిట్బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, ఎం.ఏ.బేబీ హాజరయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడిరచారు. ముఖ్యంగా అంగన్వాడీల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటించిందని పేర్కొన్నారు. తల్లులు, ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాతంత్రవాదులు వారి పోరాటానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. సమ్మె చేపట్టి ఎనిమిది రోజులకు చేరిందని, సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణివల్లే రాష్ట్రంలో ఉన్న 55,605 అంగన్వాడీ కేంద్రాలు మూతపడ్డాయని, లక్ష మంది పైగా అంగన్వాడీ మహిళలు వీధుల్లోకి వచ్చారని తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరితో దాదావు 32 లక్షల మంది పేదగర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలుకు ఆటా పాటా, ఆహారం, ఆరోగ్యం దూరం చేస్తున్నారని విమర్శించారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని, అంగన్వాడీలకు కేంద్ర ప్రభుత్వం 2011 నుండి వేతనాలు పెంచలేదని, కనీసం రాష్ట్ర ప్రభుత్వమయినా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని కోరారు.

వేతనం పెంపుకు డబ్బు లేదంటున్న ప్రభుత్వం విశాఖ గెస్ట్హౌస్కు రూ.450 కోట్లు ఎలా ఖర్చు పెడుతుందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు తదితర న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలని ఎనిమిది రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వమే జటిలంచేసే చర్యలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ




విధానాల వల్ల ఈ కాలంలో గ్యాస్, నిత్యావసర సరుకులు, కరెంటు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ఛార్జీలు విపరీతంగా పెరిగినా అంగన్వాడీల వేతనాలు పెరగలేదని తెలిపారు. 2019 ఎన్నికల సందర్భంగా తెలంగానా కన్నా వెయ్యి ఎక్కువ ఇస్తానని జగన్ వాగ్దానం చేశారని, మేనిఫెస్టోలో కూడా పెట్టారని, దాన్నే అమలు చేయమని అంగన్వాడీ యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయన్నారు. నాలుగు సంవత్సరాలుగా పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు మంత్రులకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చి దశలవారీగా అనేక ఆందోళనలు చేసినా ప్రభుత్వంలో ఏమాత్రమూ చలనం లేదని పేర్కొన్నారు. అనివార్యంగా డిసెంబర్ 12 నుండి రాష్ట్రంలో ఉన్న లక్ష మంది పైగా అంగన్వాడీలు తమ సెంటర్లను మూసేసి సమ్మె బాట పట్టారు.

ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే అంగన్వాడీ యూనియన్ల నాయకులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంగన్వాడీలు దళిత, గిరిజన, బడుగు బలహీనవర్గాల పిల్లలకు సేవలు అందిస్తున్నారు. గర్భిణీ, బాలింతలకు ఆహారంతో పాటు ఆరోగ్య సలహా సేవలూ అందిస్తున్నారని వివరించారు. వారు సమ్మెలోకి వెళ్లడంతో గ్రామాల్లో పేదలు పనులకు వెళ్లడానికి కూడా పిల్లలను చూసుకునే వాళ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఒకవైపు చర్చలకు ఆహ్వానిస్తూ రెండోవైపు ప్రభుత్వ అధికారులే అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొడుతున్నారని విమర్శించారు.

**Repco Home Finance**

**REPCO హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**

**వరంగల్ బ్రాంచ్ :** డోర్ నెం. 1-7-871/1, 1వ అంతస్తు, వినాయక ప్లాజా, వరంగల్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా, హంటర్ రోడ్, హన్మకొండ, వరంగల్ - 506 001.

**స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్థి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 కింద మరియు సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాల వినియోగంలో **రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క **అధీకృత అధికారి** కింద సంతకం చేయబడినవారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (అమలు)లోని 9వ నిబంధనతో చదువబడిన రూల్స్, 2002 క్రింద పేర్కొన్న తేదీలలో **డిమాండ్ నోటీసును** జారీ చేసింది, వారు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు తిరిగి చెల్లించవలసి ఉంటుంది.

రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు మరియు హామీదారు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైతే, దిగువ సంతకం చేసినవారు ఇక్కడ వివరించిన అధికారాలను ఉపయోగించడం ద్వారా ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు, హామీదారు మరియు సాధారణంగా ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. **డిసెంబరు 14, 2023** నాడు పేర్కొన్న నిబంధనలలోని 9వ నిబంధనతో చదువబడిన చట్టంలోని సెక్షన్ 13(4) కింద అతనికి ప్రదానం చేయబడింది.

రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు, గ్యారెంటర్ మరియు సాధారణంగా ప్రజలు ఆస్తులతో వ్యవహరించవద్దని హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తికి సంబంధించిన ఏదైనా లావాదేవీలు **రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, వరంగల్ శాఖలు ప్రతి ఖాతాకు వ్యతిరేకంగా క్రింద పేర్కొన్న మొత్తం మరియు వడ్డీకి లోబడి ఉంటాయి.**

సెక్యూరిటైజేషన్ చట్టంలోని సెక్షన్ 13 (8)కి మేము మీ దృష్టిని ఆకర్షిస్తున్నాము, దాని ప్రకారం, సురక్షితమైన రుణదాత యొక్క బకాయిలు అన్ని ఖర్చులతో కలిపి ఉంటే, సురక్షిత ఆస్తిని బదిలీ చేయడానికి లేదా విక్రయించడానికి తదుపరి చర్యలు తీసుకోబడవు. సురక్షిత రుణదాత ద్వారా విధించబడే ఛార్జీలు మరియు ఖర్చులు మీరు సురక్షిత ఆస్తిని విక్రయించడానికి లేదా బదిలీ చేయడానికి నిర్ణయించిన తేదీకి ముందు ఎప్పుడైనా టెండర్ చేయబడతాయి.

**క్రమ సంఖ్య 1:- రుణగ్రహీత: శ్రీ గాండ్ల హరినాథ్,** S/o. శ్రీ గాండ్ల మల్లయ్య శ్రీ తిరుమల బేకరీ 1-7-834/2 హంటర్ రోడ్ 506001. అలాగే మస్జిద్ చాగల్ విలేజ్ సమీపంలో ఇం.నం.4-18/2 వద్ద, జనగాం, తెలంగాణ 506301. **సహ రుణగ్రహీత: శ్రీమతి గాండ్ల వినోద,** W/o శ్రీ గాండ్ల మల్లయ్య శ్రీ తిరుమల బేకరీ 1-7-834/2 హంటర్ రోడ్ 506001. **అలాగే ఇక్కడ:** మస్జిద్ చాగల్ విలేజ్ దగ్గర ఇం.నం.4-18/2, జనగాం, తెలంగాణ - 506301. శ్రీ గాండ్ల మల్లయ్య S/o. శ్రీ కొమురయ్య, ఇం.నం. 4-18/2 దగ్గర మస్జిద్ చాగల్ విలేజ్, జనగాన్, తెలంగాణ 506301. **హామీదారు: శ్రీ మీర్జా కాషిఫ్ హసన్,** S/o మీర్జా ఇలియాస్ హసన్ ఇం.నం.14-2-115, మండి బజార్, వరంగల్ - 506002. **అలాగే ఇక్కడ:** జూనియర్ అసిస్టెంట్, జిల్లా రిజిస్ట్రార్ ఆఫ్ అస్యూరెన్స్ వరంగల్, తెలంగాణ 506 002.

**డిమాండ్ నోటీసు తేదీ: 08-08-2023,** డిమాండ్ నోటీసు **(ఖాతా నం.2181860000525)** ప్రకారం క్లెయిమ్ చేయబడిన మొత్తం వరుసగా **రూ.20,95,019/- 08-08-2023** నుండి తదుపరి వడ్డీతో పాటు దానిపై ఇతర ఖర్చులు **బకాయి మొత్తం: రూ.21,81,990/- 13-12-2023** నుండి తదుపరి వడ్డీతో పాటు దానిపై ఇతర ఖర్చులు.

**ఆస్తి వివరణ:** RCC గ్రౌండ్ ఫ్లోర్ రెసిడెన్షియల్ బిల్డింగ్, G.P.H.No.4-18/2 బేరింగ్ ఓపెన్ ప్లేస్, 305.60 చ.గజాలు లేదా 255.51 చ.మీటర్ల విస్తీర్ణంలో చాగల్ రెవెన్యూలోని సై.నెం.443లో ఉంది. ఘన్‌పూర్ మండలం, వరంగల్ జిల్లా మరియు సరిహద్దు: తూర్పు: పెద్ది శ్రీశైలం ప్లాట్, పశ్చిమం: CC రోడ్డు, ఉత్తరం: రంగు రాజయ్య ఇల్లు, దక్షిణం: చేపూరి యాదమ్మ ఇల్లు.

**క్రమ సంఖ్య 2:- రుణగ్రహీత: శ్రీ సదానందం కొమ్ముల,** S/o గట్టయ్య కొమ్ముల ఇం.నెం. 1-98, పల్వేల్పుల, హన్మకొండ, వరంగల్ - 506 015. అలాగే, AR కానిస్టేబుల్, తెలంగాణ పోలీస్ డిపార్ట్‌మెంట్ హెడ్ క్వార్టర్స్, వరంగల్ - 506 001. **సహ-రుణగ్రహీత: శ్రీమతి మారుతీ రాణి కొమ్ముల,** W/o సదానందం కొమ్ముల ఇం.నెం. 1-98, పల్వేల్పుల, హన్మకొండ, వరంగల్ - 506 015.

**డిమాండ్ నోటీసు తేదీ: 07-08-2023.** డిమాండ్ నోటీసు ప్రకారం క్లెయిమ్ చేయబడిన మొత్తం **(ఖాతా నం: 2181870000410) 07-08-2023** నుండి తదుపరి వడ్డీతో వరుసగా **రూ.30,78,682/-** మరియు దానిపై ఇతర ఖర్చులు **బకాయి మొత్తం: రూ.31,99,358/- 13-12-2023** నుండి తదుపరి వడ్డీ మరియు దానిపై ఇతర ఖర్చులు.

**ఆస్తి వివరణ:** వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలోని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ యొక్క విస్తరించిన పరిమితుల్లో, హసన్‌పర్తి మండలం భీమారం గ్రామంలో ఉన్న సర్వే నెం.589లో, సెమీ ఫినిష్డ్ హౌస్ మరియు ఓపెన్ ప్లేస్‌లోని ఆ ముక్క మరియు పార్శిల్ అంతా రిజిస్ట్రేషన్ జిల్లా వరంగల్ అర్బన్, మరియు జాయింట్ సబ్-రిజిస్ట్రార్ వరంగల్ అధికార పరిధి (R.O.). 134-44 చ.కి విస్తీర్ణంలో ఉన్న ఓపెన్ ల్యాండ్ మొత్తం వైశాల్యం. గజాలు, 112-40 చ. మీటర్లకి సమానం. ., ప్లాట్ నెం.25 (భాగం). ఇంటి నం. 55-3-351/4/A. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం. 25 (భాగం) విక్రేత. పశ్చిమం: 30'-00" వెడల్పాటి రోడ్డు. ఉత్తరం: పైని విజయకు విక్రయించిన విక్రేత యొక్క ప్లాట్ నెం.25(భాగం)లో ప్రతిపాదిత ఇంటి నిర్మాణం. దక్షిణం: వెండర్ (భాగం) ప్లాట్ నెం. 25

**క్రమ సంఖ్య 3:- రుణగ్రహీత: శ్రీ నరెళ్ల అరుణ్,** S/o శ్రీ నరెళ్ల శేషగిరి రావు, ఇం.నెం.15-02-152, బద్రకాళి టెంపుల్ రోడ్, హన్మకొండ, వరంగల్ - 506001. **ఇంకా ఇక్కడ: స్వాతి జిరాక్స్ అండ్ స్టేషనరీ,** WITS కాలేజ్, గుడేపాడ్, ఆత్మకూర్, వరంగల్. **సహ రుణగ్రహీత : శ్రీమతి నరెళ్ల శ్రీనివాసరావు,** S/o. శ్రీ శేషగిరి రావు ఇం.నం.6-4-427, కృష్ణ నగర్ కాలనీ, భోలక్‌పూర్, సికింద్రాబాద్ - 500020. **హామీదారు- I : శ్రీ జన్ను బాస్కర్,** S/o. శ్రీ శామ్యూల్ జన్ను, ఇం.నం.11-25-14, వాసవి కాలనీ, రైతు బజార్ దగ్గర, వరంగల్ - 506002. **ఇంకా ఇక్కడ:** MNO (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ గ్రేడ్-1) MGM హాస్పిటల్ వరంగల్. **హామీదారు-II : శ్రీ బైరపాక ప్రవీణ్,** S/o శ్రీ మల్లయ్య బైరపాక, ఇం.నం.16-10-11768, శివనగర్, MNO MGM, వరంగల్ ఫోర్ట్ రోడ్, వరంగల్ - 506007. MNO వద్ద కూడా (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ గ్రేడ్ -1) MGM హాస్పిటల్ వరంగల్ - 506001.

**డిమాండ్ నోటీసు తేదీ: 08-08-2023** డిమాండ్ నోటీసు **(ఖాతా నంబర్లు: 2181870000205)** ప్రకారం క్లెయిమ్ చేయబడిన మొత్తం వరుసగా **రూ.21,41,829/- 08-08-2023** నుండి తదుపరి వడ్డీతో పాటు దానిపై ఇతర ఖర్చులు **బకాయి మొత్తం: రూ.22,40,055/- 13-12-2023** నుండి తదుపరి వడ్డీ మరియు దానిపై ఇతర ఖర్చులు.

**ఆస్తి వివరణ: మునిసిపల్** H.No.11-24-136(01d), GWMC ఇం.నం:11-24-491(కొత్తది) 290.00 చ.గజాలు లేదా 242.82 చ.మీ. వార్డ్ కలిగి ఉన్న ఇల్లు మరియు బహిరంగ ప్రదేశం No.11, బ్లాక్ నెం.24 పోచమ్మాయిదాన్, వరంగల్ నగరం మరియు జిల్లా, సరిహద్దులలో ఉంది: తూర్పు: J. జీవ రత్నం భూమి, పశ్చిమం: 30 అడుగుల వెడల్పు రోడ్డు, ఉత్తరం: హౌస్ ఆఫ్ B సోల్మన్ రాయ్ (పాత) బి విజయ్‌పాల్‌కు చెందిన నెం.11-24-136 మరియు బి సుధీర్‌కు చెందిన ఇం.నెం.11-24-136/1 (కొత్త), దక్షిణం : హౌస్ ఆఫ్ జయమ్మ (పాత), ఇండియన్ పెంటెకోస్టల్ చర్చి (కొత్త).

**తేది : 14-12-2023**

అధీకృత అధికారి,
రెప్కో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్.,



# అదిరే ధరలకు ఆటగాళ్లు

## ఆరంభం నాటి నుంచి వేలాల్లో అత్యధిక ధర పలికిన వాళ్లు వీరే

**ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 మినీ వేలం దుబాయ్ వేదికగా ప్రారంభమైంది. 10 ఫ్రాంచైజీల్లో కలిపి మొత్తం 77 స్లాట్స్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో 30 స్లాట్స్ విదేశీ ఆటగాళ్లకు సంబంధించినవే. మొత్తం 333 మంది ప్లేయర్లు మినీ వేలంలో తమ అదృష్టాన్ని పరిక్షించుకోనున్నారు. భారత దేశంలో కాకుండా మొట్టమొదటి సారి వేలాన్ని దేశం బయట నిర్వహిస్తున్నారు. ఎవరు అత్యధిక ధర పలుకుతారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో ఇప్పటి వరకు జరిగిన వేలాల్లో అత్యధిక ధర పలికిన ఆటగాళ్లు ఎవరో ఓ సారి పరిశీలిద్దాం..**

### 2008లో ఎంఎస్ ధోని



ఐపీఎల్ 2008లో ఆరంభమైంది. ఆరంభ సీజన్‌లో వేలాన్ని నిర్వహించగా అత్యంత ఖరీదైన ఆటగాడిగా భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ నిలిచాడు. కెప్టెన్ కూల్ కోసం ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్ కింగ్స్ పోటీ పడ్డాయి. చివరకు రూ.9.50 కోట్లను వెచ్చింది చెన్నై జట్టు ధోనిని సొంతం చేసుకుంది. అప్పటి నుంచి చెన్నై జట్టుకు ధోనినే నాయకత్వం వహిస్తున్నాడు. అతడి సారథ్యంలో చెన్నై 5 సార్లు ఐపీఎల్ విజేతగా నిలిచింది. 2010, 2014లో జరిగిన రెండు ఛాంపియన్స్ లీగ్ 20 టైటిళ్లను కూడా సొంతం చేసుకుంది.

### 2009లో ఆండ్రూ ఫ్లింటాఫ్, కెవిన్ పీటర్సన్..



2009లో జరిగిన వేలంలో ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు కెవిన్ పీటర్సన్ ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రూ.9.80 కోట్లకు కొనుగోలు చేసింది. అటు చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ ఆండ్రూ ఫ్లింటాఫ్‌ను రూ.9.80 కోట్లు వెచ్చింది దక్కించుకుంది.



### 2010లో షేన్ బాండ్, కీరన్ పొలార్డ్..



2010 వేలంలో న్యూజిలాండ్ మాజీ పేసర్ షేన్ బాండ్ ను రూ.4.80 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ కొనుగోలు చేసింది. ఈ సీజన్‌లో అతడు ఎనిమిది మ్యాచ్‌లలో తొమ్మిది వికెట్లు తీసుకున్నాడు. అదే సమయంలో ముంబై ఇండియన్స్ వెస్టిండీస్‌కు చెందిన కీరన్ పొలార్డ్‌ను రూ.4.80కోట్లకు ముంబై ఇండియన్స్ సొంతం చేసుకుంది.



### 2011లో గౌతమ్ గంభీర్..



2011 వేలంలో భారత మాజీ ఆటగాడు గౌతమ్ గంభీర్ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. అతడిని కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.14.90 కోట్లకు కొనుగోలు చేసింది. అతడి నాయకత్వంలో కోల్‌కతా 2012, 2014 టైటిల్స్‌ను సొంతం చేసుకుంది

### 2012లో రవీంద్ర జడేజా..



2012 వేలంలో భారత ఆల్ రౌండర్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ రూ.12.80 కోట్లు వెచ్చించింది. 2011లో కొచ్చి టస్కర్స్ జట్టును రద్దు చేసిన తరువాత జడేజా వేలంలోకి అందుబాటులోకి వచ్చాడు. చెన్నై జట్టు మూడు ఐపీఎల్ టైటిళ్లను గెలుచుకోవడంతో జడేజా తన వంతు పాత్ర పోషించాడు.

### 2013లో గ్లెన్ మాక్స్‌వెల్..



2013 వేలంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్‌ను ముంబై ఇండియన్స్ రూ. 6.30 కోట్లకు తీసుకుంది. అయితే.. అతను కేవలం మూడు మ్యాచులు మాత్రమే ఆడాడు. 18 సగటుతో 36 పరుగులు మాత్రమే సాధించాడు. తర్వాత అతను కింగ్స్ XI పంజాబ్‌కు మారాడు. ఇప్పుడు IPLలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడుతున్నాడు.

### 2014లో యువరాజ్ సింగ్..



భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ 2014 వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు యువరాజ్ ను రూ.14 కోట్లకు సొంతం చేసుకుంది. ఆసీజన్‌లో యువీ 14 మ్యాచ్‌ల్లో 376 పరుగులు చేశాడు. ఈ క్రమంలో ఆర్‌సీబీ తరుపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు.

### 2015లోనూ యువరాజ్ సింగ్..


2015లో జరిగిన ఐపీఎల్ వేలంలో యువరాజ్ ఆర్‌సీబీ నుంచి ఢిల్లీకి మారాడు. రూ.16 కోట్లు ఢిల్లీ అతడికి చెల్లించింది. ఆ సీజన్ యువీ 14 ఇన్నింగ్స్‌లలో 19.07 సగటుతో 248 పరుగులు చేశాడు.

### 2016లో షేన్ వాట్సన్..



ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ 2016లో జరిగిన ఐపీఎల్ వేలంలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా నిలిచాడు. వేలంలో ఆర్‌సీబీ అతడిని 9.50 కోట్లకు దక్కించుకుంది. వాట్సన్ ఆ సీజన్‌లో ఆర్‌సీబీ తరపున అత్యధిక వికెట్లు తీసిన రెండవ బౌలర్‌గా నిలిచాడు. 16 మ్యాచ్‌లలో 20 వికెట్లు పడగొట్టగా.. 179 పరుగులు చేశాడు.

### 2017లో బెన్ స్టోక్స్..



ఐపీఎల్ 2017 వేలంలో ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అత్యధిక ధర పలికిన ఆటగాడిగా నిలిచాడు. రైజింగ్ పూణే సూపర్‌జెయింట్ అతడిని రూ.14.50 కోట్లకు ససొంతం చేససుకుంది.

### 2018లో బెన్ స్టోక్స్..

రెండేళ్ల నిషేధం తర్వాత తిరిగి వచ్చిన తర్వాత రాజస్థాన్ రాయల్స్ స్టోక్స్‌పై పెద్ద మొత్తం వెచ్చింది. 2018 వేలంలో అతడిని రూ.14.50 కోట్లకు సొంతం చేససుకుంది.

### 2019లో జయదేవ్ ఉనద్కత్, వరుణ్ చక్రవర్తి..



ఐపీఎల్ 2019 వేలంలో రాజస్థాన్ రాయల్స్ రూ.8.40 కోట్లకు జయదేవ్ ఉనద్కత్‌ను దక్కించు కుంది. అదే సమయంలో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ రూ.8.40 కోట్లకు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని దక్కించుకుంది.



### 2020లో పాట్ కమిన్స్..



ఐపీఎల్ 2020 వేలంలో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ పాట్ కమిన్స్ ను కోల్‌కతా నైట్ రైడర్స్ రూ. 15.50కోట్లకు సొంతం చేసుకుంది. ఆ సీజన్ లో అతడు 14 మ్యాచ్‌ల్లో 12 వికెట్లు తీయడంతో పాటు బ్యాటింగ్‌లో 146 పరుగులు చేశాడు.

### 2021లో క్రిస్ మోరిస్..



దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ 2021 వేలంలో రాజస్థాన్ రాయల్స్‌కు రూ. 16.50 కోట్ల భారీ మొత్తానికి దక్కించుకుంది. ఆ సీజన్ లో మోరిస్ 11 మ్యాచ్‌లలో 136.73 స్ట్రైక్ రేట్‌తో 67 పరుగులు చేశాడు. బౌలింగ్‌లో 15 వికెట్లు పడగొట్టాడు.

### 2022లో ఇషాన్ కిషన్..



ఐపీఎల్ 2022 వేలంలో వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ఇషాన్ కిషన్ అత్యధిక ధరకు అమ్ముడైన ఆటగాడిగా నిలిచాడు. అతడిని ముంబై ఇండియన్స్ రూ.15.25 కోట్లుకు కొనుగోలు చేసింది. ఆసీజన్ ఇషాన్ 14 మ్యాచ్‌లు ఆడాడు. 418 పరుగులు చేశాడు స్టంప్స్ వెనుక 13 క్యాచ్‌లు అందుకున్నాడు.

### 2023లో సామ్ కరన్..



పంజాబ్ కింగ్స్ 2023 వేలంలో ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ సామ్‌కరన్ కోసం పెద్ద మెంత్తంలో వెచ్చించింది. టోర్నీ చరిత్రలోనే అత్యధికంగా రూ.18.50 కోట్లకు అతడిని కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో క్రరాన్ 10 వికెట్లు పడగొట్టడంతో పాటు 376 పరుగులు చేశాడు.


# లక్కీ బ్రూక్!


దుబాయి : ఐపీఎల్ 2024 వేలం ప్రారంభమైంది. వెస్టిండీస్ ఆటగాడు రోవ్‌మన్ పావెల్ రూ. 7.4 కోట్లకు అమ్ముడు పోయాడు. ఐపీఎల్ 2024 వేలంలో అమ్ముడైన తొలి ఆటగాడిగా పావెల్ రికార్డ్ క్రియేట్ చేశాడు. ఆ తరువాత వేలానికి వచ్చిన రిలీ రోసోను కొనుగోలు చేయడానికి ఫ్రాంచైజీలు ఏవీ ఆసక్తి చూపలేదు. ఆ తరువాత వచ్చిన ఇంగ్లాండ్ యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 4 కోట్లకు దక్కించుకుంది. రూ. 2 కోట్ల ప్రాథమిక ధరతో వేలంలోకి వచ్చిన బ్రూక్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ పోటీ పడ్డాయి. ఒక దశలో తక్కువ ధరకే బ్రూక్ అమ్ముడు పోయేలా కనిపించాడు. కానీ ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున వేలంలో పాల్గొంటున్న తెలుగాయన గ్రంథి కిరణ్ కుమార్ దయ చూపబట్టి బ్రూక్ ఆ మాత్రం ధరైనా పలికాడు.

ఐపీఎల్ 2023 వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అతనిని రూ. 13.25 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. అంతకు ముందు పాకిస్తాన్ గడ్డ మీద బ్రూక్ దుమ్ము దులిపే ఆట తీరు కనబరచడంతో ఇంగ్లాండ్ విరాట్ కోహ్లీగా పేరొందిన బ్రూక్‌ను కొనుగోలు చేయడం కోసం సన్‌రైజర్స్ భారీ మొత్తాన్ని వెచ్చించింది. 11 మ్యాచ్‌లలో 190 పరుగులు మాత్రమే చేసిన బ్రూక్‌ను సన్‌రైజర్స్ రిటైన్ చేసుకోలేదు. దీంతో రూ. 2 కోట్ల బేస్ ప్రైజ్‌తో హ్యారీ బ్రూక్ వేలానికి వచ్చాడు. గత సీజన్‌లో రూ. 13.25 కోట్ల భారీ ధర పలికిన బ్రూక్ ఈ సీజన్‌లో రూ. 4 కోట్లకే ఢిల్లీ క్యాపిటల్స్‌కు అమ్ముడు పోయాడు. బ్రూక్ కోసం సన్‌రైజర్స్ ఏమాత్రం ఆసక్తి చూపలేదు. రాజస్థాన్ పోటీ పడినప్పటికీ తక్కువ ధరకే బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. గత సీజన్‌లో విఫలమైనప్పటికీ బ్రూక్‌ను తక్కువ అంచనా వేయడానికి వీలు లేదు.




# ఈ మినీ వేలంలో ఇప్పటివరకు అత్యధిక ధర పలికిన ఆటగాళ్లు వీరే


మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా) – రూ. 24.75 కోట్లు (కోల్‌కతా నైట్‌రైడర్స్)


పాట్ కమిన్స్ (ఆస్ట్రేలియా) – రూ. 20.50 కోట్లు (సన్‌రైజర్స్ హైదరాబాద్)


డారిల్ మిచెల్ (న్యూజిలాండ్) – రూ. 14 కోట్లు (చెన్నై సూపర్ కింగ్స్)


హర్షల్ పటేల్ (ఇండియా) – రూ. 11.75 కోట్లు (పంజాబ్ కింగ్స్)


రోవ్‌మన్ పావెల్ (వెస్టిండీస్) – రూ. 7.40 కోట్లు (రాజస్థాన్ రాయల్స్)


ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) – రూ. 6.80 కోట్లు (సన్‌రైజర్స్ హైదరాబాద్)



గెరాల్డ్ కోయిట్జీ (సౌతాఫ్రికా) – రూ. 5 కోట్లు (ముంబయి ఇండియన్స్)


దిల్షాన్ మధుశంక (శ్రీలంక) – రూ. 4.6 కోట్లు (ముంబయి ఇండియన్స్)


క్రిస్ వోక్స్ (ఇంగ్లండ్) – రూ. 4.20 కోట్లు (పంజాబ్ కింగ్స్)



శార్దుల్ ఠాకూర్ (ఇండియా) – రూ. 4 కోట్లు (చెన్నై సూపర్ కింగ్స్)


రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్) – రూ. 1.80 కోట్లు (చెన్నై సూపర్ కింగ్స్)


వనిందు హసరంగ (శ్రీలంక) రూ. 1.50 కోట్లు (సన్‌రైజర్స్ హైదరాబాద్)

# రూ. 20.50 కోట్లకు ప్యాట్ కమిన్స్‌ను కొన్న కావ్యా మారన్

- ప్యాట్ కమిన్స్ కోసం సన్ రైజర్స్, ఆర్సీబీ హోరాహోరీ
- పంతం నెగ్గించుకున్న కావ్యా మారన్
- భారీ ధరతో సన్ రైజర్స్ వశమైన కమిన్స్





దుబాయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. రూ. 20.50 కోట్ల కళ్లు చెదిరే ధరకు ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను కొనుగోలు చేసింది. రూ. 8 కోట్ల ధర సమయంలో కమిన్స్ కోసం బిడ్ వేసిన కావ్య మారన్ అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. బిడ్ దాఖలు చేసింది మొదలు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో పోటీ పడుతూ వేలంలో పాల్గొన్న కావ్య అతని కోసం ఏకంగా రూ. 20 కోట్లకు బిడ్ దాఖలు చేసింది. అప్పటి వరకు కమిన్స్ కోసం తీవ్రంగా పోటీ పడిన ఆర్సీబీ ఫ్రాంచైజీ చివరకు ఆలోచనలో పడిపోయింది. అయినా సరే రూ. 20.25 కోట్లకు బిడ్ వేసింది. కావ్య ఏమాత్రం ఆలోచించకుండా రూ. 20.50 కోట్లకు కమిన్స్ దక్కించుకుంది. దీనితో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా ప్యాట్ కమిన్స్ చరిత్ర సృష్టించాడు. అయితే, ఆతరువాత కొన్ని గంటలలోనే కమిన్స్ రికార్డును అతని దేశీయ సహచరుడు మిచెల్ స్టార్క్ పూర్వ పక్షం చేశాడు. కాగా, 16 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ఆటగాడూ రూ. 20 కోట్ల ధర పలకలేదు. కానీ కావ్య పాప పుణ్యమా అని ఐపీఎల్ వేలంలోనే ఎవరూ ఊహించని ధర పలికాడు. గత సీజన్‌లో సామ్ కర్రన్ క్రియేట్ చేసిన రికార్డ్‌ను కమిన్స్ బ్రేక్ చేశాడు. కమిన్స్ సారథ్యంలోనే ఆస్ట్రేలియా వరల్డ్ కప్ గెలిచిన సంగతి విదితమే. అఫ్ఘానిస్తాన్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓటమి అంచున నిలవగా మ్యాక్స్‌వెల్ విధ్వంసంతో డబుల్ సెంచరీ చేసి జట్టును గెలిపించిన విషయం విదితమే. ఒక ఎండ్‌లో మ్యాక్సీ చెలరేగుతుంటే మరొక ఎండ్‌లో కమిన్స్ ఓపికగా ఆడుతూ వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డాడు. కమిన్స్ ఇంతకు ముందు కోల్‌కతా తరఫున ఐపీఎల్‌లో ఆడాడు. 2020 వేలంలో అతనిని నైట్ రైడర్స్ రూ. 15.50 కోట్లకు కొనుగోలు చేసింది. ఆస్ట్రేలియా జట్టు ప్రయోజనాల కోసం 2023 సీజన్‌లో ఐపీఎల్ ఆడరాదని నిర్ణయించుకున్న కమిన్స్ వరల్డ్ కప్ గెలిచిన కెప్టెన్‌గా ఇప్పుడు ఏకంగా రూ. 20.50 కోట్ల ధర పలకడం విశేషం. అంతకు ముందు ఆస్ట్రేలియా ప్లేయర్ ట్రావిస్ హెడ్‌ను రూ. 6.8 కోట్లకు కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ రూ. 1.5 కోట్లకు శ్రీలంక స్పిన్ ఆల్‌రౌండర్ వనిందు హసరంగను కొనుగోలు చేసింది. ఆ ఇద్దరి దగ్గర సేవ్ చేసిన మొత్తాన్ని కమిన్స్ కోసం కుమ్మరించింది.

## రచిన్ రవీంద్ర ఐపీఎల్ వేలం
# రికార్డులు బద్దలు కొట్టలేదు



దుబాయి : ఇటీవల వరల్డ్ కప్ టోర్నమెంట్ ద్వారా వెలుగులోకి వచ్చిన న్యూజిలాండ్ యువ సంచలనం రచిన్ రవీంద్ర ఐపీఎల్ వేలంలో రికార్డులు బద్దలు కొట్టడం ఖాయం అని అందరూ భావించారు. భారత గడ్డపై జరిగిన ఐసీసీ మెగా ఈవెంట్‌లో రచిన్ రవీంద్ర మూడు సెంచరీలు బాది పరుగులు వెల్లువెత్తించాడు. దాంతో, ఐపీఎల్ వేలంలో అతని కోసం ఫ్రాంచైజీలు హోరాహోరీగా పోరాడతాయని, తద్వారా కళ్లు చెదిరే ధర వస్తుందని అంచనా వేశారు. కానీ అవేవీ జరగలేదు. మంగళవారం ఐపీఎల్ మినీ వేలంలో రచిన్ రవీంద్ర కనీస ధర రూ. 50 లక్షలు కాగా, అతని కోసం చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మాత్రమే ఆసక్తి చూపించాయి. చివరికి చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ బాగా చవకగా రూ. 1.80 కోట్లకు కొనుగోలు చేసింది. ఇక, టీమిండియా ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ ఈ వేలంలో రూ. 4 కోట్లతో చెన్నై సూపర్ కింగ్స్ ఖాతాలో పడ్డాడు. శార్దూల్ ఠాకూర్ కనీస ధర రూ. 2 కోట్లు కాగా, అతనిని చెన్నై ఫ్రాంచైజీ దక్కించుకుంది. శార్దూల్ గతంలోనూ చెన్నై జట్టుకు ఆడాడు.

# క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్

- ముందుగానే ఐపీఎల్ 2024
- మార్చి 22న మొదలు
- మే 29న ఫైనల్



ముంబయి : 2024లో జరగనున్న 17వ ఐపీఎల్ సీజన్ కోసం మినీ వేలం మంగళవారం దుబాయిలో జరిగింది. ఇంతలో, ఐపీఎల్ తదుపరి ఎడిషన్ ప్రారంభం గురించి పెద్ద అప్‌డేట్ వచ్చింది. నివేదిక ప్రకారం, ఐపీఎల్ 17వ ఎడిషన్ మార్చి 22 నుంచి మే చివరి వరకు అంటే మే 29 వరకు జరుగుతుంది. జూన్‌లో జరగనున్న టి20 వరల్డ్ కప్ టోర్నమెంట్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈ ఐపీఎల్‌ను ముందుగానే ముగించాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది భారత్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఇది ఐపీఎల్ షెడ్యూల్‌పై కూడా ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు. దీనితో ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ ఇంకా విడుదల కాలేదు. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం, అన్నీ సవ్యంగా జరిగితే ఐపీఎల్ 2024 టోర్నమెంట్‌ను మార్చి 22 నుంచి మే చివరి వరకు నిర్వహించనున్నారు. ఐపీఎల్ 2024కు విండోను ఫిక్స్ చేసింది. బిడ్డింగ్ ప్రక్రియ ముగిసిన తరువాత, షెడ్యూల్ సంబంధిత సన్నాహాలు ప్రారంభమవుతాయి.

# అన్‌క్యాప్డ్ ప్లేయర్‌కు రూ. 8.40 కోట్లు

- ఆ సిక్సర్లు చూసి పోటీపడ్డ ఫ్రాంచైజీలు
- ఎవరీ సమీర్ రిజ్వీ?
- చేజిక్కించుకున్న చెన్నై సూపర్ కింగ్స్

దుబాయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అంటేనే కాసులు కురిపించే లీగ్. రాత్రికి రాత స్టార్లుగా మారిపోతుంటారు. ఇక అనామక ప్లేయర్‌ను రాత్రికి రాత కోటీశ్వరుని కూడా చేస్తుంది లీగ్. ఇప్పుడు ఐపీఎల్ మినీ వేలం జరుగుతుండగా పెద్ద పెద్ద పేరు మోసిన ప్లేయర్లు భారీ ధర దక్కించుకున్నారు. మిచెల్ స్టార్క్ కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ. 24.75 కోట్లు పెట్టగా, మరొక ఆసీస్ పేసర్ ప్యాట్ కమిన్స్‌ను రూ. 20.50 కోట్లకు దక్కించుకుంది సన్‌రైజర్స్. కివీస్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ కూడా రూ. 14 కోట్లకు చెన్నై సొంతమయ్యాడు. అయితే, ఆ స్టార్ల మధ్య మరొక అన్‌క్యాప్డ్ ప్లేయర్ అత్యధిక ధర దక్కించుకున్నాడు. అతనే సమీర్ రిజ్వీ. సమీర్ రిజ్వీని ధోనీ నాయకుడిగా ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ ఏకంగా రూ. 8.40 కోట్లకు కొనుగోలు చేసింది. అతని బేస్ ప్రైస్ రూ. 20 లక్షలు మాత్రమే. చెన్నైతో పాటు గుజరాత్ కూడా అతని కోసం పోటాపోటీగా బిడ్డింగ్ నిర్వహించినా ఆఖర్లో చేతులు ఎత్తేసింది. అప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ ఎంట్రీ ఇచ్చినా చివరికి చెన్నై సొంతం చేసుకుంది.

**ఎవరీ రిజ్వీ? :** ఉత్తర్‌ప్రదేశ్ టీ-20లో లీగ్‌తో వెలుగులోకి వచ్చాడు రిజ్వీ. అక్కడ కాన్పూర్ సూపర్‌స్టార్స్ టీమ్‌కు ఆడాడు. ఆ టోర్నీలోనే ఫాస్టెస్ట్ సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. గోరఖ్‌పూర్ లయన్స్ జట్టుపై 49 బంతుల్లోనే 104 పరుగులు చేశాడు. ఆ టోర్నీలో మొత్తంగా రెండు సెంచరీలతో 9 ఇన్నింగ్స్‌ల్లోనే 455 రన్స్ చేశాడు. కాన్పూర్ తరఫున ఎక్కువ సిక్సర్లు బాదింది కూడా అతనే. మెన్స్ అండర్-23 స్టేట్- ఏ టోర్నమెంట్‌లో రాజస్థాన్‌తో వన్డే మ్యాచ్‌లో 65 బంతుల్లోనే 91 రన్స్ చేసి ఆకట్టుకున్నాడు. ఆ లీగ్‌లో యూపీకి కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ టోర్నీ ఫైనల్‌లో 50 బంతుల్లోనే 84 రన్స్ చేసి జట్టును గెలిపించాడు. ఆ లీగ్‌లో మొత్తం 37 సిక్స్‌లు కొట్టాడు. దీంతో వేలంలో ఫ్రాంచైజీల కన్ను అతనిపై పడిందని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో తన బిగ్ హిట్టింగ్‌ను పరిచయం చేశాడు. ఆ టోర్నీలో 18 సిక్స్‌లు బాదాడు. ఉత్తర్ ప్రదేశ్ మీరట్‌లో 2003 డిసెంబర్ 6న జన్మించాడు. అతను రైట్ హ్యాండ్ బ్యాటర్ సహా ఆఫ్ బ్రేక్ బౌలింగ్ కూడా చేయగలడు. 2021 డిసెంబర్ 11న లిస్ట్- ఏ క్రికెట్ డెబ్యూ చేశాడు. 2021-22 విజయ్ హజారే ట్రోఫీ టోర్నమెంట్‌లో కూడా ఆకట్టుకున్నాడు. రిజ్వీ పది సంవత్సరాల వయసు నుంచే మీరట్ గల్లీల్లో తన ఫ్రెండ్స్‌తో కలసి క్రికెట్ ఆడడం మొదలుపెట్టాడు. ఇక అతను మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు వీరాభిమాని.



## ఐపీఎల్ 2024 వేలంలో
# ప్రత్యేక ఆకర్షణగా రిషభ్ పంత్



- తొలి యాక్టివ్ కెప్టెన్‌గా పాల్గొన్న పంత్
- ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున ప్లేయర్లను కొనుగోలు చేసిన పంత్
- మునుపటి ఫామ్ అందుకొని ఐపీఎల్‌లో ఆడతాడా?

దుబాయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024కు ముందు నిర్వహించిన మినీ వేలం ప్రక్రియలో భారత క్రికెటర్ రిషబ్ పంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. దుబాయి వేదికగా జరుగుతున్న ఈ వేలంలో లీగ్‌లోని అన్ని ఫ్రాంచైజీలు తమ వ్యూహాలతో అడుగు పెట్టాయి. అయితే అన్ని ఫ్రాంచైజీలతో పోలిస్తే ఢిల్లీ క్యాపిటల్స్ ఆక్షన్ టేబుల్ చాలా ఆసక్తికరంగా ఉంది. అందరి దృష్టినీ ఆకర్షించింది. గాయంతో సుమారు ఏడాది కాలంగా క్రికెట్‌కు దూరమైన టీమిండియా యువ వికెట్‌కీపర్ రిషభ్ పంత్ కూడా వేలం ప్రక్రియలో పాల్గొనడమే అందుకు కారణం. రిషభ్ పంత్ ప్రస్తుతం ఢిల్లీకి కెప్టెన్‌గా ఉన్న సంగతి విదితమే. వేలంలో ఆటగాళ్లను దక్కించుకునేందుకు ప్రైస్ కార్డులు ప్రదర్శిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు పంత్. ఐపీఎల్ -2024 వేలానికి ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 28.95 కోట్లతో బరిలోకి దిగింది. సాధారణంగా యాక్టివ్ ప్లేయర్లు వేలంలో తమ పేరును రిజిస్టర్ చేసుకుంటారు. కానీ పంత్ మాత్రం ఆటగాళ్లను తీసుకునేందుకు ఫ్రాంచైజీతో కలసి వేలానికి వచ్చేశాడు. దీనితో పంత్ అరుదైన ఒక రికార్డు సాధించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 16 ఏళ్ల చరిత్రలో ఏ యాక్టివ్ కెప్టెన్ కూడా వేలం ప్రక్రియలో పాల్గొనలేదు. కానీ, వాటన్నింటినీ తిరగరాస్తూ రిషభ్ వంత్ రికార్డు సృష్టించాడు. ఫ్రాంచైజీ ఓనర్స్, కోచ్ రికీ పాంటింగ్‌తో కలసి స్ట్రాటజీలు వేసిన పంత్ వేలంలో ఎవర్ని కొనాలో విలువైన సలహాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై ఇండియన్ ప్రీమియర్ లీగ్ అధికారిక ఖాతా నుంచి ఒక స్పెషల్ వీడియో విడుదలైంది. ఇలా ఆటగాళ్లను తీసుకునే వేలం ప్రక్రియలో పాల్గొనడం తనకు మొదటిసారి అని పంత్ చెప్పుకొచ్చాడు. తమ జట్టుకు అవసరమైన ఆటగాళ్లను దక్కించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశాడు పంత్. రోడ్డు ప్రమాదానికి గురైనప్పటి నుంచి రికవరీ వరకు ఎంతో ప్రేమ అందించిన అభిమానులకు ఆతను కృతజ్ఞతలు చెప్పాడు. కఠోర సాధన చేస్తూ తిరిగి ఫామ్ అందుకునే ప్రయత్నం చేస్తున్న పంత్ ఐపీఎల్ 2024లో ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# చివరిలో ఎంటరై కివీస్ హిట్టర్‌ను ఎగరేసుకెళ్లిన సీఎస్కే

- న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ డారిల్ మిచెల్‌కు భారీ ధర
- రూ. 14 కోట్లతో కొనుగోలు చేసిన చెన్నై సూపర్ కింగ్స్
- హర్షల్ పటేల్‌కు రూ.11.75 కోట్లు
- భారీ ధరకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్



దుబాయి : ఈసారి ఐపీఎల్ వేలంలో భారీ ధర పలుకుతుందని అంచనా వేసిన ఆటగాళ్లలో న్యూజిలాండ్ హిట్టర్ డారిల్ మిచెల్ ఒకడు. నిలకడగా ఆడుతూ భారీ స్కోర్లు నమోదు చేస్తుండే మిచెల్ కోసం ఫ్రాంచైజీలు పోటీ పడతాయని భావించారు. అంచనాలకు తగినట్లుగానే తాజా ఐపీఎల్ వేలంలో డారిల్ మిచెల్‌కు భారీ ధర పలికింది. ఆ ఆజానుబాహుడిని చెన్నై సూపర్ కింగ్స్ రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. డారిల్ మిచెల్ కనీస ధర రూ. 1 కోటి. అతని కోసం పలు ఫ్రాంచైజీలు వేలంపాట పెంచేశాయి. అతనికోసం తొలి దశలో చెన్నై ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. వ్యూహాత్మకంగా మౌనంగా ఉండిపోయింది. అయితే, రూ. 11 కోట్ల పాట వద్ద ఎంటరైన చెన్నై ఫ్రాంచైజీ వర్గాలు రూ. 14 కోట్లతో అతనిని ఎగరేసుకెళ్లాయి. వాస్తవానికి, డారిల్ మిచెల్‌ను చెన్నై ఫ్రాంచైజీ కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నాయని వేలానికి కొన్ని రోజుల ముందే కథనాలు వచ్చాయి. అయితే, వేలం మొదలైన తరువాత అతని కోసం చెన్నై ఎటువంటి ప్రయత్నాలూ చేయకపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. వారిని మరింత ఆశ్చర్యానికి గురి చేస్తూ చివర్లో ఎంటరైన చెన్నై తాను కోరుకున్న ఆటగాడిని వ్యూహాత్మకంగా చేజిక్కించుకుంది. ఇక, ఈసారి వేలంలో జాక్‌పాట్ కొట్టినవాళ్లలో హర్షల్ పటేల్ కూడా ఉన్నాడు. అతనిని వేలంలో రూ. 11.75 కోట్లకు పంజాబ్ కింగ్స్ సొంతం చేసుకుంది. అతని కి అంత ధర లభించడం క్రికెట్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. అంత ప్రతిభావంతుడే అయితే టీమిండియాలో ఉండేవాడు కదా అని క్రికెట్ పండితులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక, ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్‌ను రూ. 4.2 కోట్లకు పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసింది. దక్షిణాఫ్రికా కొత్త పేసర్ గెరాల్డ్ కోట్జీ కూడా ఈ వేలంలో మెరుగైన ధర అందుకున్నాడు. మొన్నటి వరల్డ్ కప్ ద్వారా అందరి దృష్టిలో పడిన కోట్జీ కనీస ధర రూ. 2 కోట్లు కాగా, అతనిని వేలంలో ముంబయి ఇండియన్స్ రూ. 5 కోట్లకు కైవసం చేసుకుంది.

## వరల్డ్ కప్ టోర్నీలో రాణించిన
# శ్రీలంక పేసర్‌కు ఐపీఎల్‌లో భారీ ధర

- దిల్షాన్ మధుశంకను రూ. 4.6 కోట్లకు కొనుగోలు చేసిన ముంబయి ఇండియన్స్
- వరల్డ్ కప్ టోర్నీలో 21 వికెట్లు తీసిన మధుశంక

దుబాయి : ఇటీవల ముగిసిన వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో శ్రీలంక ఒక జట్టుగా విఫలం అయినప్పటికీ, యువ పేసర్ దిల్షాన్ మధుశంక తన బౌలింగ్ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. భారత గడ్డపై జరిగిన వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో 21 వికెట్లు సాధించడం 23 ఏళ్ల ఆ లెఫ్టార్మ్ సీమర్ ప్రతిభకు నిదర్శనం. అతనీ బౌలింగ్ నైపుణ్యానికి ఐపీఎల్‌లో న్యాయం జరిగింది. దిల్షాన్ మధుశంకను తాజా వేలంలో రూ. 4.6 కోట్లతో ముంబయి ఇండియన్స్ కొనుగోలు చేసింది. కొత్త బంతితో తొలి ఓవర్లలో వికెట్లు తీయడం, పాత బంతితో చివరి ఓవర్లలో పరుగులు రాకుండా తెలివిగా బంతులు వేయడం మధుశంక ప్రత్యేకత. అతని బౌలింగ్‌లో మంచి పేస్ ఉండడంతో భారత పిచ్‌లపై ఇటీవల వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో మెరుగ్గా రాణించాడు. తాజా వేలంలో మధుశంక కోసం ముంబయి ఇండియన్స్, లక్నో సూపర్ జెయింట్స్ హోరాహోరీ పోటీ పడ్డాయి. చివరికి అతనిని ముంబయి చేజిక్కించుకుంది.

# డంకీ డైరీస్‌ను ఆవిష్కరించిన చిత్ర యూనిట్

కింగ్ ఖాన్ షారూక్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ హిరానీ కాంబినేషన్‌లో రూపొందిన భారీ చిత్రం డంకీ. డిసెంబర్ 21న ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. సమయం దగ్గరపడే కొద్దీ ఈ సినిమా రిలీజ్ ఎప్పుడెప్పుడు అవుతుందా.. అని ఆసక్తిగా ఫ్యాన్స్, ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అందరిలోనూ క్యూరియాసిటీ పెరిగిపోతుంది. షారూక్ సహా ఎంటైర్ టీమ్ డంకీ ప్రమోషనల్ యాక్టివిటస్‌లో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం షారూక్ గ్లోబల్ విలజ్‌గా ప్రసిద్ధికెక్కిన దుబాయ్‌లో ఏర్పాటు చేసిన గ్రాండ్ ఈవెంట్లో ఈ చిత్రాన్ని ప్రమోట్ చేశారు. అందులో భాగంగా దుబాయ్‌లోని వోక్స్ సినిమాను సందర్శించారు షారూక్. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది అభిమానులు పాల్గొనటం విశేషం. ఇప్పటికే డంకీ సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. ఈ క్రమంలో మేకర్స్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్‌తో డంకీ డైరీస్‌ను ఆవిష్కరించారు. ఇందులో డంకీ సినిమాను రూపొందించే క్రమంలో మరచిపోలేని జ్ఞాపకాలు, ఎదుర్కొన్న ఆటుపోట్లు, సరదాలు, సంతోషాలను పొందుపరిచారు.



# సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసిన సినీ ప్రముఖులు



తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో సినీ ప్రముఖులు కలిసి అభినందనలు తెలియజేశారు. మంత్రిని కలిసి అభినందనలు తెలిపినవారిలో తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సునిల్నారంగ్, కార్యదర్శి అనుపమరెడ్డి, కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల పాండురంగారావు, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దిల్‌రాజు, కార్యదర్శి దామోదర్ ప్రసాద్, తెలంగాణ సినిమా రచయితల సంఘం అధ్యక్షులు వులి అమృత్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ కార్యదర్శి టి. ప్రసన్నకుమార్, దర్శకులు కె. రాఘవేంద్రరావు. సినీ నిర్మాతలు దగ్గుపాటి సురేష్‌బాబు, సి. కళ్యాణ్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సుధాకర్‌రెడ్డి తదితర ప్రముఖులు కలిసి సినిమా రంగంలోని పలు విషయాలపై చర్చించారు.



తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దిల్‌రాజు, సినీ నిర్మాత గొట్టిముక్కల పాండురంగారవు

# అన్ని ఎలిమెంట్స్ ఉన్న అసలు సిసలైన సంక్రాంతి సినిమా హనుమాన్ : హీరో తేజ సజ్జా



ఒరిజినల్ సూపర్ హీరో 'హను-మాన్' ట్రైలర్ కోసం ఎంతగానో ఎదురుచూస్తున్న రోజు రానేవచ్చింది. హీరో తేజ సజ్జ, దర్శకుడు ప్రశాంత్ వర్మ మాగ్నమ్ ఓపస్ 'హను-మాన్' థియేట్రికల్ ట్రైలర్ గ్రాండ్ గా లాంచ్ అయ్యింది. అఖండ భారతంలోని ఇతిహాసాల నుండి ప్రేరణ పొందిన ట్రైలర్ లోని మొదటి ఫ్రేమ్ మనల్ని ఫాంటసీ యూనివర్స్ అంజనాద్రి లోకి తీసుకువెళుతుంది. అండర్ వాటర్ సీక్వెన్స్ నేపథ్యంలో వచ్చే సన్నివేశంలో యథో ధర్మ తతో హనుమా... యథో హనుమ తతో జయ... అనే శ్లోకంతో నక్షత్రంలా మెరుస్తున్న ముత్యపు చిప్పకు దగ్గరగా కథానాయకుడు వెళుతున్నట్లు అద్భుతంగా ప్రజంట్ చేశారు. హీరో తేజ సజ్జ మాట్లాడుతూ.. నిజాయితీగా కష్టపడి పని చేస్తే విజయం చేకూరుతుందని అంటారు. అందరినీ అలరించాలని ఈ సినిమా కోసం వందకి వందశాతం కంటే ఎక్కువ కష్టపడి పని చేశాను. నా ప్రయత్నం నేను చేశాను. విజయం వస్తుందనే ఆశిస్తున్నాను. మామూలు కుర్రాడికి దేవుని ఆశీస్సులతో సూపర్ పవర్స్ వస్తే వాడు చేసే అసాధారణ పనులు ఎమిటనేది ఈ సినిమా కథ. ఇప్పుడు నా పరిస్థితి కూడా అలానే వుంది. ఒక మామూలు కుర్రాడిని. హనుమాన్ అనే సినిమా సూపర్ పవర్ లా నా చేతిలో వుంది. ఇంక అసాధారణ పనులు చేయడమే బాకీ. అవన్నీ జరిగిపోతాయని భావిస్తున్నాను. దేవుని ఆశీస్సులు ప్రేక్షకుల ప్రేమతో ఖచ్చితంగా మేము మా లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇంత గొప్ప సినిమా కోసం అహర్నిశలు కష్టపడుతూ సినిమా తప్పితే మరో ఆలోచన లేకుండా పని చేస్తున్న ప్రశాంత్ వర్మ గారికి థాంక్స్ చెప్పడం చాలా చిన్న మాట. నిర్మాత నిరంజన్ గారు చాలా పాజిటివ్ పర్సన్. సినిమా కోసం చాలా ఎఫర్ట్ పెట్టారు. ఈ పండక్కి హనుమాన్ వస్తుంది. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలన్న అసలు సిసలైన సంక్రాంతి సినిమా ఇది. ఫ్యామిలీ అంతా కలసి చూడదగ్గ సినిమా ఇది. పిల్లలకి హను మ్యాన్ పాత్ర చాలా నచ్చేస్తుంది. సంక్రాంతి అందరూ థియేటర్స్ కి రండి. హనుమాన్ మిమ్మల్ని చాలా గొప్పగా ఎంటర్ టైన్ చేస్తుంది అన్నారు.

# ప్రపంచాన్ని ఆవిష్కరించే పాషన్ మూవీ



సుధీష్ వెంకట్, అంకిత సాహ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా పాషన్. ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్ నేపథ్యంగా సాగే ప్రేమ కథా చిత్రమిది. ఈ సినిమాను తోలు బొమ్మలాట ఫిల్మ్స్ బ్యానర్ పై డాక్టర్ అరుణ్ మొండితోక, నరసింహ, ఏ పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. పాషన్ చిత్రంతో ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ జోషువా దర్శకుడిగా తెలుగు తెరకు పరిచయమవుతున్నారు. ఆయన స్టార్ డైరెక్టర్స్ శేఖర్ కమ్ముల, మదన్, మోహన కృష్ణ ఇంద్రగంటి వంటి వారి వద్ద పనిచేశారు. మంగళవారం హైదరాబాద్ లో పాషన్ సినిమా లాంఛనంగా ప్రారంభోత్సవం జరువుకుంది. ప్రముఖ దర్శకులు శేఖర్ కమ్ముల ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ నిచ్చారు. ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ మొండితోక కెమెరా స్విచ్చాన్ చేయగా... దర్శకుడు వేణు ఊడుగుల ఫస్ట్ షాట్ డైరెక్షన్ చేశారు. నిర్మాత పద్మనాభ రెడ్డి స్క్రిప్ట్ ను దర్శకుడు అరవింద్ జోషువాకు అందజేశారు. ఈ సందర్భంగా దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ – ఈ స్టోరీ రాయడం, దాన్ని నవలగా ప్రచురించడం, సినిమా తీసే ప్రయత్నం...నాకు అన్నీ తెలియజేస్తూ ఉన్నాడు అరవింద్. ఇది చాలా మంచి కథ. నేను అంతా కొత్తవాళ్ళతో తీసిన హ్యాపీడేస్ లా పాషన్ కూడా యూత్ ని ఆకట్టుకుని, ఇన్ స్పైర్ చేసే మంచి సినిమా అవుతుందని నమ్ముతున్నాను అన్నారు. నిర్మాత అరుణ్ మొండితోక మాట్లాడుతూ – ఎక్కడా కాంప్రమైస్ కాకుండా కేవలం కథని, దాన్ని హానెస్ట్‌గా సినిమాగా తీయడాన్నే నమ్మిన డైరెక్టర్ అర వింద్. అదే సినిమాకి బలమని నమ్ముతున్నాం. త్వరలోనే మా సినిమాను రెగ్యులర్ షూటింగ్ కు తీసుకెళ్తాం అన్నారు. దర్శకుడు వేణు ఊడుగుల మాట్లాడుతూ – పాషన్ నవల చదివాను. నాకు బాగా నచ్చింది మంచి వాక్యం, భావం ఉన్న రచయిత అరవింద్. డైరెక్టర్‌గా కూడా అదే ప్రభావవంతమైన సినిమా తీస్తాడని ఆశిస్తున్నా అన్నారు.

# దుబాయ్‌లో మార్చ్ 3న గామా టాలీవుడ్ మూవీ అవార్డులు



దుబాయ్‌లో ప్రతి సంవత్సరం అంగ రంగ వైభవంగా జరిగే గామా అవార్డ్స్ గల్ఫ్ తెలుగు సినీ అవార్డ్స్ చరిత్రలో ఒక ట్రెండ్ సృష్టించింది. అదే స్ఫూర్తితో 2024 మార్చి 3న మరింత భారీగా గామా అవార్డ్స్ కార్యక్రమం నిర్వహించబోతున్నారు నేషనల్ అవార్డ్ విన్నర్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రత్యేక అతిథిగా గామా నేషనల్ ఐకాన్ అవార్డ్ అందించాలని, తెలుగు సినిమా చరిత్రలోనే అత్యధిక కలెక్షన్లు సాధించడంతో పాటు 57 ఏళ్ల నేషనల్ అవార్డ్ చరిత్రలో జాతీయ స్థాయిలో మొట్టమొదటి సారి, ఉత్తమ నటుడిగా నేషనల్ అవార్డు అందుకున్న తెలుగు తేజం ఐకాన్ స్టార్ శ్రీ అల్లు అర్జున్ గారికి , వేలాదిమంది తెలుగు, తమిళ, మళయాల సినీ ప్రేమికుల మధ్యలో దుబాయ్ గామా వేదిక పై ప్రత్యేక సత్కారం చేయాలని, భావిస్తున్నట్లు గామా అవార్డ్స్ చైర్మన్ శ్రీ కేసరి త్రిమూర్తులు తెలియజేసారు. మార్చ్ 3,2024 న దుబాయిలో జరగబోయే ఈ గామా అవార్డ్స్ కార్యక్రమానికి తెలుగు సినిమా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరవుతున్నారు. 2021,2022, 2023 సంవత్సరంలో ఉత్తమ చిత్రాలు, నటులు, దర్శకులు, సంగీతం విభాగాలలో ప్రతిష్టాత్మకమైన గామా అవార్డ్స్ అందజేయనున్నట్టు, అదేవిధంగా, గామా స్థాపించినప్పటి నుండి ఈనాడు ఈటీవీ లో ప్రసారం చేస్తూ గామా అవార్డు వేదికకు సహాయ, సహకారాలు అందిస్తున్న ఈటీవీ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేస్తూ, ఈ సారి కూడా గామా అవార్డు ఫంక్షన్ ను ఈటీవీ లో ప్రసారం చేయడం సంతోషంగా ఉంది అని గామా అవార్డ్స్ సీఈఓ సౌరభ్ కేసరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ దర్శకులు సుకుమార్(పుష్ప), బాబీ(వాల్తేరు వీరయ్య), బుచ్చిబాబు సన(ఉప్పెన), మెగా బ్రదర్ నాగబాబు ప్రముఖ దర్శకులు శ్రీ వీ.ఎన్.ఆదిత్య , నిర్మాతలు మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత శ్రీ నవీన్, వైజయంతి మూవీస్ వారసురాళ్లు శ్రీమతి స్వప్న దత్, ప్రియాంక దత్(సీతారామం), శ్రీ డివివి దానయ్య(ఆర్ఆర్ఆర్), శ్రీ టిజి విశ్వప్రసాద్ గారు(పీపుల్ మీడియా ఫ్యాక్టరీ), గీతా ఆర్ట్స్ సంస్థ, నిర్మాత శ్రీ బన్నీ వాసు గార, హైపర్ ఆది నిర్వహణలో 10వేల మందికి పైగా ప్రేక్షకుల సాక్షిగా అలరించబోతున్నట్టు గామా అవార్డ్స్ జ్యూరీ సభ్యులు మరియు గౌరవ సలహాదారుడు ప్రముఖ దర్శకులు శ్రీ వివిన్ ఆదిత్య తెలిపారు.

# రాచరికం అరాచకంగా ఉండబోతోంది



చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ ఈశ్వర్ నిర్మిస్తున్న చిత్రం రాచరికం. విజయ్ శంకర్ హీరోగా, అప్సరా రాణి హీరోయిన్గా రాబోతోన్న ఈ మూవీకి సురేష్ లంకలపల్లి కథ, కథనాన్ని అందిస్తు దర్శకత్వాన్ని వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ కొట్టగా.. నిర్మాత డీఎస్ రావు కెమెరా స్విస్ ఆన్ చేశారు. నిర్మాత ఈశ్వర్ స్క్రిప్ట్ను అందజేశారు. ఈ చిత్రానికి వెంగి సంగీతాన్ని అందించగా.. ఆర్య సాయి కృష్ణ కెమెరా మెన్ గా పని చేశారు. ఈ మూవీకి జేపీ ఎడిటర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దర్శకుడు సురేష్ లంకలపల్లి మాట్లాడుతూ.. చిల్ బ్రోస్ ఎంటర్టైన్మెంట్స్ మీద రాచరికం అనే సినిమాను తీస్తున్నాము. ఈ మూవీ గ్లింప్స్ ప్రస్తుతం మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. గ్లింప్స్లో వెంగి ఇచ్చిన మ్యూజిక్ బాగుంది. ప్రతీ పాత్రకు ఇంపార్టెన్స్ ఉంది. ఇకపై కంటిన్యూగా అప్డేట్లు ఇస్తుంటాం. నాకు సహకరించిన టీంకు థాంక్స్. ఈ రోజు మా ఈవెంట్కు గెస్టులుగా వచ్చిన రాజ్ కందుకూరి, డీఎస్ రావులకు థాంక్స్ అని అన్నారు. నిర్మాత ఈశ్వర్ మాట్లాడుతూ.. దర్శకుడు సురేష్తో ఆరు నెలలుగా ప్రయాణించాం. సినిమా అద్భుతంగా వస్తుంది అనే నమ్మకం ఉంది. గ్లింప్స్ అందరినీ ఆకట్టుకుంటోంది. సినిమాకు పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీ తరువాత పనిచేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు వస్తుంది అని అన్నారు. అప్సరా రాణి మాట్లాడుతూ.. చిల్ బ్రోస్ సంస్థ నన్ను ఈ పాత్ర కోసం అప్రోచ్ అయింది. కథ విన్నప్పుడే ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందని నమ్మాను. ఇంత మంచి చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు థాంక్స్. రాచరికంతో అరాచకం సృష్టించబోతున్నామని అన్నారు.

# వైరల్‌గా మారిన కరీంనగర్స్ మోస్ట్ వాంటెడ్



పొలిటికల్ క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ కరీంనగర్స్– మోస్ట్ వాంటెడ్ ఇప్పుడు టాక్ అఫ్ ది టౌన్ గా మారింది. స్ట్రీట్ బీట్జ్ సినిమా నిర్మాణంలో బాలాజీ భువనగిరి దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరిస్ డిసెంబర్ 22న ఆహా ఓటీటీలో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సిరిస్ ట్రైలర్ మరియు కరీంనగర్స్ వాలే పాట సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. కరీంనగర్‌లోని నలుగురు సామాన్య కుర్రాళ్ళ జీవితాలని ఆసక్తికరంగా పరిచయం చేస్తూ మొదలైన ట్రైలర్, యాక్షన్ డ్రామా ఎమోషన్స్ తో కట్టిపడేసింది. ట్రైలర్ లో అద్భుతమైన పెర్ఫార్మెన్స్‌లు కనిపించాయి. నూతన నటులు అమన్ సూరేపల్లి, సాయి సూరేపల్లి ,అనిరుధ్ తుకుంట్ల ఇలా అంతా కొత్త నటులైనా, తమ సహజత్వంతో మంచి నటనని కనబరిచారు. దర్శకుడు బాలాజీ భువనగిరి కథనాన్ని గ్రిప్పింగ్ గా నడిపారు. సంకీర్త్ రాహుల్ కెమరావర్క్ బ్రిలియంట్ గా వుంది, సాహిత్య సాగర్ సంగీతం, ఎస్.అనంత్ శ్రీకర్ నేపథ్య సంగీతం ఆకట్టుకున్నాయి. ప్రొడక్షన్ వాల్యూస్ టాప్ క్లాస్ లో వున్నాయి. 'బలగం' ఫేం రైటర్ రమేష్ ఎలిగేటి ఈ సిరిస్ కు పవర్ ఫుల్ కథా, కథనం, సంభాషణలు అందించారు.

# ధిర ధిరన లిరికల్ వీడియో విడుదల



తన్విక అండ్ మోక్షిక క్రియేషన్స్ పతాకంపై నూతన తారలు రవితేజ నున్న హీరోగా, నేహ జురెల్ హీరోయిన్ గా రూపొందుతున్న చిత్రం ' రాజు గారి అమ్మాయి – నాయుడు గారి అబ్బాయి'. సత్య రాజ్ దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి రామిసెట్టి సుబ్బారావు, ముత్యాల రామదాసు నిర్మాతలు. యువ ప్రతిభావంతులు కలిసి రూపొందిస్తున్న రాజుగారి అమ్మాయి నాయుడుగారి అబ్బాయి చిత్రం నుండి ఇప్పటికే విడుదలైన ఐ లవ్ యు గీతం ప్రేక్షకులను కట్టిపడేసింది. తాజాగా ఈ చిత్రం నుంచి శృంగార గీతం ధిర ధిరన లిరికల్ వీడియో విడుదలైంది. ప్రముఖ సంగీత దర్శకుడు కోటి తనయుడు రోషన్ సాలూరి ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం చేయటం విశేషం. రోషన్ సాలూరి స్వరపరిచిన ధిర ధిరన గీతం ఆకట్టుకుంటోంది. సాహితి చాగంటి ఆలపించిన ఈ పాటకు రెహమాన్ సాహిత్యం అందించారు. రోషన్ సాలూరి మధురమైన సంగీతానికి సాహితి చాగంటి గాత్రం, రెహమాన్ సాహిత్యం తోడై పాట మరింత అందంగా మారింది. లిరికల్ వీడియోలో నాయికా నాయకుల మధ్య కెమిస్ట్రీ చక్కగా కుదిరింది. థియేటర్లలో ఈ సాంగ్ యువత మనసు దోచుకోవడం ఖాయమనిపిస్తోంది.

# మహతి గ్రాండ్‌గా ప్రారంభం



యంగ్ ట్యాలెంటెడ్ హీరో సందీప్ మాధవ్ కథానాయకుడిగా శివ ప్రసాద్ స్వీయ దర్శక నిర్మాణంలో శ్రీ పద్మిని సినిమాస్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న చిత్రం 'మాహతి'. సుహాసిని మణి రత్నం, దీప్సిక కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమై యింది. ముహూర్తపు సన్నివే షానికి చంద్రమౌళి క్లాప్ కొట్టగా, పద్మ కెమరా స్విచాన్ చేశారు. సుహాసిని మణి రత్నం మేకర్స్ కు స్క్రిప్ట్ ని అందించగా తొలి షాట్ కి రాజారవీంద్ర గౌరవ దర్శ కత్వం వహించారు.

సినిమా లాంచింగ్ ఈవెంట్ లో సుహాసిని మణిరత్నం మాట్లాడుతూ.. మహతి సినిమా ముహూర్తంలో అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా వుంది. నా తొలి సినిమా విడుదలై నేటికి సరిగ్గా 43 ఏళ్ళు అవుతుంది. పరిశ్రమలో 44 ఏడాదిగా మహతి సినిమాతో ప్రారంభిస్తున్నాను. ఇప్పటివరకూ కెరీర్లో ఎన్నో చిత్రాలు చేశాను. ఎన్నో జయపజయలు చూశాను. అవన్నీ గతంలోనే వదిలేసి ఇప్పుడు తొలి సినిమా చేస్తున్న అనుభూతితోనే ఈ చిత్రాన్ని చేస్తున్నాను. తెలుగు సినిమాలో చేయడం ఒక అలవాటుగా మారింది. కథ, పాత్ర నచ్చితేనే సినిమా చేస్తాను. మహతి కథ, నా పాత్ర చాలా నచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్, సెంటిమెంట్స్ వుంటాయి. టైటిల్ కి తగట్టు మహిళా ప్రాధాన్యత గల చక్కని అంశాలు వున్నాయి. ఒక క్రైమ్ చేయడం కంటే ఆ క్రైమ్‌ని చూస్తూ ఏం చేయకుండా ఊరుకోవడం ఇంకా పెద్ద క్రైమ్. అదే ఈ సినిమా ప్రధానాంశం. ఇందులో వుండే పాత్రలని అద్భుతంగా తీర్చిదిద్దారు దర్శకుడు. చాలా మంచి టీం కలసి పని చేస్తున్నాం. టీం అందరికీ బెస్ట్ విషెస్ తెలిపారు. సందీప్ మాధవ్ మాట్లాడుతూ.. మహతి కథ వినప్పుడు చాలా ఎక్సయిటింగ్ ఫీలైయ్యాను. డైరెక్టర్ శివ గారు ఆద్యంతం ఆకట్టుకునేలా ఈ కథని తీర్చిదిద్దారు. నా పాత్రకు డిఫరెంట్ షేడ్స్ వుంటాయి. చాలా అద్భుతంగా డిజైన్ చేశారు. సుహాసిని గారితో స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా అనందంగా వుంది. ఈ చిత్రానికి రాహుల్ డీవోపీగా పని చేస్తున్నారు. ఆయనతో వంగవీటి సినిమా చేశాను.

# సిద్ధార్థ్ రాయ్ 'నువ్వెవరో మరి' పాట



టాలీవుడ్లోని దాదావు అందరు స్టార్ హీరోలతో పనిచేసిన పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్, యంగ్ హీరో దీపక్ సరోజ్ 'సిద్ధార్థ్ రాయ్' తో హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి పెద్ద దర్శకుల దగ్గర పనిచేసిన వి యశస్వీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో వైరల్ అయ్యింది. అలాగే స్టార్ కంపోజర్ రథన్ స్వరపరిచిన చెలియాచాలు, లైఫ్ ఈజ్ దిస్ బ్యూటిఫుల్ పాటలు చార్ట్ బస్టర్ హిట్స్ గా అలరిస్తున్నాయి. ఇప్పుడు థర్డ్ సింగిల్ నువ్వెవరో మరి పాటని విడుదల చేశారు మేకర్స్. రథన్ ఈ పాట కోసం సోల్ ఫుల్ నెంబర్ ని కంపోజ్ చేశారు. బెన్నీ దయాల్ ఎనర్జిటిక్ వోకల్స్‌తో ఆకట్టుకున్న ఈ పాటకు పూర్ణాచారి అందించిన లిరిక్స్ మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. ఈ పాటలో హీరో క్యారెక్టర్‌ని ప్రజెంట్ చేసిన విధానం చాలా యూనిక్ ఉంటూ క్యూరియాసిటీని పెంచింది. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ విహిన్ క్రియేషన్స్ పతాకాలపై ప్రొడక్షన్ నెం 1గా జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయినలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.